
ప్రపంచానికి ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


కేరళ కాంగ్రెస్‌లో సిఎం పదవికి ముగ్గురు పోటీదారులు
సిఎం పదవికి స్టాలిన్ రాజీనామా
బెంగాల్ పరిశీలకుడిగా అమిత్ షా

07


సంపుటి 09, సంచిక: 156 | బుధవారం | 06-05-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




తమిళనాడు పారిశ్రామిక విధానంతో

## మరిన్ని పెట్టుబడులు

డేటా సెంటర్లకోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి ఉపయోగం

ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

ప్రజాపక్షం/హైదరాబాద్

తమిళనాడు తరహాలో పారిశ్రామిక విధానం ఉంటే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చునని, నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటే అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. డేటా సెంటర్ల కోసం పెద్ద ఎత్తున విద్యుత్, నీటి ఉపయోగం ఉంటుందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. మానవ వనరుల అభివృద్ధి కోసం పోషకాహార లోపం సమస్యను తగ్గించుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై నిర్వహించిన సమావేశంలో రఘురామ్ రాజన్ పలు సూచనలు చేశారు. పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్‌లో ఎఐ ఉపయోగంపై కమిటీ ఏర్పాటు చేస్తామని, తరువాయి 8లో

ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు


# జాతీయ హోదా ఇవ్వాలి

రైతులు పండించిన ప్రతి పంటనూ మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది

రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యం మొత్తాన్ని కేంద్రం తీసుకోవాలి

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంభీరావుపేట గ్రామంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తరువాయి 8లో



అసోం, బెంగాల్‌లో

## ఓట్ల చోరీ

ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు బిజెపి వేసిన ఒక పెద్ద ముందడుగు : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఓటమిపై కాంగ్రెస్ పార్టీలోని కొందరు సభ్యులు మురిసిపోతుండడాన్ని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. అసోం, బెంగాల్‌లలో బిజెపి ఓట్ల చోరీకి పాల్పడిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకు ఆ పార్టీ వేసిన ఒక పెద్ద ముందడుగు అని పేర్కొన్నారు. ప్రజలు చిల్లర రాజకీయాలు తరువాయి 12లో

పంట మార్పిడిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

సిఎంకు నివేదిక సమర్పించిన రైతు సంక్షేమ కమిషన్

12

## నేను రాజీనామా చేయను

ఎన్నికల ఫలితాలు ప్రజాతీర్పు కాదు, కుట్ర

ఎన్నికల్లో టిఎంసి పోరాటం బిజెపితో కాదు, కాషాయ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతో జరిగింది

'ఇండియా' కూటమిని బలోపేతం చేస్తాం

టిఎంసి చీఫ్ మమతా బెనర్జీ స్పష్టీకరణ

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రజా తీర్పు కాదు, ఒక కుట్ర అని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ పోరాటాన్ని వీధుల్లోకి తీసుకువెళతానని, ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని బలోపేతం చేస్తానని ఆమె శపథం చేశారు. మంగళవారం మమతా బెనర్జీ మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో టిఎంసి పోరాటం బిజెపితో తరువాయి 8లో



## టిఎంసి కార్యాలయాలు ధ్వంసం

కాషాయ మూకలు విధ్వంసం సృష్టించినట్లు పోలీసులు వెల్లడి

కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం అధికారి ప్రకటన

పశ్చిమ బెంగాల్‌లో ఘన విజయం సాధించిన బిజెపి, రాష్ట్ర వ్యాప్తంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) కార్యాలయాలపై దాడులు, విధ్వంసకాండకు పాల్పడింది. సోమవారం మధ్యాహ్నం నుంచి కోల్‌కతాలోని టోలీగంజ్, కాస్బా ప్రాంతాల్లోనూ; శివారు ప్రాంతాలైన బారుయ్‌పూర్, కామర్‌హటి, బారానగర్‌లలోనూ; అలాగే జిల్లాల తరువాయి 8లో



# మార్కెటింగ్ ఉచ్చులో రైతాంగం

వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల్లో కొత్త సమస్యలు

పండించడం కన్నా, విక్రయమే భారంగా మారిన దుస్థితి

ప్రజాపక్షం/ ఖమ్మం

రైతాంగం మార్కెటింగ్ ఉచ్చులో చిక్కుకుని విలవిలలాడుతుంది. ఉత్పత్తి, మద్దతు ధర ఫర్వాలేదనిపించినా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలు రైతులకు కొత్త సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను కండ్ల ముందు ఉంచుకుని అమ్ముకోలేక రైతులు పడుతున్న వ్యథ వర్ణణాతీతం. ప్రైవేటు వ్యాపారులు అందిన కాడికి దోచుకోవాలని చూస్తుండగా ప్రభుత్వ వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తున్నాయి. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తరువాయి 8లో



## వామపక్షాలతోనే కలిసి నిర్ణయం



విజయ్‌కి మద్దతు అంశం పరిశీలించలేదు

విసికె అధినేత థోల్ తిరుమావలవన్

**చెన్నై :** తమిళనాడులో టివికె ఘన విజయం సాధించగా, మెజారిటీ మార్క్‌కు 10 స్థానాల దూరంలో ఆగిపోయింది. దీంతో ఇతర పార్టీల మద్దతు అవసరం ఏర్పడింది. అయితే విజయ్ నేతృత్వంలోని టివికెకు మద్దతు ఇవ్వడం అనే అంశాన్ని తమ పార్టీ గానీ, లేదా వామపక్షాలైన సిపిఐ(ఎం), సిపిఐ గానీ ఇంకా పరిశీలించలేదని విసికె అధినేత థోల్ తిరుమావలవన్ మంగళవారం తెలిపారు. ముఖ్యమైన రాజకీయ నిర్ణయాలను వామపక్ష, సిపిఐ(ఎం) పార్టీలు సంయుక్తంగా తీసుకుంటాయన్నారు. కార్ల్ మార్క్స్ 208వ జయంతి సందర్భంగా, సిపిఐ(ఎం) నాయకుడు తిరుమావళవన్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్ ఎగ్మోర్లోని కార్మికవర్గ మహా మేధావి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు సంయుక్తంగా విలేకరులతో మాట్లాడుతూ తరువాయి 12లో

## సిఎంగా రేపే ప్రమాణం?

నేడు గవర్నర్‌ను కలవనున్న టివికె చీఫ్ విజయ్

టివికె పార్టీ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక



**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన టివికె పార్టీ శాసనసభాపక్ష నేతగా విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా టివికె ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు ఆ పార్టీ సన్నాహాలు ముమ్మరం చేసింది. గురువారం తమిళనాడు సిఎంగా విజయ్ ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే, బుధవారం గవర్నర్‌ను కలవనున్నట్లు టివికె అధ్యక్షుడు విజయ్ తెలిపారు. అంతకు ముందు తన ఇంటి నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకున్న విజయ్, పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటుపై ఆయన శాసనసభ్యులతో చర్చించారు. ఈ నేపథ్యంలోనే విజయ్‌ను శాసనసభాపక్ష నేతగా తరువాయి 12లో

# దిగుమతుల్లో వేగం పెంచాలి

మిల్లర్లకు పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు

నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/చిట్యాల



ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు సరఫరా అయ్యేందుకు కావల్సిన దిగుమతిలో వేగం పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తరలించేందుకు కావల్సిన లారీలు, హామాలీలలను పెంచాలని అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, వట్టిమర్తి గ్రామ పరిధిలో ఉన్న ఒక రైస్ మిల్లును కలెక్టర్ బి.చంద్రశేఖర్‌తో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సేకరించే ధాన్యం వివరాలను ఏ రోజుకు ఆరోజు వంద శాతం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ధాన్యం సేకరణలో ట్యాబ్ ఎంట్రీ చేయని కొనుగోలు కేంద్రాల బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, ధాన్యం శుభ్రపరిచేందుకు కావల్సిన డ్రయ్యర్‌లు, టార్పాలిన్లు కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు రైస్ మిల్లులో స్థలం సరిగ్గా తరువాయి 12లో


దశదిన కర్మ



డా॥ దొంగరి వెంకటరామ్
MA, MPhil, LLB, PhD.
(పరమపదించిన తేది : 27-04-2026)

దశదిన కర్మ:
తేది: 06-05-2026
బుధవారం
మధ్యాహ్నం 12:30గంటలకు

కార్య స్థలం:
బ్లాక్-సి, బాంక్వెట్ హాల్,
శ్రీసాయిరామ్ టవర్స్,
మంజీరా పైప్‌లైన్ రోడ్,
హాఫీజ్‌పేట్, హైదరాబాద్.

శోకతప్త హృదయాలతో....
భార్య : దొంగరి వరలక్ష్మి
కూతురు - అల్లుడు
నూతన గట్టి (హ్యాండ్‌లూమ్ బిజినెస్) - దినకర్ గట్టి (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్)
కుమారులు - కోడళ్లు
నిఖిల్ దొంగరి IRPS - కృతిక కులహరి IAS
ప్రొ॥ నిశాంత్ దొంగరి - శృతి నరిశెట్టి
IIT Hyderabad NIRDA Lecturer
మనవళ్లు, మనవరాళ్లు : నిశ్చల్, హన్షిత్, ఆద్రితి, ఆర్న.

కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కడవరకు కట్టుబడి ఆదర్శ జీవితాన్ని కొనసాగించిన డా॥ దొంగరి వెంకటరామ్ గారి మరణం బాధాకరం, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ.... మీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ...

CPI & AITUC - సూర్యాపేట



# గుత్తాధికారం దిశగా బిజెపి

సోమవారం వెలువడిన ఐదు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బిజెపి దేశవ్యాప్తంగా మరింత బలపడటాన్ని, ప్రతిపక్ష ఇండియా కూటమికి సరికొత్త ఎదురుదెబ్బలు తగిలినట్లు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. బిజెపి అసోంలో తన పరిస్థితిని మరింత పటిష్టం చేసుకుంది. కేరళలో ఒక లోక్‌సభ స్థానం గెలుచుకున్న నేపథ్యంలో తొలిసారి మూడు అసెంబ్లీ సీట్లు గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో అత్యంత శక్తిమంతురాలైన టిఎంసి అధినేత మమతా బెనర్జీని ఏ మాయోపాయాలతో అయితేనేమి అధికారం నుంచి తొలగించింది. అసెంబ్లీలో అది కలలోకూడా ఊహించనిరీతిగా మూడింట రెండు వంతులు స్థానాలు గెలుచుకుంది. రానున్న నిరంకుశ అణచివేతకు, వేధింపులకు ఇది సంకేతం. తమిళనాడులో తమ ఎఐఎడిఎంకె కూటమి మూడవస్థానంతో సరిపెట్టుకున్నా, తమ పరిస్థితి అట్టడుగునే ఉన్నప్పటికీ, బలమైన డిఎంకె చిత్తుకావటం, రాజకీయాలకు కొత్త అయిన సినీస్టార్ జోసఫ్ విజయ్‌కు అసెంబ్లీలో పూర్తి మెజారిటీ లభించని స్థితిలో తమిళ రాజకీయాల్లో వ్రేలు పెట్టే అవకాశం బిజెపికి లభించింది. దీన్ని పార్టీ విస్తరణకు అది చాకచక్యంగా ఉపయోగించుకుంటుంది. విజయ్ ప్రభుత్వానికి కేంద్రప్రభుత్వంనుంచి బుజ్జగింపులు, బెదిరింపులు తప్పవు.

స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా భారత జాతీయ కాంగ్రెస్‌కు దేశంపై లభించిన రాజకీయ ఏకచ్ఛత్రాధిపత్యం 15 సంవత్సరాల్లో – 1967 సార్వత్రిక ఎన్నికల్లో 7 రాష్ట్రాల్లో ఓటమితో బద్దలైంది. రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలకు అప్పుడే అంకురార్పణ జరిగింది. అనంతరం శ్రీమతి ఇందిరాగాంధి హయాంలో కాంగ్రెస్ తిరిగి బలోపేతమైనప్పటికీ, 1975లో అంతర్గత ఎమర్జెన్సీ విధించిన పర్యవసానంగా 1977 ఎన్నికల నాటికి మితవాద పార్టీలు – కాంగ్రెస్ (ఒ–సిండికేట్ కాంగ్రెస్), స్వతంత్ర పార్టీ, సోషలిస్టులు, జనసంఘ్ జయప్రకాశ్ నారాయణ్ సారథ్యంలో ఏకమై కాంగ్రెస్‌ను ఓడించి, జనతాపార్టీగా ఏర్పడి దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. జనతాపార్టీలో భాగస్వామిగా ఉంటూ ఆర్‌ఎస్ఎస్ సభ్యత్వం (ద్వంద్వ సభ్యత్వం) కొనసాగింపుపై తలెత్తిన వివాదంలో ఆర్ఎస్ఎస్ సభ్యత్వం వదులుకోవటానికి జనసంఘ్ నిరాకరించటంతో ఆ ప్రభుత్వం అంతర్గత విభేదాలతో కూలిపోయింది. ఆ తదుపరి 1980లో ఎ.బి.వాజ్‌పేయి, ఎల్.కె.అద్వానీ నాయకత్వంలో జనసంఘ్ భారతీయ జనతాపార్టీ (బిజెపిగా) రూపాంతరం చెందింది. గాంధేయ సోషలిజం తమ సిద్ధాంతంగా మోసకారి ప్రకటన చేసింది. అది ఆచరణలో 'సాంస్కృతిక జాతీయవాదం' సిద్ధాంతాన్ని – అనగా హిందూత్వ ఆధిపత్యవాదాన్ని విరివిగా ప్రచారం చేసింది. అందుకనుగుణంగా అయోధ్యలో రామజన్మభూమి వివాదాన్ని పార్టీ ఎజండాలోకి తీసుకుంది.

ఈ మధ్యకాలంలో – 1967లో ఆరంభమైన కాంగ్రెస్ వ్యతిరేక సంకీర్ణ ప్రభుత్వాల శకం 1980 అనంతరకాలంలో ప్రాంతీయ ఆకాంక్షల వ్యక్తీకరణకు ప్రతిబింబంగా అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ వ్యతిరేక ప్రాంతీయ పార్టీల ఆవిర్భావంతో సరికొత్త రాజకీయ శకం ఆరంభమైంది. జనతాపార్టీ విచ్ఛిత్తి ఈ క్రమాన్ని వేగిరపరిచింది. అదే సమయంలో కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపురల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలకు ప్రజలు పట్టంగట్టారు. కాంగ్రెస్ బలహీనపడింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తూ దేశ పాలనా స్వరూపంలో నిజమైన సమాఖ్య వ్యవస్థ దర్శనమిచ్చింది. అయితే అదే సమయంలో, దేశ రాజకీయ, పరిపాలనా వ్యవస్థలో అస్థిరత చోటుచేసుకుంది.

ప్రాంతీయ పార్టీల శకం గుర్తుచేసుకోదగింది. తమిళనాడులో డిఎంకె, ఎఐఎడిఎంకె; కేరళలో యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్; కర్నాటకలో జెడి(ఎస్), ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి, రాష్ట్ర విభజన తర్వాత ఎపిలో టిడిపి, వైఎస్సార్‌కాంగ్రెస్; తెలంగాణలో టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్; ఒరిస్సాలో బిజూ జనతాదళ్, బిహార్‌లో ఆర్‌జెడి, జెడి(యు), ఎల్‌జెపి; యుపిలో బిఎస్‌పి, ఎస్‌పి; జార్ఖండ్‌లో జెఎంఎం; పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్; హర్యానాలో లోక్‌దళ్, మహారాష్ట్రలో ఎన్‌సిపి, శివసేన; జమ్మూ–కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్; అసోంలో అస్సాం గణపరిషత్, గోవాలో మహారాష్ట్రవాది గోమంతక్‌పార్టీ తర్వాతకాలంలో ఢిల్లీతోపాటు పంజాబ్‌లో ఆమ్ ఆద్మీపార్టీ; వగైరాలు తమతమ రాష్ట్రాల్లో ఏదోక సమయంలో పాలకపార్టీలు అయినాయి.

కాని 2014 లో బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినది లగాయితూ అత్యధిక పార్టీలు అవకాశవాదంతో బిజెపికి చేరువైనాయి. బిజెపి నేర్పుగా తన అధికారం పటిష్టం చేసుకునేందుకు ప్రాంతీయ పార్టీలను ఉపయోగించుకుంటున్నది లేదా వాటిని మింగుతున్నది. ఇవాళ నరేంద్రమోదీ ప్రభుత్వం మనుగడ సాగిస్తున్నదంటే అందుకు ప్రధాన మద్దతుదారులు తెలుగుదేశం, జెడి(యు)లే కదా! తాజా అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, తమిళనాడుల్లో తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెల ఓటమి ప్రతిపక్ష ఇండియా కూటమికి బలమైన ఎదురుదెబ్బ. మరోరకంగా చూస్తే ఆకాంక్షాపరులైన నాయకులు అహంభావం విడనాడి ఏకత్రాటిపైకి రావలసిన సందర్భం కూడా.

ఇప్పుడు, ఫాసిస్టు స్వభావం కలిగిన బిజెపి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని మతం ప్రధాన ఆయుధంగా హిందూ ఆధిపత్య ప్రచారంతో రాజకీయ గుత్తాధిపత్యంకోసం అర్రులు చాస్తోంది. హిందీ బెల్ట్ రాష్ట్రాలు, పశ్చిమ రాష్ట్రాల తదుపరి తూర్పు రాష్ట్రాలపై అధికారాన్ని చేజిక్కించుకుంది. ఇక మిగిలింది దక్షిణాది రాష్ట్రాలు. వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకు ఈ వైపు సర్వశక్తులు ఒడ్డుతుంది. వచ్చే లోక్‌సభలో అత్యధిక మెజారిటీ సాధించే ధ్యేయంతో ఆర్‌ఎస్‌ఎస్ పరివారాన్ని పూర్తిగా ఇప్పటినుంచే రంగంలో దించుతుంది. ప్రధాని మోదీ అన్నట్లు బెంగాల్ గెలుపుతో గంగా నదీ ప్రవాహ ప్రాంతం, అసోం గెలుపుతో బ్రహ్మపుత్ర ప్రవాహ ప్రాంతంపై కాషాయ జెండా ఎగురుతోంది. ఇక కృష్ణ – గోదావరి – కావేరి ప్రాంతమే మిగిలి ఉంది.

కాబట్టి ఇండియా కూటమి పార్టీలు తాజా ఎన్నికల ఫలితాలతో నిరుత్సాహం చెందక ఒకవైపు బిజెపిపై సైద్ధాంతిక పోరాటాన్ని, రెండోవైపున మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, ప్రజల సమస్యలపై పోరాటాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలి. ఎన్నికల కమిషన్, కేంద్ర దర్యాప్తు సంస్థలు సహా రాజ్యాంగ వ్యవస్థలను తమ ఎన్నికల ప్రయోజనాలకోసం బిజెపి బరితెగించి వాడుతున్నందున ఈ పోరాటం క్లిష్టమైంది. ఇండియా కూటమి పార్లమెంటరీ వేదికకు పరిమితమైన ఆషామాషీ కూటమిగా కాకుండా పటిష్టమైన రాజకీయ కూటమిగా వ్యష్టి లేదా సమష్టి నాయకత్వం కింద పనిచేయటం అవసరం. కూటమి పార్టీలు త్వరలో సమావేశమై విధాన, సంస్థాగత నిర్ణయాలు తీసుకోవటం ఎంతైనా బిజెపి ఎన్నికలను తారుమారు చేసింది ●



## రాబోయే పంజాబ్ ఎన్నికలు మోదీకి చివరి ఎన్నిక

**బిజెపి విజయ రథాన్ని పంజాబ్ అడ్డుకుంటుంది. ఎన్నికలను తారుమారు చేస్తున్నారు. బిజెపి ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసి, చంపేసింది. పశ్చిమ బెంగాల్‌లో వారు చేసింది, న్యూఢిల్లీలోని నా అసెంబ్లీ నియోజకవర్గంలో చేసిందీ ఒక్కటే. రాబోయే పంజాబ్ ఎన్నికలు ప్రధానమంత్రి మోదీకి చివరి ఎన్నిక. ఆ తర్వాత మోదీ ప్రభుత్వం కూలిపోతుంది. బిజెపి పంజాబ్ నుండి సీట్లను దోచుకుంది, ఇప్పుడు వారిని ఆపడానికి మనమందరం కలిసి పనిచేయాలి. పంజాబ్ చారిత్రాత్మకంగా విదేశీ దురాక్రమణను అడ్డుకుంది, కానీ ఈసారి శత్రువు మనలోనే ఉన్నాడు; పంజాబీలు వారిని ఆపాలి.**

– ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



## బంధాల బౌండరీలు.. అనుబంధాల ఆంతర్యం..!

మానవ పరిణామ క్రమంలో 'కుటుంబం' అనే వ్యవస్థను నిలబెట్టడానికి ఏర్పడిన అత్యంత బలమైన సాధనం వివాహం. అయితే, ఆధునిక కాలంలో వివాహం అనే 'నిర్మాణం' పటిష్టంగానే కనిపిస్తున్నా, అందులో ఉండాల్సిన ప్రేమ, స్నేహం అనే 'నివాసం' మాత్రం శిథిలమవుతోంది. చట్టబద్ధమైన పత్రాలు, సామాజిక ఆమోదాల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేటి సంబంధాలను తాత్విక కోణంలో పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివాహబంధంలో ప్రేమ, స్నేహం లేకపోవడాన్ని తాత్విక పరిభాషలో 'అస్తిత్వ సంక్షోభం' గా పరిగణించవచ్చు. శాస్త్రీయంగా చూస్తే, ఇది కేవలం రెండు శరీరాల మధ్య జరిగే ఒక 'లావాదేవీ' మాత్రమే. ఇక్కడ బాధ్యత ఉంటుంది కానీ ఆత్మీయత ఉండదు, అవసరం ఉంటుంది కానీ ఆరాధన ఉండదు. సూటిగా చెప్పాలంటే ఒక యంత్రానికి ఇంధనం లేకపోతే అది ఎలాగైతే మొద్దుబారిపోతుందో, స్నేహం లేని వివాహం కూడా అలాగే యాంత్రికంగా మారుతుంది. ఇక్కడ 'నిశ్శబ్దం' అనేది ప్రశాంతతకు చిహ్నం కాదు, అది మాటలు చచ్చిపోయిన స్థితికి సంకేతం. సైకాలజీ ప్రకారం, ఇటువంటి బంధాల్లో ఉన్న వ్యక్తులు 'ఒంటరితనం కంటే భయంకరమైన సామీప్యతను' అనుభవిస్తారు. ఇది మనిషిలోని సృజనాత్మకతను, జీవితేచ్ఛను నెమ్మదిగా హరించివేస్తుంది. మరోవైపు, వివాహం అనే సామాజిక ముద్ర లేకపోయినా, కేవలం ప్రేమ, స్నేహాల పునాదులపై నిలబడే బంధం అత్యంత శక్తివంతమైనదిగా ఉంటుంది. ఎటువంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు లేనిచోట, ఒక వ్యక్తి మరొకరితో కలిసి ఉంటున్నారంటే, అది కేవలం వారి ఆత్మల మధ్య ఉన్న సామరస్యం వల్లే సాధ్యమవుతుంది.

ఇక్కడ మానసిక స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఒకరిని ఒకరు నియంత్రించాలనే కోరిక కంటే, ఒకరి ఎదుగుదలలో మరొకరు భాగస్వాములు కావాలనే తపన ఉంటుంది. అరిస్టాటిల్ చెప్పినట్లు, 'స్నేహం అనేది రెండు శరీరాల్లో నివసించే ఒకే ఆత్మ'. అటువంటి స్నేహం ఉన్నచోట వివాహ పత్రం లేకపోయినా, ఆ బంధం కాలాతీతంగా నిలుస్తుంది. వివాహం అనేది ఒక 'అద్దం' లాంటిదని చెప్పొచ్చు. అది సంబంధానికి ఒక రూపాన్ని ఇస్తుంది. కానీ అందులో కనిపించే 'ప్రతిబింబం' మాత్రం ప్రేమ, స్నేహాలే. అద్దం ఉండి ప్రతిబింబం లేకపోతే అది శూన్యం. అద్దం లేకపోయినా ప్రతిబింబం (అనుభూతి) ఉంటే, అది కంటికి కనిపించని సత్యం. అందుకే కావాల్సింది కేవలం 'వివాహాలు' కాదు, పరస్పర గౌరవం, స్నేహం ప్రాతిపదికన ఏర్పడే 'సుదృఢ అనుబంధాలు'. బంధం బాధ్యతగా కాకుండా, ఒక మధురమైన ప్రయాణంగా మారినప్పుడే మనిషి అస్తిత్వానికి పరిపూర్ణత లభిస్తుంది. వ్యవస్థల కంటే విలువలకే పెద్దపీట వేయాల్సిన సమయం ఇది. స్నేహం, ప్రేమ కలిగిన బంధంలో వివాహం లేకపోయినా, వివాహ బంధంలో మాత్రం ఖచ్చితంగా ప్రేమ, స్నేహం ఉండాలి. అలా ఉంటేనే ఆ వివాహ బంధం నిలబడుతుందనేది సత్యం.

కస్తూరి దారా

# వ్యవసాయ పరిశోధనల్లో నిర్లక్ష్యం వల్లే ఉత్పత్తి ఇక్కట్లు



ఎం.కోటేశ్వరరావు

పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలా లేదా అన్న అంశంపై నాలుగేండ్ల నాడు వేసిన కమిషన్ ఏం చేస్తోందో తెలియదు. వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే మద్దతు ధరలతో పాటు దిగుబడి పెంపుదల, సాగు ఖర్చుల తగ్గింపు గురించి అనేక మంది చెప్పటం తెలిసిందే. పోనీ దానికైనా గడచిన పన్నెండేళ్లలో మోదీ సర్కార్ ఏమైనా చేసిందా? వ్యవసాయ రంగంలో పరిశోధన, అభివృద్ధి తీరుతెన్నులు, ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చు గురించి రోమ్ నగరంలో ఉన్న ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఎఒ) ఏప్రిల్ 30వ తేదీన ఒక నివేదికను విడుదల చేసింది. సభ్యదేశాల ప్రభుత్వాలు అందచేసే సమాచారం మేరకు 2023వరకు ఉన్న వివరాల ప్రకారం రూపొందించిన నివేదిక. గడచిన రెండు దశాబ్దాలలో ఏటా 1.8శాతం చొప్పున పరిశోధనకు ఖర్చు పెరుగుతూ 50.4 బిలియన్ డాలర్లకు చేరింది. వర్తమాన సహస్రాబ్ది తొలి పదేండ్లలో విస్తరణ మందకొడిగా ఉందని, 2009 తరువాత పెరిగిందని గమనించారు. రైతే రాజు, దేశానికి వెన్నెముక, రైతు లేనిదే రాజ్యం లేదు వంటి మాటలు ఎన్నో విన్నాం. ఏం జరిగింది, కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుంది. ఇంటర్నేషనల్ జర్నల్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ అగ్రికల్చర్ రిసెర్చ్(ఐజెఓఇఎఆర్)2026 మార్చినెల సంచిక, పేజీ 126లో దిగువ వివరాలు ఉన్నాయి. పంట ఉత్పత్తి అంకెలను మిలియన్ మెట్రిక్ టన్నులుగా, దిగుబడి హెక్టారుకు టన్నులుగా గమనించాలి. చైనాలో మనకంటే సాగుభూమి తక్కువ, అయినా మొత్తం 69.కోట్ల టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేస్తుంటే మనం 35.4కోట్ల టన్నులు చేసి చైనా కంటే మన జనాభా అదనంగా ఉన్నప్పటికీ అవసరానికి మించి పండిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నాం.

| పంటపేరు | భారత ఉత్పత్తి | చైనా ఉత్పత్తి | భారత్ దిగుబడి | చైనా దిగుబడి |
|---|---|---|---|---|
| వరి | 147150 | 145 | 4.3 | 7.1 |
| గోధుమ | 113117 | 140 | 3.5 | 5.5 |
| మొక్కజొన్న | 35 | 280290 | 3.2 | 6.1 |
| సోయాబీన్ | 1213 | 20 | 1.2 | 1.9 |
| బంగాళదుంప | 60 | 95 | 24 | 33 |

పిండికొద్దీ రొట్టె అన్న పెద్దలే కుండలో కూడు కుండలోనే ఉండాలి పిల్లాడు దుడ్డులా పెరగాలంటే కుదరదని కూడా చెప్పారు. జనాభా అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని పెంచటంతో పాటు రైతాంగానికి గిట్టుబాటు కావాలంటే దిగుబడులను కూడా అధికంగా సాధించాలి. అందుకు పెట్టుబడి, శాస్త్రవేత్తలు కావాలి. ప్రపంచంలో 2004లో 2,04,000మంది వ్యవసాయ శాస్త్రవేత్తలు ఉంటే 2023నాటికి 3,16,000కు పెరిగారు. మనదేశంలో పరిస్థితి ఏమిటి? పూర్తికాలం పనిచేసే పరిశోధకుల సంఖ్య రెండువేల సంవత్సరంలో 11,154 మంది ఉంటే 2018లో 11,372 మంది ఉన్నారు. అదే చైనాలో ప్రస్తుతం 43వేల మంది పని చేస్తున్నారు. శాస్త్రవేత్తల సంఖ్యను బట్టే వారిమీద పరిశోధన ఖర్చుకూడా ఉంటుంది. అది అధిక దిగుబడి వంగడాలు, తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పండించటం మీద కూడా ప్రభావం చూపుతుంది. పారిశ్రామిక, ఐటి రంగాలకు అవసరమైన చౌక (కార్మికులు) ఇంజనీర్ల సృష్టి మీద చూపిన శ్రద్ధ అధికారంలో ఎవరున్నా వ్యవసాయం మీద పెట్టలేదు. ఎందుకంటే కోట్లాది మంది రైతుల కంటే లక్షల మంది పారిశ్రామిక, వాణిజ్యవేత్తల మీద ఉన్న శ్రద్ధ ఎక్కువ. అందుకే వ్యవసాయరంగం ఇలా దిగజారిపోతున్నది, వ్యవసాయం గిట్టుబాటుగాక, అప్పులపాలైన రైతాంగ ఆత్మహత్యల గురించి వింటున్నాం. ఇతర రంగాల్లో అలాంటి పరిస్థితి లేనందుకు సంతోషమే గానీ ఇంకా ఎంతమంది రైతాంగాన్ని బలిపెట్టాలన్నదే ప్రశ్న.

దేశంలో జరిగిన అనర్థాలన్నింటికీ గాంధీ, నెహ్రూలే కారణం అని కాషాయ దళాలు నిరంతరం దుమ్మెత్తి పోస్తుంటాయి. వారి పూర్వీకులు బ్రిటీష్ వారి సేవకు బదులు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని నాయకత్వ స్థానాలకు వచ్చి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది కదా, ఎందుకు ఆ పని చేయలేదో చెప్పగలరా? పోనీ వాజ్‌పాయి, ఇప్పుడు నరేంద్రమోదీ ఏలుబడిలో పరిశోధన అభివృద్ధి రంగాలకు నిధులు ఎందుకు కేటాయించలేదు, ఇతర దేశాలతో ఎందుకు పోటీపడటం లేదో అయినా చెప్పాలి. ఎవరు అడ్డుకున్నారు. వేదాల్లోనే అన్నీ ఉన్నాయి అని లొట్టలు వేసుకుంటూ చెప్పుకొనేవారి ఒళ్లో కూర్చుని రెండువేల సంవత్సరాల నాడే భారత్‌లో ప్లాస్టిక్ సర్జరీ చేశారని, వినాయకుడికి ఏనుగు తల అమర్చటం దానికి నిదర్శనమని స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ చెప్పిన సంగతి తెలిసిందే. అదే బాటలో గోమూత్రం తాగితే కాన్సర్ నయమౌతుందని బిజెపి ఎంపి ప్రజ్ఞాసింగ్ సెలవిచ్చినదాన్నీ దేశం చూసింది. ఆంధ్రా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా ఉన్న నాగేశ్వరరావు ఇంకా ముందుకు పోయి మహాభారత కాలంలోనే టెస్ట్ ట్యూబ్ బేబీ పరిజ్ఞానంతో 100 మంది కౌరవులు ఒకేతల్లికి జన్మించారని కూడా చెప్పారు. అదే నిజమైతే పాండవులు వేర్వేరు తండ్రులకు ఎలా పుట్టారని ఎవరైనా ప్రశ్నిస్తే హిందూ వ్యతిరేకులని చిత్రిస్తారు. ఇలాంటి మూఢనమ్మకాలు ఉన్నవారు శాస్త్రపరిశోధనలను ప్రోత్సహిస్తారా? అమెరికాలోని లోవా విశ్వవిద్యాలయం చెప్పిన కొన్ని అంశాలను చూద్దాం. ఓయిసిడి సమాచారం(2022) ప్రకారం 2000–2002 మధ్య వ్యవసాయ పరిశోధనలకు అమెరికా, భారత్,బ్రెజిల్ దేశాలలో ఒక బిలియన్ డాలర్లకు అటూ ఇటూగా ప్రభుత్వాలు ఖర్చు చేశాయి.అదే 2019–21నాటికి చైనా ఖర్చు ఏడాదికి 1.3 నుంచి 6.6బిలియన్లకు పెరిగింది. అమెరికా, భారత్,బ్రెజిల్ చేసిన మొత్తం ఖర్చు కంటే చైనాలో ఎక్కువగా ఉంది.

దశాబ్దాల పాటు కొనసాగిన ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి తన అజెండాకు అనుగుణంగా వ్యవహరించేందుకు నీతి ఆయోగ్‌ను నరేంద్రమోదీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నీతి ఆయోగ్ 2025లో విడుదల చేసిన పదకొండవ పత్రంలో ఏం చెప్పిందో తెలుసా! 1995–96లో కేంద్ర ప్రభుత్వం జిడిపిలో అన్ని రకాల పరిశోధనలకు కేటాయించిన మొత్తం 0.61 శాతం కాగా 2005–06లో అది 0.81కి పెరిగింది. నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత 2015–16లో 0.69 శాతం, 2020–21లో 0.64శాతానికి పతనమైంది. వ్యవసాయ పరిశోధనలకూ ఇదే గతి అని వేరే చెప్పనవసరం లేదు. జిడిపిలో కనీసం రెండు శాతం కేటాయించాలని గతంలో ప్రణాళికా సంఘం సిఫార్సు చేసింది. దీని గురించి మోదీ ఎప్పుడైనా ఎక్కడైనా ఏ రూపంలో అయినా ఎందుకు మాట్లాడటం లేదు? ప్రపంచ బ్యాంకు సమాచారం ప్రకారం 2020లో తలసరి పరిశోధన పెట్టుబడి ఇజ్రాయెల్ 2,438 డాలర్లతో ప్రపంచంలో అగ్రగామిగా ఉండగా, 2,192 డాలర్లతో అమెరికా తరువాత స్థానంలో, తొమ్మిదవ స్థానంలో ఉన్న చైనా 250, పద్నాలుగవ స్థానంలో 13 డాలర్లతో మన దేశం ఉంది. వీటినే అదే ప్రపంచ బ్యాంకు మరోవిధంగా చెప్పింది. జిడిపిలో ఇజ్రాయెల్ 5.4, అమెరికా 3.5శాతం కేటాయించగా చైనా 2.4, మనదేశం 0.7 శాతం కేటాయించింది. అంతేనా ప్రభుత్వరంగంలో మొత్తం పరిశోధనా సంస్థలు అమెరికా 727, చైనాలో 353, భారత్‌లో 18 ఉన్నట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక అంశాలను నీతి ఆయోగ్ తన పత్రంలో పేర్కొన్నది. ఇంత దరిద్రంగా ఉంటే మన పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడులు ఎలా పెరుగుతాయి, నాణ్యతలో ప్రపంచంలో ఎలా పోటీపడతాయి? మోదీ విధానాలతో 2047నాటికి దేశం ఎక్కడికో పోతుందని నమ్మేవారు దేశంకోసం, ధర్మం కోసం బుర్రలు పెట్టి ఆలోచించాల్సిన అవసరం లేదా!

చరిత్రలో నరేంద్రమోదీ ఏ ప్రధానీ వెళ్లనన్ని సార్లు చైనా వెళ్లారు, దాని నేతలతో భేటీ అయ్యారు. పోనీ చైనా నుంచి అయినా నేర్చుకున్నారా అదీ లేదు. ఓయిసిడి నివేదిక ప్రకారం 2019–21 సంవత్సరాలలో చైనా వ్యవసాయ ఉత్పత్తుల విలువ 1.6లక్షల కోట్ల డాలర్లు, అమెరికాలో 0.4,భారత్ విలువ 0.2లక్షల కోట్ల డాలర్లు మాత్రమే. మనదేశంతో పోలిస్తే చైనా విస్తీర్ణం చాలా ఎక్కువ, దానిలో 10.6శాతం 1.02మిలియన్ల చదరపు కిలోమీటర్లలో మాత్రమే వ్యవసాయం చేస్తున్నారు. అదే మనదేశంలో 52.8శాతం భూమి 1.69మిలియన్ చదరపు కిలోమీర్లలో సాగు చేస్తున్నాం. అయినా మన ఉత్పత్తి విలువ తక్కువగా ఎందుకుందో, చైనాలో ఎక్కువ ఎందుకో ఎప్పుడైనా మోదీ తెలుసుకున్నారా! ప్రపంచం మొత్తంలో ఉన్న భూమిలో 11.6శాతం మాత్రమే సాగులో ఉంది, భారత్ అగ్రస్థానంలో ఉండగా అమెరికాలో 17.1, రష్యాలో 7.4శాతంలో వ్యవసాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు వ్యవసాయ రంగంలో పరిశోధనలకు ప్రభుత్వరంగం చేస్తున్న ఖర్చు గురించే మాట్లాడుకున్నాం. ప్రైవేటురంగం కూడా ఇటీవలి సంవత్సరాల్లో పరిశోధనలకు ఖర్చు చేస్తున్నది. అది గుత్త సంస్థలకు మాత్రమే లాభాలు చేకూర్చుతున్నది తప్ప అందరికీ కాదు. దాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తం వ్యవసాయ పరిశోధనల్లో అమెరికా అగ్రస్థానంలో ఉంటుంది. అక్కడ ప్రభుత్వ ఖర్చు తగ్గుతున్నది. చైనాలో ప్రైవేటు పరిశోధనలు దాదాపు లేవు. భారత్,బ్రెజిల్, ఐరోపా యూనియన్‌లో పెరుగుతున్నాయి. ప్రైవేటురంగం కేంద్రీకరణ అంతా మార్కెట్లో గిరాకీ, లాభం ఉన్నవాటి మీదే ఉంటుంది. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గటం వలన టిఎఫ్‌పి(టోటల్ ఫ్యాక్టర్ ప్రొడక్టివిటీ) సూచిక అమెరికాలో ఇటీవలికాలంలో ఆరుశాతం తగ్గింది. దీని అర్థం ఏమిటంటే పదేండ్ల కాలంలో ఉత్పాదకత అమెరికాలో లాభసాటిగా లేదు. అందుకే పెద్ద ఎత్తున ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి అక్కడి ఉత్పత్తులను ఇతర దేశాల మార్కెట్లలో గుమ్మరించేందుకు అదిరింపులు, బెదిరింపులు చేస్తున్నది.

# "నొప్పికి రిటైర్మెంట్ లేదు.. నా వైద్యానికీ విశ్రాంతి లేదు"

"వైద్యో నారాయణో హరిః" అనే నానుడి మనకు తెలుసు. కానీ వైద్యాన్ని ఒక వ్యాపారంగా మార్చేసి, రోగుల కష్టాలను సొమ్ము చేసుకుంటున్న ఈ రోజుల్లో.. వైద్యాన్ని కేవలం ఒక పవిత్రమైన సేవగా భావించే వారు చాలా అరుదు. అలాంటి నిస్వార్థమైన వ్యక్తుల్లో చారిత్రక వరంగల్ నగరానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ పాములపర్తి రామారావు గారు ఒకరు. ఆయన జీవితం, వైద్యం పట్ల ఆయనకున్న అంకితభావం నేటి సమాజానికి, వైద్య లోకానికి ఒక సజీవ పాఠం.

పాములపర్తి రామారావు గారిది విద్యావంతులు, సామాజిక చింతన ఉన్న కుటుంబం. ఆయన తండ్రి ప్రముఖ రచయిత, ఆలోచనాపరుడు, జర్నలిస్టు అయిన శ్రీ పాములపర్తి సదాశివరావు గారు. సదాశివరావు గారు 1947 నుంచి 1955 వరకు వరంగల్ కేంద్రంగా "కాకతీయ"అనే పత్రికను నడిపారు. సత్యం, ధర్మం, న్యాయం, సేవ, అహింస అనే ఐదు సూత్రాల ఆధారంగా ఆ పత్రిక నడిచేది. రామారావు గారు వైద్య వృత్తిలోకి అడుగుపెడుతున్న సమయంలో ఆయన తండ్రి ఒక మాట చెప్పారు – "అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఎన్నటికీ విస్మరించకూడదు. నీ వంతు సాయం వారికి నిరంతరం అందిస్తూనే ఉండాలి." తండ్రి చెప్పిన ఆ మాటలనే రామారావు గారు తన జీవిత లక్ష్యంగా మలచుకున్నారు.

ఆయుర్వేదం పట్ల ఉన్న మక్కువతో రామారావు గారు 1981–1984 మధ్యకాలంలో కేరళలో ఆయుర్వేదంలో డిగ్రీ, ఎండి పూర్తి చేశారు. 1987లో భద్రాచలంలో వైద్యాధికారిగా ఉద్యోగంలో చేరిన ఆయన, ఆ తర్వాత 1993లో వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. అదే కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘ కాలం సేవలందించి 2016లో పదవీ విరమణ పొందారు.



వరంగల్ ఆణిముత్యం, ప్రజా వైద్యుడు డా.పాములపర్తి రామారావు గారి స్ఫూర్తిదాయక ప్రస్థానం

### ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌లు అవసరం లేని మ్యాజిక్

నేటి కాలంలో ఏ చిన్న నొప్పికైనా ఎంఆర్ఐ సీటీ స్కాన్ లేకుండా వైద్యులు వైద్యం చేయలేరు. కానీ, రామారావు గారి ప్రత్యేకత ఏమిటంటే.. రోగి నాడి పట్టి లేదా నొప్పి ఉన్న ప్రాంతాన్ని కేవలం తన వేలితో తాకి, మెడికల్ రిపోర్టుల్లో ఏముందో ఇట్టే చెప్పేస్తారు. స్లిప్ డిస్క్ స్పాండిలైటిస్, సయాటికా, మెడ నొప్పి, నడుము నొప్పి వంటి దీర్ఘకాలిక సమస్యలకు ఆయన ఎలాంటి శస్త్రచికిత్సలు చేయరు, భారీ వైద్య పరికరాలను ఉపయోగించరు.

మర్దన చేయడానికి ఆయన ఎలాంటి రసాయనాలు వాడరు. కేవలం ఆయనే రోగులకు ఒక ప్రత్యేకమైన మసాజ్ పద్ధతి ద్వారా మర్దన చేసి, రోగుల బాధను ఇట్టే మటుమాయం చేస్తారు. రామారావు గారు కేవలం నాడి పట్టి రోగాలను నయం చేయడమే కాకుండా, సమాజంలో ఆరోగ్య స్పృహ పెంచేందుకు ఒక రచయితగానూ మారారు. ప్రజల జీవనశైలిలో మార్పు తీసుకురావాలన్న తపనతో 'మన జీవన విధానం మారాలి', 'ఆనందమయ జీవితం', 'ఆయుర్వేదం ఒక పరిచయం' అనే మూడు అద్భుతమైన పుస్తకాలను రచించారు. వ్యాపార దృక్పథం ఏమాత్రం లేకుండా, సొంత ఖర్చులతో దాదాపు 10 వేలకు పైగా ప్రతులను ముద్రించారు. సామాన్యులందరికీ ఈ పుస్తకాలు చేరాలనే సదుద్దేశంతో వాటిని వివిధ గ్రంథాలయాలకు ఉచితంగా పంపిణీ చేశారు.

### మూడు లక్షల మందికి ఉచిత వైద్యం ..విఐపిలకైనా క్యూ లైన్ తప్పని సరి

పదవీ విరమణ తర్వాత ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవాల్సిన వయసులో కూడా ఆయన రోజూ వందలాది మందికి ఉచితంగా వైద్య సేవలు అంది స్తూ వస్తున్నారు. ఎవరైనా సరే.. "రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతం గా విశ్రాంతి తీసుకోవచ్చు కదా?"అని అడిగితే.. "నొప్పికి, రోగానికి రిటైర్మెంట్ ఉండదు, కాబట్టి నా వైద్యానికి కూడా విశ్రాంతి లేదు" అని చిరునవ్వుతో సమాధానం ఇస్తారు రామారావు గారు. ఆయన దగ్గరకు పేదలు, ధనికులు, రాజకీయ నాయకు లు, విఐపిలు.. ఇలా ఎవరొచ్చినా సరే ఒకేలా చూస్తారు. ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యత ఉండదు. కచ్చితంగా అందరూ క్యూ లైన్‌లోనే వచ్చి వైద్యం పొందాలి. గత 27 ఏళ్లుగా సుమారు 3లక్షల మందికి పైగా రోగులకు ఆయన ఉచితంగా చికిత్స అందించారు. ఎవరైనా రోగులు నయమైన సంతోషంతో డబ్బులు ఇవ్వబోతే ఆయన తీసుకోరు. "క్లినిక్‌లో ఉన్న డబ్బాలో(హుండీలో) వేయండి" అని చెబుతారు. అలా జనం వేసిన డబ్బులతో పేద రోగులకు ఉచితంగా మందులు కొని ఇస్తుంటా రు.

### ఖండాంతరాలు దాటిన కీర్తి..

మొదట్లో ఆయన వరంగల్ మట్టెవాడ (షేర్‌పురా) లోని తన ఇంటి వద్దే వైద్యం చేసేవారు. కానీ రోగుల రద్దీ విపరీతం గా పెరిగిపోయి చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలుగుతుండటంతో, హన్మకొండ జూపార్కు సమీపంలోని ఒక భవనంలో రోగులకు ఉదయం నుండి రాత్రి వరకు విశ్రాంతి లేకుండా సేవ చేసేవారు. (ప్రస్తుతం కిడ్స్ కాలేజ్ ఎదురుగా, ఎర్రగట్టు గుట్ట, హనుమకొండ) ఒకప్పుడు మన జిల్లాల ప్రజలకే తెలిసిన ఆయన కీర్తి, ఇప్పుడు ఖండాంతరాలు దాటింది. అమెరికా, కెనడా, ఐర్లాండ్, పోలాండ్ వంటి దేశాల నుంచి కూడా ఎంతోమంది రోగులు ఆయన వద్దకు వచ్చి ఉచిత చికిత్స పొంది వెళ్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు వరించాయి.

ఇప్పటివరకూ లక్షలాది మందికి ఉచితంగా వైద్యం అందిస్తూ, ఎందరికో ఆయుష్షును, ఆనందాన్ని పంచుతున్న డాక్టర్ పాములపర్తి రామారావు గారి జీవితం ఒక సజీవ పాఠం. వైద్యం అనేది డబ్బు సంపాదించే వృత్తి మాత్రమే కాదు, అదొక పవిత్రమైన బాధ్యత అని ఆయన తన ఆచరణ ద్వారా నిరూపిస్తున్నారు. మన గడ్డ మీద ఇలాంటి గొప్ప వ్యక్తి ఉండటం మనందరికీ గర్వకారణం.

**కె.గోపి,** ప్రజాపక్షం,
వరంగల్ జిల్లా ప్రతినిధి

## అంతర్జాతీయ నిరాహార దినం

ప్రతి సంవత్సరం మే 6న ప్రపంచవ్యాప్తంగా 'ఇంటర్నేషనల్ నో డైట్ డే' నిర్వహించబడుతుంది. మొట్టమొదటి అంతర్జాతీయ డైట్ రహిత దినోత్సవాన్ని 1992లో ఇంగ్లాండ్ లో జరుపుకున్నారు. పేరు విన్న వెంటనే చాలామందికి ఈ రోజు ఏది తిన్నా పర్లేదా? అనే భావన కలగొచ్చు. కానీ ఈ దినోత్సవం యొక్క అసలు ఉద్దేశ్యం అది కాదు. ఇది కేవలం డైట్‌కి వ్యతిరేకంగా నిలిచే రోజు కాదు; శరీరాకృతిపై సమా జం పెడుతున్న అనవసర ఒత్తిడిని ప్రశ్నించే రోజు. మన ఆరోగ్యం అంటే కేవలం బరువు తగ్గడమే కాదని, ఆరోగ్యాన్ని విస్తృత దృక్పథంతో చూడాలని గుర్తుచేసే రోజు. ఆధునిక సమాజంలో సన్నగా ఉంటేనే అందం, జీరో సైజ్ అంటేనే ఫిట్‌నెస్ అనే అపోహలు బలంగా స్థిరపడ్డాయి. సోషల్ మీడియా, సినిమాలు, ప్రకటనలు, ఫిట్‌నెస్ పరిశ్రమ ఇవన్నీ కలిసి ఒక నిర్దిష్ట శరీరాకృతినే ఆదర్శంగా చూపిస్తున్నాయి. ఫలితంగా చాలామంది యువత, ముఖ్యంగా యువతులు, తమ సహజ శరీర నిర్మాణాన్ని అంగీకరించకుండా, కఠినమైన డైట్లు పాటిస్తూ శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. డైట్ అనే పదం అసలు అర్థం సమతుల ఆహారం. ఇంటర్నేషనల్ నో డైట్ డే ఒక హెచ్చరికలా పనిచేస్తుంది – మన శరీరాన్ని శత్రువుగా కాక, మిత్రుడిగా చూడాలని చెబుతుంది. అయితే ఈ దినోత్సవం బరువు తగ్గడమే లక్ష్యంగా కాకుండా ఆరోగ్యంగా ఉండడమే లక్ష్యంగా జీవన శైలిని మార్చుకోవాలి. కుటుంబాల్లో, పాఠశాలల్లో, కార్యాలయా ల్లో పిల్లలు, పెద్దలకు శరీర వైవిధ్యం గురించి అవగాహన కల్పించాలి.ఆరోగ్యాన్ని బరువుతో సమానంగా చూడకుండా, సమగ్ర శ్రేయస్సుగా అర్థం చేసుకోవాలి. మన శరీరాన్ని ప్రేమించాలి, గౌరవించాలి, ఆరోగ్యంగా ఉంచాలి; కానీ సమాజం విధించిన అందపు ప్రమాణాల బానిసలుగా మారకూడదు. ప్రతి శరీరాన్నీ గౌరవించే సమాజాన్ని నిర్మించడం – అదే ఈ దినోత్సవానికి నిజమైన నివాళి.

ఆళవందార్ వేణు మాధవ్, 8686051752

# ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

- పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలి
- ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యవాదులకు హెచ్చరిక
- సవాళ్ళను ఎదుర్కోవటంలో కమ్యూనిస్టుల బాధ్యత పెరిగింది
- ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/పాల్వంచ** : ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం సన్నద్ధం కావాలని, పెరుగుతున్న రాజకీయ సవాళ్ళను ఎదుర్కోవటంలో కమ్యూనిస్టుల పాత్ర, బాధ్యత మరింత పెరిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ శ్రీలక్ష్మి బాంకెట్ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నరాటి ప్రసాద్ అధక్షతన జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను విశ్లేశిస్తూ దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై కమ్యూనిస్టు కార్యకర్తలు లోతైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. దేశంలో మతోన్మాద శక్తులు బలపడుతున్న తరుణంలో లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిణామాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశా నిర్ధేశం చేశారు. కమ్యూనిస్టు నాయకులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని, అప్పుడే బలమైన శక్తిగా నిలబడతామని స్పష్టం చేశారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా రిపోర్ట్స్ ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, కె.సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మి కుమారి, అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, ఆర్‌టిసి భాస్కర్, భూక్యా దస్రు, ఉప్పుశెట్టి రాహుల్, ముప్వ వెంకటేశ్వర్లు, ఎస్‌కే. ఫహీం, శంకర్, బంధం బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంపై విచారణ జరిపి కేంద్రం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవకతవక లపై, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో బిఆర్‌ఎస్ నేతల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ ప్రారంభించకపోతే బిజెపి, బిఆర్‌ఎస్ ఒక్కటేనని ప్రజలు భావిస్తారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మీడి యాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనకు ముందు విచారణ మొదలు పెట్టి కేంద్రం తన చిత్తశుద్ధిని నిరూపించు కోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవకతవకలపై సిబిఐ విచారణకు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టలేదని విమర్శించారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల వ్యవహారాలపై కూడా విచారణ ఎందుకు జరగలేదని నిలదీశారు. సిఎం రేవంత్ రెడ్డి కేరళ పర్యటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తప్పుడు ప్రచారం చేయాల్సిన అవసరం లేదని, రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా బిఆర్ ఎస్‌ను అధికారం నుంచి దించిన విషయం గేమ్ ఛేంజర్ కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బిజెపికి వచ్చిన ఓట్ల పెరుగుదల వెనుక బిఆర్‌ఎస్ పాత్ర ఉందని ఆరోపించారు.

# ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో రైతుల భూములు తీసుకోవడం దారుణం

ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్



**ప్రజాపక్షం/పరిగి:** ఇండస్ట్రియల్ కారిడార్ పార్క్ పేరుతో బలవంతంగా ప్రభుత్వం రైతుల భూములను తీసుకోవడం సరైనది కాదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. పరిగి మండలం కాడ్లపూర్, రాపోల్ గ్రామాలలో రైతులు 43 రోజులుగా దీక్షలను కొనసాగిస్తున్నారు. భూ బాధితులను తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, వికారాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి విజయలక్ష్మి పండిట్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి దేవ భక్తుల సంధ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్ మహమ్మద్, సిపిఐ నాయకులు చంద్రయ్య బాబు సావిత్రమ్మ ,శ్యామ్, మల్కప్ప, బసప్ప, తదితరులు కాడ్లపూర్‌లో భూ బాధితులను కలిసి మాట్లాడారు ఈ సందర్భంగా కాడ్లపూర్ గ్రామ సర్పంచ్ సోమ గాని పులేందర్ అధ్యక్షతన దీక్షల శిబిరంలో జరిగిన సమావేశంలో పశ్యపద్మ మాట్లాడుతూ వ్యవసాయానికి లాయక కానీ భూములలో పరిశ్రమలను స్థాపించటానికి రాష్ట్ర పాలకులు నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా భూములను సాగు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న రైతులను భూముల నుండి బలవంతంగా బయటకు నెట్టివేయటానికి ప్రయత్నించటం దారుణమన్నారు. సాగునీటి వసతి కావాలని రైతాంగం పోరాడుతా ఉంటే వారి చేతులలో ఉన్న కొద్దిపాటి భూమిని పరిశ్రమల కోసం సేకరించటానికి ప్రయత్నించటం సరికాదన్నారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణ చేపట్టాలని సూచన చేశారు. 43 రోజులుగా సొంత జిల్లా లో రైతులు దీక్షల నిర్వహిస్తా ఉంటే ఎందుకు ముఖ్యమంత్రి దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి డిమాండ్ల పట్ల సానుభూతితో ఆలోచించటానికి సిద్ధం కాలేదని ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా సిపిఐ కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి నేటి ఈ ప్రభుత్వానికి బలవంతంగా భూములను సేకరించటంలో తేడా ఏముందని ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు అధికారులు వహించాల్సిన శ్రద్ధ వహించకపోగా ప్రజా వ్యతిరేక పనులకు పూనుకుంటున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి దేవ భక్తుల సంధ్య మాట్లాడుతూ మీ భూములు మీకు దక్కేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని అధైర్య పడవద్దు అని అన్నారు. బాధితులను కలిసేందుకు వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేష్ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పీర్ మహ్మద్, సిపిఐ పరిగి మండల కార్యదర్శి వెంకటేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి డి.చంద్రయ్యలను పోలీసులు అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామ్యకమని, ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుండి బలవంతపు భూసేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతుల భూమి తీసుకొని వారి జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు, వ్యవసాయాన్ని నమ్ముకుని జీవిస్తున్న రైతన్న కుటుంబాలను రోడ్డు పాలు చేస్తుందన్నారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూములు తీసుకోవడం తప్ప ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయడం లేదన్నారు. పీర్ మహమ్మద్, వెంకటేష్ మాట్లాడుతూ రైతుల నుండి భూములు తీసుకుని వాటిని చదును చేసి ఉంచడం తప్ప ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు భూములను ఉపయోగించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న భూములు తీసుకోవడం తప్ప ప్రజల అవసరాలకు వాటిని వినియోగించుకోకుండా రైతులకు ఉపయోగపడకుండా పోతుందని రాబోయే రోజుల్లో వారి వ్యక్తిగతంగా వాడుకునేందుకే భూ సేకరణ చేస్తున్నారన్నారు. కాడ్లపూర్, రాపోల్ గ్రామాలలో ప్రభుత్వం భూ సేకరణ నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల మా భూములను ఇవ్వమని 43 రోజులుగా దీక్షలు కొనసాగిస్తున్నారు. నిరుపేదలను, రైతులను కలవడానికి సిఎం సమయం లేదా అని ప్రశ్నించారు. ఇండస్ట్రియల్ కారిడారి పేరుతో భూసేకరణ విషయంలో పునరాలోచించాలని వక్తలు డిమాండ్ చేశారు.




## బిఎఎస్‌ఎఫ్ గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్‌ల ఏర్పాటు

3 వేల మందికి ఉద్యోగవకాశాలు : మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రసాయనాల తయారీలో ప్రపంచంలోని అతి పెద్ద సంస్థల్లో ఒకటైన జర్మన్ దిగ్గజం బిఎఎస్‌ఎఫ్ హైదరాబాద్‌లో రెండు భారీ జిసిసిలను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. గ్లోబల్ డిజిటల్ హబ్, గ్లోబల్ సర్వీసెస్ హబ్‌ల పేరుతో నెలకొల్పే ఈ రెండు జిసిసిలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి అంగీకార పత్రం సమర్పించింది. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జర్మన్ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్‌ల సమక్షంలో మంగళవారం బిఎఎస్‌ఎఫ్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్ తెలంగాణ లైఫ్‌సెన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్‌కు 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'ను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది 100 జిసిసిల ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడించారు. వీటి ద్వారా లక్ష మంది ఐటి నిపుణులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. హైదరాబాద్ కేవలం కార్యాలయాల కేంద్రంగా మాత్రమే కాకుండా, ఆవిష్కరణలు, ఇంజినీరింగ్ రంగాల్లో ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కృత్రిమ మేథస్సు ఆధారిత కేంద్రం ఐకామ్, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, 200 ఎకరాల్లో ఎఐ సిటీ, క్వాంటమ్ హబ్, జీవ విజ్ఞాన పరిశోధన్ సంస్థ '1 బయోల్యాబ్' లను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో బిఎఎస్‌ఎఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెర్డింగ్, గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ అధ్యక్షుడు టోబియాస్ డ్రాట్, తెలంగాణ ప్రభుత్వ ఐటి అడ్వయిజర్ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లోపాయికారీ ఒప్పందం వల్లే...

**కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేపట్టడడం లేదు : మహేశ్ కుమార్ గౌడ్**

**కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ చేపట్టకపోవడానికి బిజెపి, బిఆర్‌ఎస్ మధ్య ఉన్న లోపాయికారి ఒప్పందమే కారణమని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాళేశ్వరంపై విచారణ చేపట్టాలని స్వయంగా తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసి ఎనిమిది నెలలు అవుతున్నప్పటికి సిబిఐ ఎందుకు విచారణ చేపట్టలేదో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10న ప్రధాని మోదీ హైదరాబాద్ వచ్చే లోగా కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో సిబిఐ విచారణ చేపడుతారా లేదా స్పష్టత ఇవ్వాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర సంస్థల ప్రమేయం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టడం సరైందికాదని ఈ కేసును సిబిఐకి అప్పగించిందన్నారు. కాళేశ్వరంపై సిబిఐ విచారణ చేపట్టాలని బిజెపి అధ్యక్షులుగా ఉన్న సమయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి పదే పదే కోరారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆ తుపాకినే కేంద్ర మంత్రి బండి సంజయ్ చేతుల్లో పెట్టిందని, ఆయన ట్రిగ్గర్ నొక్కాల్సిందిపోయి రాష్ట్ర ప్రభుత్వం భూజాలపై పెట్టి కాల్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి 8 స్థానాలను గెలిచేందుకు బిఆర్‌ఎస్ పూర్తి సహకారం అందించిన కారణంగా క్విడ్‌ప్రోకోలో భాగంనే కెసిఆర్‌పై బిజెపి విచారణ చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. గతంలో వరి వేస్తే ఉరి అన్న బిఆర్‌ఎస్, ధాన్యం కొనుగోలు చేసే ప్రసక్తేలేదన్న బిజెపి ఇప్పుడు చట్టాపట్టాలు వేసుకుని రైతుల కల్లాల చుట్టూ తిరుగుతూ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మహేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు ఎన్ని ఎత్తుగడలు వేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ముమ్మటికి ఓటు చోరీకి పాల్పడే గెలిచిందని మహేశ్ కుమార్ మరోసారి ఆరోపించారు.

# 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయడం ద్వారా మతోన్మాద శక్తుల దుష్ట రాజకీయాలపై ప్రజల్లో అవగాహనను పెంపొందించాలని ఎంఎల్‌సి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహా అన్నారు. ప్రజా కళారూపాల ద్వారా మట్టి మనుషుల్లో చైతన్యం రగిలిస్తూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొదలు నేటి వరకు సమసమాజమే లక్ష్యంగా ప్రజల కోసం పనిచేస్తున్న ప్రజానాట్యమండలి మహాసభల విజయవంతం కోసం ప్రజలు ఆర్థికంగా సహకరించి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో మంగళవారం సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ గత చరిత్రలో నాటక, సినీ రంగాలలో స్థిరపడ్డ అనేక మంది కళాకారులు, నటులు, దర్శకులు తెలంగాణ ప్రజానాట్య మండలి నుండి ఎదిగిన వారని తెలిపారు. నాడు వెట్టి చాకిరి నిర్మూలనకు సాంస్కృతిక ఉద్యమమే శరణ్యమని భువనగిరిలో జరిగిన ఆంధ్ర మహాసభ నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. నేడు అమెరికా లాంటి దేశాలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ఇరాన్‌తో పాటు ఇతర దేశాలపై దాడులకు తెగబడుతుంటే మన దేశంలో మత సమ్మేళనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే దుష్ట రాజకీయాలు కొనసాగుతున్న తరుణంలో ప్రజల్లో సాంస్కృతిక ఉద్యమం మళ్ళీ అనివార్యంగా మారిందన్నారు. కళాకారులు తమ ఆట పాటలు, నాటకాలు, కళారూపాల ద్వారా ప్రజలకు అణచివేతను పేదరికాన్ని, మనువాద భావజాలాన్ని నిలువరించే దృష్టికోణంలో ముందుకు నడపాల్సిన అవసరం, బాధ్యత ఉందని, దీనిని ప్రజా నాట్య మండలి నేరవేర్చాలని కోదండరామ్ ఆకాంక్షించారు. నరసింహ మాట్లాడుతూ సాంస్కృతిక పోరాటాలతో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి నిర్మాణం చేయడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురాగలమన్నారు. సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయకుండా ప్రజల్లో మార్పును ఆశించలేమన్నారు.ఉపన్యాసాల కంటే ఒక పాట కోట్లాది మందిని ప్రభావితం చేయగలదని, రాజకీయ భావజాలాన్ని సాంస్కృతిక ఉద్యమం ద్వారా విస్తృతంగా జనాల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, టిపిఎన్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కె.లక్ష్మి నారాయణ, కె.ఉప్పలయ్య, పడాల నళిని, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 9,10 తేదీల్లో కిక్‌బాక్సింగ్ పోటీలు

క్రీడా సంఘాలకు పూర్తి సహకారం : మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి క్రీడా సంఘాలు నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంలో సంఘాల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎల్‌బి స్టేడియంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర కిక్‌బాక్సింగ్ చాంపియన్‌షిప్ అధికారిక బ్రోచర్‌ను మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆవిష్కరించారు. ఈ చాంపియన్‌షిప్ విజయవంతానికి అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు ప్రోత్సాహం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహిపాల్, ఆర్‌ఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ నర్సింగ్ రావు, హైదరాబాద్ జిల్లా జనరల్ సెక్రటరీ ప్రవీణ్ కుమార్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కిక్‌బాక్సింగ్ అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం పట్ల వారు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడా సంఘాలతో సమన్వయం పెంచి రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని అధికారులు వెల్లడించారు.

# పంటల్ని కొనకుంటే రాష్ట్రాన్ని దిగ్బందిస్తాం

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

జనగామలో కొనుగోలు కేంద్రం సందర్శన, మార్క్‌ఫెడ్ నిధులు మళ్లించారని విమర్శ



**ప్రజాపక్షం/ జనగామ :** రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటల్ని కొనుగోలు చేయకుంటే రేపటి వరకు చూసి ఎల్లుండి నుండి రోడ్లపై కూర్చొని రాష్ట్రాన్ని దిగ్భందిస్తామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరించారు. మంగళవారం జనగామలోని యశ్వంతాపూర్ గ్రామంలో మొక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి మొక్కజొన్న తీసుకొచ్చిన రైతుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 20 రోజులుగా ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడంపై మండిపడ్డారు. మార్క్‌ఫెడ్ ఎండి శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణలో 14లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంట వేయగా 45లక్షల మెట్రిక్ టన్నులు దగుబడి అయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 6లక్షల క్వింటాల్లు కొన్నామని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారని, వారు చెప్పే లెక్కల్ని చూస్తే ప్రభుత్వానికి ఒక ప్రణాళిక లేదన్నారు. 10 నుండి 15 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసి సెంటర్లను ఎత్తేయాలని ప్రభుత్వం చేస్తుందన్నారు. దీనితో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు రూ.1700 వరకు అమ్ముకుంటారని, బోనస్ చెల్లించే బాధ పోతుందని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. మార్క్‌ఫెడ్ దగ్గర 22 వేల 700 కోట్లు అప్పు తీసుకొచ్చిన ప్రభుత్వం ఆ నిధులను సివిల్ సప్లయ్‌కు దారి మళ్లించిందన్నారు. ఇది తప్పు అయితే రుజువు చేయాలని సవాల్ విసిరారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతియే ఇందుకు కారణం అన్నారు. లక్షా 60వేల కోట్లు సివిల్ సప్లయ్‌కి అప్పులు ఉండడంతో వారు ధాన్యం కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇలా తప్పుల మీద తప్పులు చేయడం వలన ధాన్యం, మొక్కజొన్నల కొ నుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. రైతు బంద్ ఇవ్వకపోయినా ఫర్వాలేదు కనీసం ధాన్యమైన కొనుగోలు చేయాలని కెటిఆర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇక ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్ చేసిన రా హుల్‌గాంధీ ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ఎన్నికలు వస్తేనే డబ్బులు వేస్తున్నారని కనీసం పంటలైనా కొనుగోలు చేస్తూ డబ్బులు ఒకటి, రెండు రోజులు ఆలస్యంగా ఇచ్చినా ఫరవా లేదన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడలేదని, తెలంగాణ ప్రభుత్వం ఇది గమణించాలన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను గోస పెడుతుందని, ఇది సరియైన పద్ధతి కాదన్నారు. నెలల తరబడి కళ్లాల్లో ఉంటు రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరా జు రవిచంద్రం, బిఆర్‌ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, బాల్నె సిద్దిలింగం, గాడిపె ల్లి ప్రేమలతారెడ్డి, పోకల జమున, బండ పద్మ, బండ యాదగిరిరెడ్డి, యశ్వంతాపూర్ సర్పంచ్ సతీస్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి

**అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశం**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఆదేశించారు. ప్రధాని మోదీ ఈ నెల10వ తేదీన తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదే రోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏమైనా మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని పోలీసు, జిహెచ్‌ఎంసి, రోడ్లు, భవనాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డిజిపి సి.వి. ఆనంద్, స్పెషల్ సిఎస్‌లు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి. సజ్జనార్, రమేష్, సుమతి, ఫైర్ సర్వీసెస్ డిజి, విక్రమ్ సింగ్ మన్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ : సికింద్రాబాద్ జోన్**

**NIT No.** Tender Notice No. 4/EE-II/Cir43/SBZ/GHMC/2026-27, తేది: 05.05.2026, **పని పేరు:** 1 పని, సివిల్ పని, **అంచనా విలువ :** రూ.4.88 లక్షలు, **బిడ్స్ దాఖలుకు ప్రారంభ తేది & సమయం / బిడ్స్ దాఖలుకు ఆఖరి తేది & సమయం :** 06.05.2026 మ.2:30గం.లకు, 11.05.2026 మ.2.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక. ఫోన్: 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1967-PP/CL/ADVT/2026-27, Date: 05-05-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఆదిబట్ల సర్కిల్-15, హైదరాబాద్. ఇ-మెయిల్: eec.15adibatla@gmail.com

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్**

**టెండర్ నోటీసు సంఖ్య: 01/EEC-15/ADB/GHMC/Tenders/2025-26,** తేదీ: 05.05.2026. 4 పనుల ప్రచురణకు సంబంధించి: "1. GHMC, శంషాబాద్ జోన్ పరిధిలోని ఆదిబట్ల సర్కిల్-15, బడంగ్‌పేట్ సర్కిల్-16, జల్పల్లి సర్కిల్-17 మరియు శంషాబాద్ సర్కిల్-18 లలో 'CURE 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక' కార్యక్రమం నిమిత్తం వాహనాలు మరియు యంత్రాలను అద్దె ప్రాతిపదికన వినియోగించుకోవడం". ఈ వివరాలను https://tender.telangana.gov.in/login.html వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వడం ద్వారా వీక్షించవచ్చు. సంబంధిత కార్యక్రమాల వివరాలు క్రింద వివరించబడ్డాయి:

| ఈవెంట్స్ | 8 పనులు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేది & సమయం | 08.05.2026 @ 03:00 PM |
| డౌన్‌లోడ్‌కు ఆఖరి తేది & సమయం | 15.05.2026 @ 03:30 PM |
| బిడ్ల స్వీకరణకు ఆఖరి తేది & సమయం | 15.05.2026 @ 03:30 PM |
| బిడ్ల ప్రారంభ తేది & సమయం | 15.05.2026 @ 03:30 PM |

**సంప్రదించవలసిన అధికారి చిరునామా:** శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆదిబట్ల సర్కిల్-15, శంషాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆదిబట్ల సర్కిల్-15, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1949-PP/CL/ADVT/2026-27, Date: 05-05-2026

**శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ**

**పరిపాలన కార్యాలయం, ములుగు (గ్రామం & మండలం), సిద్దిపేట్ జిల్లా.**

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్**

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ నెంబర్: **01/HU/EO/2026-27, తేదీ: 04-05-2026**

**క్ర.సం. 1, పనిపేరు:** రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాలలో గ్రీన్ బిల్డింగ్ భావనతో పరిశోధనా కేంద్రాల కోసం సమీకృత సముదాయ భవన నిర్మాణం. **పని సుమారు విలువ (రూ.లలో):** 7,55,89,630/-, **EMDని DD / ఆన్‌లైన్ రూపంలో చెల్లించాలి:** టెండరింగ్ సమయంలో 1% : 7,55,896/-, అగ్రిమెంట్ సమయంలో 1.50% : 11,33,844/-, **పూర్తి చేసే కాల పరిమితి / టెండర్ కాల్ :** 12 నెలలు / 2nd call, **క్లాస్ ఆఫ్ కాంట్రాక్ట్:** సివిల్ కాంట్రాక్టర్ యొక్క అప్రోప్రియేట్ క్లాస్, **డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం తేదీ:** 08-05-2026 సమయం మధ్యాహ్నం 2:00 గంటలు, **బిడ్ డౌన్‌లోడింగ్ చేయడానికి చివరి తేదీ & సమయం తేదీ :** 22-05-2026, సమయం మధ్యాహ్నం 1:00 గంటలు, **బిడ్‌ల సమర్పణకు చివరితేదీ & సమయం తేదీ :** 22-05-2026 సమయం మధ్యాహ్నం 1:30 గంటలు, **టెక్నికల్ బిడ్ ప్రారంభ తేదీ:** 22-05-2026 సమయం మధ్యాహ్నం 2:00గంటలు, **ప్రైస్ బిడ్ యొక్క ప్రారంభ తేదీ :** 25-05-2026 సమయం మధ్యాహ్నం 2:30గంటలు, **కాంటాక్ట్ ఆఫీసర్ మరియు కాంటాక్ట్ వివరాలు:** డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (FAC), ఫోన్: 8555943733, మరిన్ని వివరాల కోసం దయచేసి https://tender.telangana.gov.in/ ను సందర్శించండి

DIPR R.O. No. : 1931-PP/CL/ADVT/2026-27, Date: 05-05-2026

సం/- ఎస్టేట్ ఆఫీసర్



## ప్రత్యామ్నాయ పంటలతోనే రైతులకు లాభాలు

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/మర్రిగూడ** :రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా కాలానుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకుంటూ లాభదాయక పంటల వైపు దృష్టి పెట్టాలని శాసన మండలి సభ్యులు నెల్లి కంటి సత్యం సూచించారు.ప్రజా పాలనప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యా చరణలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకొని ఉద్యాన శాఖ మునుగోడు నియోజకవర్గం ఆధ్వర్యంలో లెంకలపల్లి గ్రామంలోని ఎంఎ ఆర్ ఫంక్షన్ హాల్‌లో రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మన ప్రాంతంలో కూరగాయలు, పండ్లు,పూల తోటల సాగుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఇతర రాష్ట్రాలపై ఆధారపడే పరిస్థితిని తగ్గించేందుకు స్థానిక రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చండూర్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాస్,ఆత్మ చైర్మన్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, మునుగోడు ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్,ఉద్యాన శాస్త్రవేత్త జి. విజయ్ కృష్ణ ,మాల్ ఏఎంసీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్లు,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షం రెడ్డి,మండల కన్వీనర్ బుర్ర శేఖర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రోడ్డెక్కిన రైతన్న

పుల్లెంల గ్రామంలో 2 గంటలు స్తంభించిన రాకపోకలు



**ప్రజాపక్షం/చండూరు:** రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి తీవ్రఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి ప్రభుత్వం ఐకెపి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాని అక్కడ రైతులు తీసుకొచ్చిన వరిపంట నాణ్యతగా లేదని, తేమ శాతం అధికంగా ఉందని కుంటి సాకులు చెప్పుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులైన కొనుగోలు చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. చండూరు మండలంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నత్తనడకన కొనుగోలు చేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. మంగళవారం పుల్లెంల గ్రామంలో ప్రభుత్వం ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై రైతులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. దీంతో చండూరు చౌటుప్పలకు వెళ్లే వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుకున్న తహసీల్దార్, పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని తెలిపారు. ధర్నా కార్యక్రమంలో పుల్లెంల ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య , సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి శివర్ల లింగస్వామి , బిజెపి నాయకులు బొబ్బల మురళిమనోహర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల గూబిలి కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలో ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన గుబిలి కాలనీలో చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రారంభ ఏర్పాట్లను పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీకి వచ్చే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం, చెట్ల తొలగింపుతో పాటు రోడ్డును డోజర్‌తో గుంతలు పూడ్చి సమాంతరం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీలోని డ్రైనేజీలు, త్రిఫేజ్ పవర్, ప్రతి ఇంటికి ఎర్తింగ్, కరెంట్ మీటర్లు ఏర్పాటు చేసేలా చూడాలని ఆర్అండ్‌బి ఎస్ఈ శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు. ప్రతి ఇంటిపై వాటర్ ట్యాంకులను నీటిని ఎక్కించి నీటి సరఫరాను పరిశీలించాలని, అలాగే ప్రతి ఇంట్లో వైరింగ్‌తోపాటు ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అన్ని పనులు వేగంగా పూర్తి చేసి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. రెండు రోజుల్లో వాటర్ ట్యాంకులను నీటితో నింపడం, ప్రతి ఇంటికి నీటి సరఫరాను తనిఖీ చేయడం పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతి ఇంట్లో ట్యాప్ కనెక్షన్‌తో పాటు, బల్బులు, ఇతర సౌకర్యాలు చూడాలన్నారు. ఎక్కడ ఓపెన్ డ్రైనేజీ ఉండడం, పైపులు పగిలిపోవడం లేదా భవిష్యత్తులో సమస్యలు వచ్చేలా ఉండకుండా చూడాలని ఆదేశించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు, ప్రజా ప్రతినిధులు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల కాలనీకి ప్రారంభానికి హాజరు కానున్నట్లు దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లన్ని చూడాలని, అలాగే ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసే సభా వేదిక, ఇతర ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** 2025/26 సంవత్సరానికి ఎస్‌సి కార్పొరేషన్‌లో వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 7 గురువారం రోజున మౌఖిక ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. నకిరేకల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులు ఒరిజినల్ ధ్రువపత్రాలు,ఒక సెట్ జిరాక్స్ ప్రతులు,దరఖాస్తు ఫారం, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో విధిగా హాజరు కావాలని సూచించారు.

# సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలి

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్** : జిల్లాల్లో వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ రోజు భువనగిరి నియోజకవర్గ స్థాయి ఉద్యాన రైతుల సమావేశం నకు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంటల మార్పిడి మరియు ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా ఆయిల్ ఫామ్ యొక్క ప్రాధాన్యతను రైతులకు సవివరంగా వివరించారు. వరి పంట నుండి రైతులు ఆయిల్ పామ్ , ఉద్యాన పంటల సాగు వైపు మొగ్గు చూపాలని తెలియజేశారు. రైతుల తోటలలో క్షేత్ర స్థాయి పర్యటన చేయించి రైతుల నమ్మకాన్ని కూడగట్టుకుని ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులలో నుండి నాయకులను తయారు చేసి ఆయిల్ పామ్ సాగును ఒక ఉద్యమం ల ముందుకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట యొక్క ప్రాధాన్యతను మరియు ఆయిల్ పామ్ సాగు ద్వారా వంట నూనెల దిగుమతులను తగ్గించుకోవడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసుకోవచ్చు అని, తద్వారా రైతులకు లాభాలు చేకూరుతాయని వివరించడం జరిగింది. ఉద్యాన పంటల సాగుతో ఒక రూపాయి పెట్టుబడికి 3 రూపాయల ఆదాయం వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యాన పంటల సాగు 7 శాతం మాత్రమే అయినప్పటికీ దేశ జిడిపికి ఉద్యాన పంటల ఉత్పత్తులు 25% సమకూరుస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు, జిల్లా కోఆపరేటివ్ అధికారిమురళి, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, అగ్రికల్చర్ ఏడీఏలు ఉద్యాన అధికారులు వ్యవసాయ అధికారులు ఆయిల్ ఫెడ్ సిబ్బంది మైక్రో ఇరిగేషన్ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

**మోదీ పర్యటనకు ముందే బిఆర్ఎస్ అవినీతిపై సీబీఐ విచారణ మొదలుపెట్టండి : ఎంపి**

**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు ముందే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ ప్రారంభించి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేస్తున్న వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రజాదరణను చూసి ఓర్వలేక బండి సంజయ్ తప్పుడు సమాచారంతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉండి బీఆర్ఎస్ను గద్దె దించి అసలైన 'గేమ్ ఛేంజర్' అని నిరూపించుకున్నారని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవకతవకలపై సెప్టెంబర్ 1, 2025న రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించినా, నేటికీ కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ఆయన నిలదీశారు. ఈ నెల 10వ తేదీన ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చేలోపే విచారణ ప్రక్రియ ప్రారంభించకపోతే, బీఆర్ఎస్ ,బీజేపీ ఒకటేనని ప్రజలు భావిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## గొర్రె తొంటిలో పగిలిన బంతి గిన్నె ఎముక

**ప్రజాపక్షం/కోదాడ:** చిలుకూరు మండలం కట్ట కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గొర్రెల మందలో ఒక పిల్ల తల్లి గొర్రెను పోటేలు పొడవడంతో తొంటి లోపల బంతిగిన్నె జాయింట్ పగిలిపోయింది. స్థానిక పశువైద్యుడి సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం గొర్రెను కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకవచ్చారు. గొర్రెను పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.పెంటయ్య ఎక్స్‌రే సదుపాయం లేకపోవడంతో శస్త్ర చికిత్స చేసి బంతిగిన్నె పగిలిన జాయింట్ తెరిచి అతికించడానికి ప్రయత్నించగా తొంటి ఎముక పగిలిన బంతి గిన్నెలో ఇమడలేదు. వెంటనే ప్రముఖ స్థానిక పౌర అర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చంద్రమోహన్ సహాయం నిమిత్తం ఆహ్వానించగా వెంటనే చంద్రమోహన్ శస్త్ర చికిత్సలో పాల్గొన్నారు. చంద్రమోహన్ సూచన మేరకు బంతి గిన్నెతో స్థాన భ్రంశం చెందిన తొంటి ఎముకకు రాడ్లు వేసి విరిగిన జాయింట్ అతికించి విజయవంతంగా శస్త్ర చికిత్స ముగించారు. పశువైద్యంలో దక్షణ తెలంగాణలోనే తొలిసారిగా నిర్వహించిన బంతిగిన్నె ఎముక శస్త్ర చికిత్స విజయవంతంగా చేయడానికి విలువైన సమయం వెచ్చించి సర్జరిలో పాల్గొన్న డాక్టర్ చంద్రమోహన్ పలువురు అభినందించగా, అసిస్టెంట్ డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.



# రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి



సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట** : జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల సమన్వయంతో సాగు విధానాల్లో విప్లవాత్మక మార్పులు రావాలని, ముఖ్యంగా రైతులకు అధిక ఆదాయం అందించే పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన రైతువారం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వ్యవసాయం కేవలం సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచే విధంగా ఆధునీకరణ చెందాలని ఆకాంక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి, క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన పెంపొందించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ ఫామ్‌కు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, ఇప్పటికే సాగుచేస్తున్న తోటలకు ఫీల్డ్‌విజిట్ చేయించాలని, తద్వారా సాగు పద్ధతులు, వచ్చే లాభాలపై వారికి ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, లబ్ధిదారుల జాబితాను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో నీటి వసతి పుష్కలంగా ఉన్న నేపథ్యంలో, కూరగాయల సాగును లాభసాటిగా మార్చాలన్నారు. కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, వ్యవసాయ యంత్రీకరణను జోడించి శ్రమను తగ్గించి దిగుబడిని పెంచాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం (కెవికె) ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలన్నారు. నీటి పొదుపుతో పాటు సాగు వ్యయం తగ్గించేందుకు సాంకేతికతను వాడాలని సూచించారు. పర్యావరణానికి మేలు చేసే, తక్కువ ఖర్చుతో కూడిన నానో యూరియా వాడకంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ సాంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి అధిక ఆదాయాన్నిచ్చే ఆయిల్ ఫామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. ఆయిల్‌ఫామ్ ఒక్కసారి నాటితే దాదాపు 25 నుండి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ నాగయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా మార్కెట్ అధికారి నాగేశ్వర శర్మ, కెవికె సైంటిస్ట్ నరేష్, తహశీల్దార్ కృష్ణయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సమస్యలు ఉంటే పెద్దన్నగా అండగా ఉంటా

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సమస్యలు వస్తే మహిళా పోలీసు సిబ్బందికి జిల్లా అధికారిగా పెద్దన్నలాగా అండగా ఉంటానని ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తెలియజేయాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ కోరారు. పని ప్రదేశంలో అత్యాచార వేధింపులు నిరోధక చట్టం 2013 పిఓఎస్‌హెచ్ యాక్ట్ 2013కు సంబంధించి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం నందు మహిళా పోలీసు అధికారులకు, మహిళా రక్షణ విభాగం సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమం వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యలు అంశాల గురించి మాట్లాడారు. సమాజంలో వివిధ సమస్యలపై శక్తికి మించి పనిచేయాలని గర్వంగా, ధైర్యంగా ఉండాలని సూచించారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలపై పోలీసు మహిళా సిబ్బంది స్పందించి సహాయ సహకారాలు అందించాలన్నారు. వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేసి వాటి నిర్మూలనకు పాటుపడాలన్నారు. మహిళా పోలీసు యూనిఫాం ధరించి రోడ్డుపై కనిపిస్తే ఆకతాయిల మదిలో అలజడి ఏర్పడుతుంది, భయం కలుగుతుందని అన్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ హరాస్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి ఆధ్వర్యంలో 12 మంది మహిళా పోలీసు అధికారులతో ఒక ఇంటర్నల్ కమిటిని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పి ప్రసన్న కుమార్, బేటి బచావో బేటి పడావో నిర్వహకురాలు చైతన్య, జిల్లా మహిళా బరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, డిసిఆర్‌బి ఎస్ఐ ఝాన్సీరాణి, జిల్లా షీ టీమ్ ఎస్ఐ నీలిమ, బరోసా సెంటర్ సిబ్బంది, అడ్మినిస్ట్రేషన్ సూపరింటెండెంట్ సబితారాణి, శ్రీదేవి, కరుణశ్రీ ఉన్నారు.

## పేదలకు భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/చిట్యాల:** రాష్ట్రంలో పేదల పక్షాన నిలుస్తూ వారికి భరోసాను కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణంలో మంగళవారం జరిగిన కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలుస్తున్న కళ్యాణ లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు పోకల దేవదాసు పాల్గొన్నారు.



## హత్య చేసి సహజ మరణంలా చూపించే యత్నం విఫలం

హత్య కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన టూ టౌన్ పోలీసులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణంలో సంచలనం రేపిన హత్య కేసును టుటౌన్ పోలీసులు చేధించి,సహజ మరణంలా చూపించేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ టూ టౌన్ సీఐ రాఘవరావు కేసు వివరాలను వెల్లడించారు. మంగళవారం టుటౌన్ పోలోసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ నగర్ కాలనీలో నివసిస్తున్న ఆవుల మల్లయ్య గత 25 సంవత్సరాలుగా ఆవుల లక్ష్మమ్మతో సహజీవనం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. అయితే గత రెండు సంవత్సరాలుగా ఇద్దరి మధ్య విభేదాలు నెలకొనడంతో మల్లయ్య వేరుగా నివసిస్తున్నాడని తెలిపారు.ఈక్రమంలో మల్లయ్య మరో మహిళతో సన్నిహిత సంబంధం పెట్టుకోవడం వల్ల లక్ష్మమ్మతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 29న రాత్రి మల్లయ్యతో విభేదాల కారణంగా అతని సహజీవన సహచరి ఆవుల లక్ష్మమ్మ, ఆమె కుమారుడు ఆవుల ప్రసాద్ కలిసి కర్రతో తలపై కొట్టి, టవల్‌తో గొంతు నులిమి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని మంచంపై ఉంచి సహజ మరణంగా నమ్మించే ప్రయ త్నం చేశారు. మృతదేహంపై గాయాలు గు ర్తించిన బంధువుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.ఈనెల 5న ఉదయం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన టవల్, కర్ర, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఈ కేసును వేగంగా చేధించిన ఎస్ఐ సైదులు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు.

## ఆలేరు మున్సిపల్ కో- అప్షన్ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



**ప్రజాపక్షం/ఆలేరు** : మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుల ఎంపిక ఏకగ్రీవమైంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయ భవనంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం జరిగింది. నలుగురు కో ఆప్షన్స్ సభ్యుల ఎంపికపై నిర్వహించిన ఎన్నికలలో చింత కింది మురళీ, గుత్తా శమంతా రెడ్డి ఎమ్మెస్ విజయ్ కుమార్, ఇంతియాజ్ ఇర్ఫనాలను కౌన్సిల్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. తధానానంతరం మున్సిపల్ కమిషనర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి... ఐదుగురు వ్యక్తుల అరెస్ట్


**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో గల ఖాళీ స్థలంలో పేకాట అడుతున్నారన్న సమాచారంతో మేరకు తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ పోలీస్ సిబ్బందితో కొండాపూర్ లోని పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురు నిందితులైన జడల లింగం, శ్యామల బాలకృష్ణ, ఇరగ దిండ్ల అనిల్,పల్లపు అశోక్, శివరాత్రి బాబు లను అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి రూ.11,200 నగదు రెండు సెట్ ల పేక ముక్కలు, 2 మోటార్ సైకిల్ , (5) సెల్ ఫోన్లులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అట్టి వ్యక్తులను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందని, ఈ ఘటనలో మరో ఇద్దరు నిందితులు పరారిలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తుర్కపల్లి ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా పేకాట ఆడుతూ, అసాంఘిక, చట్ట వ్యతిరేక చర్యలకి పాల్పడినట్లయితే, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి,కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తక్యుద్దీన్ హెచ్చరించారు.




# మిత్రుడిని చంపి.. శవాన్ని తగలబెట్టి..

మిస్టరీగా మారిన హత్య కేసును ఛేదించిన భువనగిరి పోలీసులు..

సాంకేతిక ఆధారాలతో నిందితుడి గుర్తింపు.. అరెస్ట్





**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** మద్యం తాపించి ప్రాణ స్నేహితుడిని దారుణంగా హత్య చేసి, ఆధారాలు దొరకకుండా శవాన్ని తగలబెట్టిన నిందితుడిని భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎలాంటి క్లూ లేని ఈ కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఛేదించారు. మంగళవారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పోలీసుల కథనం ప్రకారం సికింద్రాబాద్, ఆల్వాల్ పరిధిలోని జొన్నబండకు చెందిన పొన్నకంటి కాశి అలియాస్ ప్రభ (23) జీఎంహెచ్ఎంసీ అల్వాల్ ఏరియాలో గార్బేజ్ కలెక్షన్ బాయ్‌గా, రాపిడో రైడర్‌గా పనిచేస్తుంటాడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన పొన్నకంటి శేఖర్ (మృతుడు) మిత్రుడు. గతంలో వీరిద్దరూ కలిసి ఒక స్క్రాప్ షాపులో రాగి తీగ (కాపర్ వైర్) దొంగతనం చేశారు. ఆ సమయంలో యజమాని శేఖర్‌ను పట్టుకోగా, అతను కాశి పేరును బయటపెట్టాడు. ఈ విషయంలో జరిగిన పంచాయతీలో కాశి నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది. తన పేరు చెప్పి అవమానపరిచాడన్న కక్షతో కాశి, శేఖర్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు.

**హత్య చేసి, పెట్రోతో తగలబెట్టి...** ఎలాగైన శేఖర్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్న కాశీ మృతుడిని బొల్లారం దగ్గర బైక్ ఎక్కించుకున్నాడు. మొదట బొల్లారం దగ్గర మద్యం సేవించారు. అనంతరం హకీంపేట తూంకుంట మధ్యలో పెట్రోల్ బంకులో 100 వంద రూపాయల పెట్రోల్ కొన్నారు. అప్పటికి కాశీని బాటిలో పెట్రోల్ ఎందుకు అని ప్రశ్నించాడు. దానికి బైక్ మైలేజ్ తక్కువ వస్తుందని, అందుకే బాటిల్‌లో పెట్రోల్ తీసుకుంటున్నా అని చెప్పాడు. తరువాత షామీర్పేట్ నుంచి తిమ్మాయిపల్లి మీదుగా కీసరకు వచ్చా రు. అక్కడి నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా ఘట్కేసర్ వైపుకు వచ్చారు. అక్కడి నుంచి వరంగల్ హైవే నుంచి భువనగిరి వైపుకు వచ్చి, అక్కడి నుంచి హన్మాపుర్ మీదుగా వడపర్తి, మర్యాల వైపుకు వెళ్లారు. అక్కడ ఒక నిర్మానుశ్య ప్రదేశానికి వెళ్లి మళ్లీ మద్యం సేవించారు. అక్కడ శేఖర్ మద్యం ఎక్కువై కింద పడిపోగా వెంటనే కాశీ మృతి మృతుడి గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం బాటిల్ లో తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగలబెట్టాడు. తగలబెట్టిన అనంతరం మృతుడి ఫోన్‌ను తీసుకెళ్లి రాళ్లతో కొట్టి చెట్లల్లో విసిరేసి అక్కడి నుండి పరారయ్యాడు. ఘటనా స్థలంలో మృతదేహం పూర్తిగా కాలిపోవడంతో పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే భువనగిరి డీఎస్పీ బి.రవీందర్, భువనగిరి రూరల్ సీఐ ఎన్.చంద్రబాబు, బొమ్మలరామారం ఎస్ఐ బి.శ్రీశైలం బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆశ్రయించింది.

వివిధ జిల్లాల్లో నమోదైన మిస్సింగ్ కేసుల డేటాను పరిశీలించారు. ఘటనా స్థలం పరిసరాల్లోని సెల్ టవర్ లొకేషన్లు, మొబైల్ డేటా విశ్లేషణ చేశారు. సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నిందితుడిని గుర్తించారు.

మంగళవారం తెల్లవారుజామున ఆల్వాల్లోని శివనగర్ కాలనీలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన యాక్టివా బైక్ (టిఎస్08జెవి2293) మృతుడికి చెందిన వివొ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేని కేసును కేవలం సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించి నిందితుడిని పట్టుకున్న భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు, ఎస్ఐ శ్రీశైలం, పోలీసు సిబ్బందిని యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ శ్రీ అక్షాంశ్ యాదవ్ (ఐపీఎస్) ప్రత్యేకంగా అభినందించారు.



## అనుమతులు లేని ఎర్ర మట్టి ట్రాక్టర్లు పట్టివేత

ఎస్ఐ వెంకటేష్ గౌడ్

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని మంది పల్లి గ్రామ సమీపంలో ఉన్న గుట్ట నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి వివరాలు సేకరించగా వారు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని తెలియడంతో వాటిని స్థానిక స్టేషన్ కు తరలించి విచారణ నిర్వహించి వాటి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రైతులకు అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సభ సమావేశం నిర్వహించి ఉద్యాన పంటలు ఆయిల్ పామ్ సాగు ప్రత్యామ్నాచ పంటల సాగు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మనసా హన్మంతు ఏఎంసీ చైర్మన్ రాధా లక్ష్మారెడ్డి, టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జన్ సుధాకర్, మక్తల్ డివిజన్ ఉద్యాన అధికారి రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు మిథున్ చక్రవర్తి, గణేష్, అఖిలప్రియ, సుదర్శన్ గౌడ్, ఆయిల్‌ఫెడ్ డీఎం వెంకటేష్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన పంటలు ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతను అధికారులు వివరించారు.

## ప్రభుత్వ ఆస్తుల డ్యామేజ్ కేసులో నిందితుడికి నెల జైలు, 1000 జరిమానా

ఎస్పీ టి.శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/గద్వాల్ :** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల (కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అలంపూర్) అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్‌కు సంబంధించిన, అండర్ గ్రౌండ్ పైప్ లైన్ పై, వేసిన సిమెంట్ బెడ్‌ను డ్యామేజ్ చేసినందుకు గాను నిందితుడు నాగరాజుకు ఫస్ట్ ఎ.డి.జె కోర్టు మహబూబ్‌నగర్ న్యాయమూర్తి కె.కళ్యాణ్ చక్రవర్తి ఒక నెల జైలు శిక్షతో పాలు రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. జిల్లా ఎస్పీ అదేశాల మేరకు అదనపు ఎస్పీ కె.శంకర్, గద్వాల డిఎస్పీ వై. మొగిలయ్య, అలంపూర్ సర్కిల్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ల పర్యవేక్షణలో కేసు విచారణ జరిగింది. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇ.కిరణ్ కుమార్ రెడ్డి వాదనలు సమర్థవంతంగా వినిపించగా, కోర్టు లైసెన్ ఆఫీసర్ ఏ. ఎస్సై కే. నరసింహులు, సాక్షులను హాజరుపరచుటలో కీలక సహకారం అందించారు. ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన సాక్ష్యాధారాలు సమగ్రంగా పరిశీలించిన అనంతరం నేరం స్పష్టంగా రుజువైనట్టు కోర్టు తేల్చి, నిందితునికి ఒక నెల జైలు శిక్ష, 1000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కేసు దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా విచారణ నిర్వహించి కోర్టులో బలమైన సాక్ష్యాలు సమర్పించడం వల్ల ఈ కేసులో శిక్ష పడడం సాధ్యమైందని, జిల్లాలో కన్విక్షన్ రేటు పెంచే దిశగా పోలీసులు కట్టుదిట్టంగా పనిచేస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అప్పటి కేసు దర్యాప్తు అధికారి ఎస్సై శ్రీహరి, ప్రస్తుత ఎస్సై రామకృష్ణ, సి.డి.ఓ కానిస్టేబుల్ మాబాషా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే. కిరణ్ కుమార్ రెడ్డి, కోర్టు లైసన్ ఆఫీసర్ ఎ.ఎస్సై కె.నరసింహులు ను జిల్లా ఎస్పీ అభినందించారు.




## బాధిత కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఐలమణెమ్మ మహిళా సమైక్య ద్వారా పి.ఎం.జె.వై పథకంలో 432 రూపాయల ప్రమాద బీమా టిజివిబి జూపల్లి బ్యాంకులో తీసుకున్నారు. గత మూడు నెలల క్రితం మనెమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ప్రమాద బీమా రెండు లక్షల రూపాయలు మంజూరు కావడంతో మంగళవారం తిప్పారెడ్డిపల్లి గ్రామాలలో సర్పంచు నూకం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మణెమ్మ భర్త రాములు గౌడ్ కు చెక్కును టిజివిబి జూపల్లి బ్రాంచ్ మేనేజర్ దేవేందర్ ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపిసిసి యాదమ్మ, పంచాయితీ కార్యదర్శి కాజా సుజావుద్దీన్, గ్రామస్తులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/అమరచింత :** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసిన క్లీనర్లను వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఆత్మకూరు మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు (పాక్స్), (ఐకెపి), పామిరెడ్డిపల్లి రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన (ఐకెపి) వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నమోదు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఇన్‌చార్జీలకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేసిన క్లీనర్లను వినియోగించుకుని వరి ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి లేకుండా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. తాలు లేకుండా ఉంటే మిల్లర్లకు ధాన్యంలో కోత పెట్టడానికి ఆస్కారం ఉండదని సూచించారు. కాబట్టి రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన తమ ధాన్యంలో తాలు లేకుండా, ప్యాడి క్లీనర్లను వినియోగించుకుని శుభ్రపరచుకోవాలన్నారు. అనంతరం ధాన్యం నమోదు రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను వరుస క్రమంలో రిజిస్టర్లలో నమోదు చేసుకుని వరుస క్రమంలో తూకం చేసి వెంటనే లోడింగ్ చేసి కేటాయించిన మిల్లులకు పంపాలన్నారు.ఈ కార్యక్రమంలో డిసిఎస్ ఓ. కాశీ విశ్వనాథ్, డిఎం ఆంజనేయులు,అమరచింత తహసిల్దార్ రవికుమార్, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను దోచుకుతినడానికే కవిత కొత్త పార్టీ

తెలంగాణ రక్షణ సేన కాదు, అది తెలంగాణ రాక్షస సేన

అధికారంలో ఉన్న పదేండ్లు కవిత ఎందుకు మాట్లాడలేదు

కల్వకుంట్ల కవిత కొత్త పార్టీపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హాట్ కామెంట్స్



**ప్రజాపక్షం/జడ్చర్ల :** కెసిఆర్ తనయ కల్వకుంట్ల కవిత కొత్తగా ఏర్పాటు చేసిన పార్టీ తెలంగాణ రక్షణ సేన కాదని, అది తెలంగాణ రాక్షస సేన అని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. జన్మనిచ్చి, జీవితాన్ని ఇచ్చిన తండ్రి మీదనే కొట్లాడుతున్న కవిత తెలంగాణ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ రాక్షస సేన పార్టీలో చేరిన వారందరూ ప్రజల్ని దోచుకుతినే రాక్షసులే అని హాట్ కామెంట్స్ చేశారు. రాజాపూర్ మండలంలోని కుచ్చర్కల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నాడు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ, కల్వకుంట్ల కవిత మీద, ఆమె ఏర్పాటు చేసిన కొత్త రాజకీయపార్టీ మీద హాట్ కామెంట్స్ చేశారు. కల్వకుంట్ల కుటుంబానికి సంబంధించి ఇప్పుడు రెండు పార్టీలు అయ్యాయని, ఒక వైపు బిఆర్ఎస్, మరోవైపు టిఆర్ఎస్ పార్టీలుగా ఏర్పడ్డాయని చెప్పారు. కవిత కొత్తగా పెట్టిన పేరు ఏమిటని ఆరా తీసిన ఎమ్మెల్యేకి అక్కడున్న నేత ఒకరు కొత్త పార్టీ పేరు తెలంగాణ రక్షణ సేన అని చెప్పగా, అది తెలంగాణ రక్షణ సేన కాదది, తెలంగాణ రాక్షస సేన పార్టీ అంటూ అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ కొత్త పార్టీ దేనికి అని ఆయ ప్రజలను ప్రశ్నించారు. మీ నాయిన పదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఆ రోజు ఎందుకు కొట్లాడలేదు, కాళేశ్వరంలో దోచుకుంటున్నారని ఎందుకు మాట్లాడలేదు, అని కల్వకుంట్ల కవితను సూటిగా ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏమీ మాట్లాడకుండా, అధికారం పోయిన తర్వాత ఇప్పుడు తమదేమీ సాగడం లేదని, కొత్త పార్టీ పెట్టి ఆ పార్టీ పేరు చెప్పి ఫ్యాక్టరీల దగ్గర ఇతరుల దగ్గర దోచుకోవచ్చని ఈ కొత్త పార్టీ పెట్టారా? అని నిలదీశారు. తెలంగాణ రాక్షసులని, ప్రజలను దోచుకోవడమే వారి లక్ష్యమని విమర్శించారు. ఒక తండ్రి పిల్లలకు వారు కోరింది, చేసి, వారికి జీవితాన్ని ఇస్తాడని, అలాంటి తండ్రి మీదనే కొట్లాడుతున్న కవిత తెలంగాణ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. బిఆర్ఎస్, టిఆర్ఎస్ పార్టీలు పేద ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో పుట్టిన పార్టీలు కాదని, ప్రజలను దోచుకుతినడానికి పుట్టిన పార్టీలు మాత్రమే కానీ, పేద ప్రజలకు న్యాయం చేసే పార్టీలు కావని అనిరుధ్ రెడ్డి దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీ పనులను పరిశీలించిన జిల్లా డిఆర్‌డిఒ

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండల పరిధిలోని పెద్దపోర్ల గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులను జిల్లా డిఆర్‌డిఒ మొగులప్ప సమగ్రంగా పరిశీలించారు. గ్రామ సర్పంచు బోయిన్పపల్లి కాశమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులను సందర్శించిన ఆయన పనుల నాణ్యత, పారదర్శకత సమయపాలనపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, వేతనాల చెల్లింపు విధానం, పనుల పురోగతి వంటి అంశాలను పరిశీలించి పనులు మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కిషోర్ కుమార్, ఏ.పి.ఓ లక్ష్మీ కాంత్‌రెడ్డి, మనీషా, ఫీల్డ్ అసిస్టెంట్ బాలస్వామి, పంచాయితీ కార్యదర్శి రాఖీ, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.



## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** జిల్లాలోని రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక సూచించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఇస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో రైతు వారం (మే 4 నుంచి 9 వరకు) ఉద్యాన పంటల సాగు ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల పై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కొంతమంది రైతులు పండించిన కూరగాయలు, పండ్లు, ఆయిల్ పామ్ గింజలు, వ్యవసాయానికి ఉపయోగించే వివిధ రకాల యంత్రాల ప్రదర్శన ను ఆమె తిలకించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణలో అన్ని శాఖల కార్యకలాపాలను రీ ఫ్రెష్ చేసుకోవాలని తెలిపారు. ఖమ్మంలో రైతులు ఎక్కువగా ఆయిల్ పామ్ తోటలను చేస్తారని, తాను అక్కడ విధులు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా, సత్య యాదవ్, వైస్ చైర్ పర్సన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి సాయి బాబా, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ జయచంద్ర మోహన్, మండల స్థాయి ఉద్యాన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** అంగన్వాడి సేవల్లో పారదర్శకతకు, కేంద్రాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని 334 మంది అంగన్వాడి టీచర్లకు స్థానిక అంబేద్కర్ కళాభవన్‌లో స్మార్ట్ ఫోన్లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి తాను ప్రత్యేక చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 334 అంగన్వాడి కేంద్రాలు ఉన్నాయని, వాటిలో కొన్ని కేంద్రాలకు భవనాల కొరతతో పాటు ఇతర సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంగన్వాడీ సిబ్బంది తమ కేంద్రాలకు సంబంధించిన ఏ సమస్యలైన నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి తెలియజేయాలని, జూన్ నెల నుంచి వాటి పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన చెప్పారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో , ఎస్వీఎస్ ఆసుపత్రిలో ఉచితంగా ప్రసవం చేసుకోవచ్చని, ప్రసవానంతరం వారికి అవసరమైన యెన్నం హెల్త్ కిట్లు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 1000 యెన్నం హెల్త్ కిట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు గ్రామస్థులకు తెలియజేయాలని సూచించారు. పేద, బలహీన వర్గాల ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక ఖర్చు పెట్టకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్యం పొందాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, బస్తీలలో నివసించే ప్రజలకు ఈ సమాచారం చేరవేయాలని కోరారు. అంగన్వాడి సిబ్బందికి అందజేసిన స్మార్ట్ ఫోన్ల ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే యాప్ ద్వారా పిల్లల హాజరు, వివరాలు రియల్ టైమ్ లో నమోదు కావడంతో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంతో పాటు గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయం, పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటలకే ఉర్కొండ మండల పరిధిలోని ఉరుకొండపేట, ముచ్చర్లపల్లి గ్రామాలను కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణాల పురోగతి, నాణ్యత, ప్రభుత్వ నిబంధనల అమలు తదితర అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వం అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలని సూచించారు. పనులను ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తిచేయాలని, నిర్మాణంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్థానిక అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులను దశలవారీగా ఆధార్ లింక్ చేసిన బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు త్వరగా గృహప్రవేశాలు చేసుకోవాలని కూడా కలెక్టర్ సూచించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, పిడి హౌసింగ్ సంగప్ప, తహసీల్దార్, యూసుఫ్ అలీ, ఎంపిడిఒ, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.




## నర్సింగ్ విద్యార్థులు సేవాభావంతో ముందుకు సాగాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/గద్వాలరూరల్ :** నాలుగేళ్ల పాటు చదివి బిఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగాలు సాధించాక సేవాభావం, సహానుభూతి, మానవత్వంతో కూడిన సేవలను రోగులకు అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గద్వాల్‌లోని అనంత ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఈనెల 12న ప్రపంచంలో మొదటి నర్స్ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి బ్యాచ్‌గా నర్సింగ్ విద్యార్థులు చదువు పూర్తిచేసుకుని వెళ్లడం సంతోషంగా ఉందని, వారందరూ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలలో మొత్తం 87మంది విద్యార్థులు నర్సులుగా కోర్సు పూర్తి చేసినందున ఈ సందర్భంగా కలెక్టర్ సహకరించిన వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతయ్య, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి దేవి, ఏవో శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బిజెపి మతోన్మాదం .. యువత చైతన్యానికి ప్రతిబంధకం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్

**ప్రజాపక్షం/పానుగల్ :** బిజెపి హిందూ మతోన్మాదం యువత చైతన్యానికి ప్రతిబంధకమని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతూరు శ్రీరామ్ అన్నారు. పానుగల్ మండలం తెల్లరాల్లపల్లిలో సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా జెండా ఎగురవేసి మాట్లాడారు. పల్లెలు, పట్టణాల్లో నిరుద్యోగ, పేద, బడుగు బలహీన వర్గాల యువతను హిందూ మతం పేరుతో, డబ్బు, తాగుడు ప్రలోభాలు పెట్టి ఆకర్షిస్తోందన్నారు. నిరుద్యోగం పేదరికం పై ప్రశ్నించి, పోరాడకుండా మభ్యపెడుతుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పి అధికారంలోకి వచ్చి లక్ష ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, ప్రతి రైతు ఖాతాలో రూ. 15 లక్షలు జమ చేస్తామని చెప్పి మోసం చేసిన కర్మ సిద్ధాంతం చెప్పి తిరగబడకుండా చేస్తోందన్నారు. ఈసీని అడ్డుపెట్టుకొని, ధనం కుమ్మరించి తాజా ఎన్నికల్లో గెలిచి బిజెపి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. కార్మికులు, కర్షకులు, యువత ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికారమే పరమావధిగా దేవుని పేరు చెప్పి అధికారం కాపాడుకుంటుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత కరెంటు, అందరికీ ఇందిరమ్మ ఇల్లు తదితర హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. కష్టజీవులకు అండగా ఉండేది ఎర్రజెండా మాత్రమేనని దాని కింద ఏకమై హక్కుల కోసం పోరాడాలని కోరారు. సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, తెల్ల రాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ బాలస్వామి, వార్డు సభ్యుడు గ్రామ శాఖ కార్యదర్శి సహదేవ్, మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మాజీ వార్డు సభ్యులు కట్టెల బాల స్వామి, ఎర్రగుంట రాముడు, పరంధాములు,శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.




## లేబర్ కోడ్‌లు రద్దు చేసేదాకా పోరాటం

సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కార్మికుల హక్కులకు గొడ్డలి పెట్టుగా మారిన 4 లేబర్ కోడ్‌లను కేంద్రం రద్దు చేసుకునేదాకా చికాగోల అమరుల స్ఫూర్తితో కార్మికులు పోరాడాన్ని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. వీపనగండ్ల మండల బొల్లారంలో మేడే వారోత్సవాల సందర్భంగా గ్రామంలో అరుణ పతాకాలను సీనియర్ నేతలు రంజాన్, వంక గోపాల్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రమేష్ మాట్లాడుతూ కేంద్రం శ్రమజీవుల కష్టాన్ని సంపన్నులకు దోచి పెట్టేందుకు 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడులను తెచ్చి నిర్వీర్యం చేసిందన్నారు. అమెరికా చికాగో అమరుల పోరాటం త్యాగం ఫలితంగా గతంలో ఉన్న గతంలో ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న 20 గంటల పరిధిలో ఎనిమిది గంటలకు తగ్గించారన్నారు. బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చికాగో అమరుల పోరాటాన్ని అపహాస్యం చేస్తూ ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. సమ్మె హక్కు సంఘం పెట్టుకునే హక్కు లేబర్ కోడుల వల్ల కార్మికులు కోల్పోయారన్నారు. కేంద్ర బిజెపి సంపన్నులకు అనుకూల శ్రమజీవులు వ్యతిరేక ప్రభుత్వం అన్నారు. పని గంటలు పెంచడం ద్వారా పేదల శ్రమను సంపన్నులకు దోచిపెట్టడమేనని విమర్శించారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, తెల్లరాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ బాలస్వామి, పానుగల్ మండల కార్యదరిశ డంగు కురుమయ్య, వీపనగండ్ల మండల కార్యదర్శి మండ్ల కురమయ్య, సీనియర్ నేతలు రంజాన్ వేమన్న , మండ్ల కృష్ణయ్య, ప్రభాకర్ రెడ్డి, కావలి తిరుపతయ్య, రమేష్ ఆచారి, నరసింహ ఆచారి, బోరెల్లి రామచంద్రయ్య, దేవరపాగ, వెంకటయ్య, కాకం రాముడు తదితరులు పాల్గొన్నారు.

## అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటుకు వినతి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు లక్కిరెడ్డి సుగుణా రెడ్డి కోడుమూరు రంగారెడ్డి మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు లక్కిరెడ్డి కర్ణసింహరెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బి.రామ్ ప్రసాద్‌రెడ్డి, రైతులు ధర్మవరం నరసింహ ఎలుక మద్దిలేటి సామాజిక కార్యకర్త శాంతకుమార్ సమక్షంలో నేషనల్ హైవే యన్‌హెచ్ 44 రోడ్డు విస్తరణ 6 లైన్లో భాగంగా జల్లాపురం గ్రామ స్టేజిలో అండర్‌పాస్ బ్రిడ్జి రోడ్డు ఏర్పాటు చేయకపోతే పల్లెపాడు చండూరు మారమునగాల ప్రాగటూరు జల్లాపురం ఈ గ్రామం వైపు నుంచి కర్నూల్ గద్వాల హైదరాబాద్ పట్టణ ప్రాంతాలకు చిన్న పెద్ద వాహనాల మీద హైవే రోడ్డు మార్గం ఎక్కాలంటే రాంగ్ రూటులో వెళ్లలేక పోతున్నాము. ఇలా రాంగ్ రూట్‌లో ప్రయాణం చేసిన సందర్భాల్లో ఎక్కువగా అక్సిడెంట్లు జరిగి కొంతమందికి కాళ్లు చేతులు విరగడం జరిగింది. మరి కొందరు ప్రాణాలు విడిచిరాంటూ గ్రామస్తులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యే విజయుడు కి గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తపరిచారు. కావున మా స్టేజిలో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కి వినతిపత్రం అందజేశారు.

# రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

రాష్ట్ర రైతు, వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి




**ప్రజాపక్షం/యాచారం :** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని తెలంగాణ రాష్ట్ర రైతు వ్యవసాయశాఖ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతు దినోత్సవాలు వారోత్సవాలు 99వ ప్రజా ప్రణాళికలో భాగంగా ఉద్యాన , పట్టుపరిశ్రమ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఉద్యాన పంటల సాగు ఆయిల్ పామ్ సాగు విస్తర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంట సాగు పై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తక్కువ నీటితో అధిఉ దిగుబడులు వచ్చే పంటలను సాగు చేసుకోవాలన్నారు. వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటల సాగు విధానం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు కమిషన్ మేంబర్ సెక్రటరి గోపాల్, ఆర్‌డిఒ అనంతరెడ్డి, అడిషనల్ డైరెక్టర్ అఫ్ హార్టికల్చర్ సరోజిని దేవి, శాస్త్ర వేత్తలు నిఖిల్, శ్రీకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగరాజు, డాక్టర్ ప్రవలిక, డిఎఒ ఉషారాణి, డిహెచ్‌ఎస్‌ఒ కె.సురేశ్, డిఎఫ్‌ఒ పూర్ణిమా ఎడిఎ సుజాత, ఎడిహెచ్ అరుణ, ఎంపిడిఒ రాధరాణి, విజయలక్ష్మి, తహసీల్దార్ అయ్యప్ప, వ్యవసాయధికారి అర్.రవినాథ్ పాల్గొన్నారు.

# నిర్దేశించిన విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలి

రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మను చౌదరి





**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో సంబంధిత జిల్లా అధికారులు తమకు నిర్దేశించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరంల్లో కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)కె.చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి కొప్పిశెట్టితో కలిసి ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగ చేపట్టవలసిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, పలు సూచనలతో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటన నిమిత్తం జిల్లాలో చేపట్టే ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి తప్పిదాలకు తవ్వివకుండా చేపట్టాలని సూచించారు. అధికారులందరూ తమకు కేటాయించిన విధులను నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, పోలీస్, విద్యుత్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు పాల్గొన్నారు.

## కాటేదాన్ స్టేడియంలో ఉత్సాహంగా.. ‘జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ క్విజ్’




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని విద్యార్థుల్లో క్రీడల పట్ల అవగాహన, ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో జిహెచ్‌ఎంసి వేసవి శిక్షణా శిబిరం 2026లో భాగంగా నిర్వహించిన స్పోర్ట్స్ క్విజ్ పోటీలు కాటేదాన్ స్పోర్ట్స్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని క్రీడా మైదానాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోటీల్లో రాజేంద్రనగర్ జోన్ నలుమూలల నుండి 150 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారితో పాటు క్రీడా అధికారులు, కోచ్‌లు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి క్రీడా విభాగం సిబ్బంది, స్థానిక కోచ్‌లు పాల్గొన్నారు.

## జూన్ 7 వరకు కొనసాగనున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవి సెలవుల్లో యువతను క్రీడల వైపు మళ్లించే లక్ష్యంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్స్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. గత నెల 24న ప్రారంభమైన ఈ శిక్షణా శిబిరాలు జూన్ 7 వరకు రాష్ట్రంలోని 33 జిల్లాల్లో కొనసాగనున్నాయి. జంట నగరాల్లోని ప్రధాన క్రీడా వేదికలు గచ్చిబౌలి స్టేడియం, ఎల్‌బీ స్టేడియం, జింఖానాగ్రౌండ్, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, యూసుఫ్‌గూడా కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఉస్మానియా యూనివర్సిటీ సైక్లింగ్ వేలోడ్రోమ్, హుస్సేన్‌సాగర్ వాటర్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లలో ఈ క్యాంపులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే 3 వేల మందికి పైగా క్రీడాకారులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రైవేట్ అకాడమీలతో పోలిస్తే తక్కువ ఫీజులతో, అంతర్జాతీయ ప్రమాణాల మైదానాల్లో అనుభవజ్ఞులైన కోచ్‌ల ద్వారా శిక్షణ అందించడం ప్రత్యేకతగానిలుస్తోంది. ఈ ఏడాది మరిన్ని క్రీడాంశాలను ప్రవేశపెట్టడంతో పాటు జిల్లా కేంద్రాలకే పరిమితం కాకుండా పట్టణ స్థాయికి విస్తరించినట్లు స్పోర్ట్స్ అథారిటీ వెల్లడించింది. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు ఉచితంగా యోగా, జుంబా శిక్షణ కూడా అందిస్తున్నారు. అసిస్టెంట్ కోచ్‌లకు గౌరవ వేతనాన్ని పెంచి అనుభవజ్ఞులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు గ్రామీణ క్రీడాకారులకు అవకాశాలు కల్పించే దిశగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాలతో విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెరిగిందని, అందుకే ఈ క్యాంపులకు భారీ స్పందన లభిస్తోందని ఆయన పేర్కొన్నారు.

# ఒఆర్‌ఆర్‌పై ప్రమాదాల నివారణకు చర్యలు

సిపి సజ్జనార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహానగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్‌ఆర్)పై రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి అధికారులు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ అధ్యక్షతన టిజిఐసిసిసిలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రవాణా శాఖ, హెచ్‌ఎండిఎ, ఎన్‌హెచ్‌ఎఐ, జిహెచ్‌ఎంసి, ఐఆర్‌బి ఇన్‌ఫ్రా ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొని రోడ్డు భద్రతపై చర్చించారు. ఓఆర్‌ఆర్‌పై రోజుకు సగటున 2.8 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు కీలకమని సజ్జనార్ పేర్కొన్నారు. ప్రస్తుతం రోజుకు ఐదారు ప్రమాదాలు నమోదవుతున్నాయని, సమన్వయంతో వాటిని సున్నాకు తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు చలాన్లతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఓఆర్ ఆర్‌లోకి ప్రవేశించే వారికి మొబైల్ సందేశాల ద్వారా భద్రతా సూచనలు పంపాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో రెస్పాన్స్ టైమ్ తగ్గించేందుకు ట్రాఫిక్ మార్షల్స్ సేవలు వినియోగించాలన్నారు. గత నాలుగు నెలల గణాంకాల ప్రకారం నిద్రమత్తు ద్వారా 33 శాతం, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల 25శాతం, అతివేగం 15 శాతం, టైర్లు పేలడం వల్ల 14 శాతం ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ వాహనాల ఫిట్‌నెస్, టైర్ల నాణ్యత తనిఖీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్‌ను సన్మానించిన సిపి

నేరం జరుగుతుంటే చూస్తూ ఉండిపోవడం కాదు.. ఆ నేరగాడిని పట్టుకోవడమే అసలైన పౌర ధర్మమని నిరూపించారు ఒక సామాన్య ఆటో డ్రైవర్. ఒక మహిళా బాధితురాలి మెడలో బంగారు గొలుసును రౌడీ షీటర్ లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా ఆటోడ్రైవర్ మహమ్మద్ జాహెర్ తన ప్రాణాలకు తెగించి తన ఆటోనే ఆయుధంగా మలుచుకుని సాహసోపేతంగా రౌడీ షీటర్‌ను అడ్డుకున్నారు. ఈ అసమాన్య ధైర్యాన్ని ప్రదర్శించిన ఆటో డ్రైవర్ జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ మంగళవారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్‌లో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. డబీర్‌పురకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో నిందితుడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో, అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ పారిపోవడానికి ప్రయత్నిస్తున్న రౌడీ షీటర్ బైక్‌ను తన ఆటోతో ఢీకొట్టి అతడిని కిందపడేశారు. ఆ సమయంలో గస్తీ తిరుగుతున్న పోలీసులు రౌడీ షీటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సిపి విసి సజ్జనర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ చూపిన సాహసం సమాజానికి ఆదర్శమన్నారు.




# ఆత్మవిశ్వాసంతో విద్యనభ్యసిస్తేనే భవిష్యత్

రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారుమయంగా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. షాద్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న విట్టి అకాడమీకి చెందిన బ్రోచర్‌ను మంగళవారం హైద్రాబాద్‌లోని నలుగురు మంత్రుల నివాస ప్రాంగణంలో విడుదల చేశారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిల నివాసంలో ఐఐటి, నీట్, సీఏ అకాడమీల పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి), ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ డెంటల్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే నీట్ పరీక్షలకు అనుగుణంగా అత్యుత్తమ శిక్షణ ఇచ్చి విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దాలని మంత్రులు సూచించారు. మంత్రులను కలిసిన వారిలో అకాడమీ ప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, యేగేందర్, దేవేందర్ ఉన్నారు.

## పది విద్యార్థులకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గ్రామ పంచాయతీ పాలకవర్గం అధ్వర్యంలో ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. మండల స్థాయిలో కె.దివ్య 570 మండల టాపర్‌గా నిలువగా, ద్వితీయ స్థానంలో జె మనిష 567 మార్కులతో నిలచారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి , ప్రధానోపాధ్యాయులు ఎవి శాస్త్రి, అర్.కిషన్, పి.వెంకటరెడ్డి, ఇ.వేంకటేశం, వి.శ్రీనివాస్‌పాల్గొన్నారు.



## అసత్య ప్రచారాలు తగదు టిజిఎస్ ఆర్‌టిసి యాజమాన్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఒక ఉద్యోగికి సంబంధించి సోషల్ మీడియాతో పాటు కొన్ని మీడియా వర్గాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని సంస్థ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. వాస్తవాలను తెలుసుకోకుండా ఒక మానవీయ కోణంలో తీసుకున్న నిర్ణయాన్ని వక్రీకరించడం సరికాదని స్పష్టం చేసింది. మెహదీపట్నం డిపోకు చెందిన అమీన్ అహ్మద్ అన్సారీ (E.222273) సుమారు 198 సెంటీమీటర్ల (6అడుగుల 6 అంగుళాలు) అసాధారణ ఎత్తు కలిగి ఉన్నారు. ఈ శారీరక స్థితి కారణంగా ఆయన బస్సుల్లో కండక్టర్‌గా తన విధులను నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాది కాలంగా అన్సారీ ఎదుర్కొంటున్న ఈ శారీరక ఇబ్బందులను గమనించిన సంస్థ, ఆయనపై సానుభూతితో గతంలోనే అవుట్ ఆఫ్ డెసిగ్నేషన్ (ఓడి) విధులను కేటాయించింది. ఆ గడువు ముగియడంతో సదరు ఉద్యోగి పడుతున్న కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని టిజిఎస్ ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు అహ్మద్ అన్సారీ సేవలను బస్‌పాస్ సెక్షన్లలో లేదా రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న సంస్థ కార్యాలయాల్లో వినియోగించుకోవాలని ఆదేశాలు జారిచేయడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు.

# రాజకీయ అధికారమే లక్ష్యంగా బిసిల పోరాటం

జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాలు బిసిలకు అనుకూలంగా ఉన్నాయని, నేపాల్‌లో జెన్ జీ ఉద్యమం, తమిళనాడులో టివికె పార్టీలు అధికారంలోకి దూసుకొచ్చాయని, ఇదే తరహాలో పోరాడితే 2029 ఎన్నికల్లో తెలంగాణలో రాజకీయ అధికారం దక్కడం ఖాయమని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగింది. బిసి ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంగా ముందుకు తీసుకువెళ్తామని, అందుకు బూత్ స్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు రాజకీయ నిర్మాణం చేపడతామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. అందులో భాగంగా జూన్ రెండో వారంలో లక్షలాదిమందితో బిసి విద్యార్థి రాజకీయ యుద్ధభేరి సభ నిర్వహిస్తామని, జులై 12న బిసిల రాజకీయ ప్లీనరీ, ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబిసి మహా సభ, సెప్టెంబర్ మొదటి వారం నుండి నవంబర్ చివరి వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిసిల రథయాత్ర, డిసెంబర్‌లో లక్షలాది మందితో హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో బిసిల రాజకీయ శంఖారావం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. బిసిల ఆకాంక్షను పరిగణలో తీసుకుని జూలై 12న హైదరాబాద్‌లో జరిగే బిసిల రాజకీయ ప్లీనరీలో రాజకీయ వేదికను ప్రకటిస్తామని ఆయన వెల్లడించారు. సమావేశానికి బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ, కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షతన వహించగా, బిసి సంఘాల నేతలు కుందారం గణేష్ చారి, తాటికొండ విక్రమ్ గౌడ్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, బి.మని మంజరి, గొడుగు మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డ్స్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుల సంక్షేమమే లక్ష్యం



సైబరాబాద్ అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హోంగార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుల సంక్షేమమే లక్ష్యం అని సైబరాబాద్ అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ అన్నారు. మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మొదటి జనరల్ బాడీ సమావేశం సైబరాబాద్ సిపి కార్యలయంలోని ఆడిటోరియంలో నిర్వహించారు. సమావేశంలో సొసైటీ కార్యకలాపాలు, సభ్యుల సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలు, ఆర్థిక వ్యవహారాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిగా ఏర్పాటు చేసిన సైబరాబాద్ హోంగార్డ్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అత్యంత ఉత్తమ స్థాయిలో పనిచేస్తోందన్నారు. సొసైటీలోని సభ్యులకు అన్ని విషయాలను పారదర్శకంగా తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో సైబరాబాద్ కోపరేటివ్ సొసైటీ ఇంచార్జి ఎస్ఐ మల్లేశం, సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ డిసిపి సంజీవ్, అడ్మిన్ ఎడిసిపి ఎఫ్.రెహామాన్, సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ ఎడిసిపి షమీర్, హోంగార్డ్స్ వెల్ఫేర్ ఆర్ఐ విజయానంద్, సైబరాబాద్ కోపరేటివ్ సొసైటీ ఇంచార్జి ఎస్ఐ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్, సనత్‌నగర్ టిమ్స్ ఆసుపత్రుల పరిశీలన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అల్వాల్, సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి పి.ప్రవీణ్య మంగళవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. ఓపి గదులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసియు, జనరల్ వార్డులను ప్రత్యేక కార్యదర్శి పరిశీలించి, ఆధునిక వైద్య సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేసి, పరికరాల కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఆసుపత్రులను త్వరగా పూర్తిస్థాయిలో సిద్ధం చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు.



# ఆయిల్ పామ్‌పై రైతులు దృష్టి కేంద్రీకరిస్తే అధిక లాభాలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్






**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆయిల్ పామ్ సాగుపై అన్నదాతలు దృష్టి కేంద్రీకరించి సాగుచేస్తే అధిక లాభాలు సాధించేందుకు ఆస్కారం ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ పట్టు పరిశ్రమ కార్యాలయం వద్ద ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన..ప్రగతి ప్రణాళిక రైతు వారోత్సవాల్లో భాగంగా డివిజన్ స్థాయి ఉద్యానవన పంటల సాగు, ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణంపై సమావేశం నిర్వహించారు. ఉద్యానవన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అంధిస్తున్న వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాద్‌నగర్ డివిజన్ ఉద్యాన వన శాఖ అధికారిణి హిమబిందు, హెచ్‌ఒలు రాజేష్, రుక్మిణి పాల్గొన్నారు.

### ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధే లక్ష్యం

**కొత్తూరు:** ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. కొత్తూరు మున్సిపాలిటీలో పార్కుల అభివృద్ధికి, హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పలు అభివృద్ధి పనులు, వేసవిలో తాగు నీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్‌కు ప్రభుత్వం అంధిస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.బాలాజీ, వైస్‌చైర్మన్ డోలీ రవీందర్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ ఎఇ నరేష్, కౌన్సిలర్లు పి.మాధవి గోపాల్, సి.చంద్రకళ రాజేందర్‌గౌడ్, కోస్గి శ్రీనివాస్, పి.సోమ్లానాయక్, జె.అనిత శ్రీనివాస్, వి.హేమ దేవేందర్ ముదిరాజ్, కమ్మరి జయమ్మ జనార్థన్‌చారి, మాదారం నర్సింహ, బి.ప్రసన్నలత యాదయ్య, నాయకులు హరినాథ్‌రెడ్డి, జంగ నర్సింహ్మా, కర్రోళ్ల సురేందర్, ఎమ్మె సత్తయ్య, ఆంజనేయులు గౌడ్, చిల్కమర్రి నర్సింహ్మా, తీగాపూర్ ఆంజనేయులు, అంజినాయక్, నరసింహాగౌడ్, సుమన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** బాబా అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ చందునాయక్ ఆధ్వర్యంలో మక్తలో దర్గా ఉర్సుఉత్సవాల్లో ఎమ్మెల్యే శంకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఇద్రీస్, చింోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు తిరుపతయ్య, శ్రీను, జివిఎస్ శ్రీను నాయక్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పెట్టుబడులలో 'మందకొడితనం'...

# మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ విమర్శనాస్త్రాలు

**ఈడి, సిబిఐ, ఐటి 'రైడ్ రాజ్' కారణాల వల్లే పెట్టుబడులను నిరాకరిస్తున్నారని ధ్వజం**



**న్యూఢిల్లీ :** ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలో 'మందకొడితనం'పై కాంగ్రెస్ మంగళవారం మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. భారతదేశంలో స్తంభించిన వాస్తవ వేతన సంక్షోభం కారణంగా వినియోగదారుల డిమాండ్ వృద్ధి మందగించడం, అలాగే ఈడి–సిబిఐ–ఐటి 'రైడ్ రాజ్' వంటి అనేక కారణాల వల్ల పెట్టుబడులను నిరాకరిస్తున్నారని తెలిపింది. ఆర్థిక వ్యవస్థ అధిక వాస్తవ జిడిపి వృద్ధి రేట్లను సాధించకుండా నిరోధిస్తున్న ఒక ప్రాథమిక సమస్య అయిన ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడులలోని మందకొడితనంపై తమ పార్టీ కొంతకాలంగా దృష్టి సారించిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరామ్ రమేష్ తెలిపారు. 'పన్ను రేట్లను భారీగా తగ్గించారు. వ్యాపార సౌలభ్యం కూడా గణనీయంగా మెరుగుపడిందని చెబుతున్నారు. కానీ ఈ చర్యల వల్ల ఆశించిన ఫలితం అంటే ప్రైవేట్ పెట్టుబడులకు ఊతం లభించడం, కార్యరూపం దాల్చడం లేదు' అని జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో చెప్పారు. 'ఇప్పుడు ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రధాన ఆర్థిక సలహాదారు (వి.అనంత నాగేశ్వరన్), కోవిడ్ అనంతర కాలం భారతదేశంలోని అతిపెద్ద కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి నిరాకరించినప్పటికీ, వాటి కార్పొరేట్ లాభాలు సంవత్సరానికి 30.8శాతం చొప్పున పెరుగుతున్నాయని ఎత్తిచూపుతూ మా వాదనకు మద్దతు తెలిపారు' అని జైరామ్ రమేష్ అన్నారు. భారతదేశంలో స్తంభించిపోయిన వేతనాల సంక్షోభం కారణంగా వినియోగదారుల డిమాండ్ వృద్ధి మందగించడం వంటి అనేక అంశాలే పెట్టుబడులు పెట్టడానికి ఈ మొండి నిరాకరణకు కారణం అని ఆయన చెప్పారు. వినియోగదారుల డిమాండ్ లేనప్పుడు, పెట్టుబడులు పెట్టడానికి ఇండియా ఇంక్‌కు ఎలాంటి ప్రోత్సాహం ఉండదని రమేష్ వాదించారు. వ్యాపారులలో అనిశ్చితి వాతావరణాన్ని, పెట్టుబడిదారులలో విస్తృత భయాన్ని సృష్టించిన ఈడి–సిబిఐ–ఐటి 'రైడ్ రాజ్'కూడా పెట్టుబడులు తిరస్కరించడానికి ఒక ముఖ్య కారణమని జైరామ్ రమేష్ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం సులభతరం చేసి, ప్రోత్సహించిన ఆర్థికవ్యవస్థలోని పెట్టుబడి కేంద్రీకృత రంగాలపై నియంత్రణ పెరగడం కూడా పెట్టుబడులను తిరస్కరించడానికి ఒక కారణమని ఆయన ధ్వజమెత్తారు. ఈ బంధు ప్రీతికి మోదానీయే ప్రస్ఫుటమైన ఉదాహరణ అని జైరామ్ రమేష్ వివరించారు. మోదీప్రభుత్వం 'చందా లో దందా దో' వ్యాపార కౌంటర్‌కు చెల్లింపు చేయడం ద్వారా లాభాలు విజయవంతంగా ఆర్జించగలిగినప్పుడు, కార్పొరేట్‌లు స్వతంత్రంగా పెట్టుబడి పెట్టడానికి, దానితోపాటు వచ్చే నష్టానికి అంగీకరించడానికి పెద్దగా ప్రోత్సాహం ఉండదని జైరామ్ రమేష్ మరింత గట్టిగా వాదించారు. ప్రైవేట్ రంగాన్ని విమర్శిస్తూ పెట్టుబడులు పెట్టడానికి ఎందుకు వెనకాడుతుందో ఆత్మ పరిశీలన చేసుకోమని నాగేశ్వరన్ కోరారని, ఇది కూడా డిమాండ్‌లో అనిశ్చితికి దోహద పడి ఉండొచ్చని పేర్కొన్న ఒక మీడియా రిపోర్టును కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ట్యాగ్ చేశారు.పోస్ట్ కోవిడ్ తర్వాత మీరు బిఎస్ఇ 500 లేదా ఎన్ఎస్ఇ 500 కంపెనీలను చూస్తే కార్పొరేట్ లాభాలు ఏడాదికి 30.8శాతం పెరిగాయి. అయినప్పటికీ ప్రైవేట్ రంగం నుంచి మన మొత్తం మూలధన సమీకరణ రేట్లు నిరాశపర్చాయని అనంత నాగేశ్వరన్ అన్నట్లు వార్తలు వచ్చాయని తెలిపారు.


# సిఎం పదవికి స్టాలిన్ రాజీనామా



**చెన్నై :** డిఎంకె అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ మంగళవారం తమిళనాడు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ కార్యాలయానికి పంపినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, ఆయన మంత్రివర్గం సమర్పించిన రాజీనామాలను గవర్నర్ ఆమోదించినట్లు లోక్‌భవన్ మంగళవారం తెలిపింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు పదవిలో కొనసాగాలని గవర్నర్ స్టాలిన్‌ను కోరినట్లు లోక్‌భవన్‌లో ఒక ప్రకటనలో తెలియజేసింది. కాగా, ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ నేతృత్వంలోని టివికె చేతిలో డిఎంకె ఓటమి పాలైంది. 234 మంది సభ్యులు కలిగిన తమిళనాడు అసెంబ్లీలో డిఎంకె 59 స్థానాలను గెలుచుకుని, ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. ఎఐఎడిఎంకె 47 స్థానాలను గెలుచుకుంది. టివికె 108 స్థానాలను గెలుచుకుని, ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. డిఎంకె ఒక బలమైన ప్రతిపక్ష పార్టీగా వ్యవహరిస్తుందని స్టాలిన్ పేర్కొన్నారు.

## కేరళ కాంగ్రెస్‌లో సిఎం పదవికి

# ముగ్గురు పోటీదారులు




**తిరువనంతపురం :** కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. దీంతో కూటమిలో ఆనందం, ఉపశమనం వెల్లివిరిసింది. ఆశ, జాగ్రత్తతో కూడిన వాతావరణం నెలకొంది. ఇదే సమయంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్చలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. తదుపరి చర్యలను నిర్ణయించడానికి నాయకులు సమావేశాలు, అనధికారిక సంప్రదింపులు జరుపుతున్నారు. సీనియర్ నాయకులకు ఈ విజయం కేవలం రాజకీయపరమైనది మాత్రమే కాదు, ఇది ఒక భావోద్వేగ ఘట్టం కూడా అని, వారిలో చాలామంది దీనిని ప్రజల విశ్వాసం తిరిగి వచ్చిన సందర్భం అని కూడా అభివర్ణించారు. విజయోత్సవాల మధ్యే ముఖ్యమంత్రి పదవి కోసం పార్టీలోని సీనియర్ నాయకుల మధ్య తీవ్రమైన ప్రయత్నాలు మొదలయ్యాయి. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఈ పదవి కోసం ముగ్గురు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. అందులో ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీశన్, సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యుడు కె.సి. వేణుగోపాల్‌లు సిఎం పదవికి ఆశిస్తున్న వారిలో ముందంజలో ఉన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు ప్రజలు మార్పును కోరుకున్నారని స్పష్టం చేస్తున్నాయని పేర్కొంటూ యుడిఎఫ్ నాయకులు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సొంతంగానే 63 స్థానాలను గెలుచుకున్నందున, కూటమి భాగస్వాములకు తలొగ్గాల్సిన లేదా స్థానాలను త్యాగం చేయాల్సిన ఒత్తిడి లేదు. తదుపరి ముఖ్యమంత్రిని నిర్ణయించే ప్రక్రియలో భాగంగా, పార్టీ అధిష్టానం ఒక ఎఐసిసి బృందాన్ని కేరళకు పంపనుంది. ఈ బృందం, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, కేరళ వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షితో కలిసి, పార్టీ ఎమ్మెల్యేలతో చర్చలు జరుపుతుంది. వారు ఎమ్మెల్యేలను వ్యక్తిగతంగా కలుస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. వారు ఐయుఎంఎల్‌తో సహా ఇతర కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులను కూడా కలిసే అవకాశం ఉంది. ఆ తర్వాత, కాంగ్రెస్ శాసనసభ పక్షం (సిపిపి) సమావేశమై, తదుపరి ముఖ్యమంత్రిని నిర్ణయించే అధికారాన్ని ఎఐసిసికి అప్పగిస్తూ ఒక ఏకవాక్య తీర్మానాన్ని ఆమోదిస్తుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.కాగా, 140 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుపై ఎన్నికల సంఘం వెల్లడించిన సమాచారం ప్రకారం, యుడిఎఫ్ 102 సీట్లు గెలుచుకోగా, సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ 35 సీట్లు కైవసం చేసుకుంది. గత ఐదు దశాబ్దాలలో భారత్‌లో ఏ రాష్ట్రంలోనూ వామపక్షాలు అధికారంలోకి రాకపోవడం ఇదే మొదటిసారి.

# ఫుజైరాపై ఇరాన్ దాడి.. 'ఆమోదయోగ్యం కాదు'

- డ్రోన్ దాడిలో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటనను ఖండించిన భారత్
- మౌలిక సదుపాయాలు, పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని నిలిపేయాలని పిలుపు

**న్యూఢిల్లీ :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)లోని 'పోర్ట్ సిటీ' ఫుజైరా నగరంలోని ఒక ప్రధాన ఆయిల్ ఇండస్ట్రీ జోన్‌పై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ముగ్గురు భారతీయులు గాయపడిన ఘటనను మంగళవారం భారత్ తీవ్రంగా ఖండించింది.ఈ ఘటనపై స్పందించిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఇఏ) ఈ దాడులు ఏమాత్రం 'ఆమోదయోగ్యం కాదు' అని ఆక్షేపించింది. మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఫుజైరా నగరంలోని ఒక ప్రధాన చమురు పరిశ్రమ ప్రాంతంలో డ్రోన్ దాడి కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో భారతీయులు గాయపడిన ఒక రోజు అనంతరం న్యూఢిల్లీ ఈ విధంగా స్పందించింది. ఈ దాడి ఇరాన్ చేసిందని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆరోపించింది. 'ఈ ఘర్షణలను, పౌర మౌలిక సదుపాయాలు, అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని తక్షణమే నిలిపివేయాలని మేం పిలుపునిస్తున్నాం' అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. పశ్చిమాసియా అంతటా శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు, ఈ పద్ధతిని పరిష్కరించేందుకు భారత్ చర్చలు, దౌత్యం కొనసాగించాలన్న వైఖరివైపే నిలబడుతుందని ఆయన స్పష్టంచేశారు. 'అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా హోర్ముజ్ జలసంధి గుండా స్వేచ్ఛాయుత నిరాటంకమైన నౌకాయానానికి, రాకపోకలకు కూడా మేం పిలుపునిస్తున్నాం. మా సమస్యల శాంతియుత పరిష్కారం కోసం చేసే అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉంది' అని జైస్వాల్ తెలిపారు. హోర్ముజ్ జలసంధిలో అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం ఉద్రిక్తంగా మారిన తరుణంలో ఫుజైరా నగరంపై దాడి జరిగింది. ఇరాన్ నుంచి ప్రయోగించిన 12 బాలిస్టిక్ క్షిపణులు, మూడు క్రూయిజ్ క్షిపణులు, నాలుగు డిఆర్‌ఓలను తమ వాయు రక్షణ వ్యవస్థలు తిప్పికొట్టాయని యుఏఇ రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది.'తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం' అని మంత్రిత్వ శాఖ ధృవీకరించింది.ఎలాంటి బెదింపులనైనా ఎదుర్కొంటామని,దేశ భద్రతను దెబ్బతీసే దేనినైనాదృఢంగా ప్రతిఘటిస్తామని యుఏఇ రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది.

## 2027లో యుపి ఎన్నికల్లో

# మహిళా కోటా అమలు చేయాలి

- సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో 2027 జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపినుద్దేశించి మాట్లాడుతూ 2027 గడువు నాటికి దీనిని అమలు చేస్తామని కట్టుబడి ఉండాలని, లేదంటే మహిళల ప్రయోజనాలకు తాము వ్యతిరేకమని బహిరంగంగా అంగీకరించాలని మాజీ ముఖ్యమంత్రి సవాలు విసిరారు. 'పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ ఏకగ్రీవంగా, సంతోషంగా ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లును, 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నాటికి బిజెపి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని 'పిడిఎ' (వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలు) డిమాండ్ చేస్తోంది' అని యాదవ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. లేదంటే, బిజెపిలోని పురుషాధిక్య ధోరణి కలిగిన సభ్యులు, వారి భూస్వామ్య అనుచరులు మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకమని వారే స్వయంగా చెప్పాలని యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై ప్రభుత్వం మౌనం వహిస్తే, తమ పార్టీ దీనిని ఒక నిరంతర ఉద్యమంగా మారుస్తుందని ఎస్‌పి చీఫ్ తెలిపారు. ఈ ప్రకటన వెలువడేంత వరకు, తాము ప్రతి వారం వివిధ ప్రాంతాల్లో ఈ అంశాన్ని లేవనెత్తుతూనే ఉంటామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన ఒక వీడియోను కూడా యాదవ్ పోస్ట్ చేశారు; ఆ వీడియోలో, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ల అమలును సమాజ్‌వాదీ పార్టీ అడ్డుకుంటోందని మోదీ ఆరోపించారు. 2027లో జరగబోయే కీలకమైన రాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో, వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల ఓటు బ్యాంకులను ఏకీకృతం చేసే లక్ష్యంతో ఎస్‌పి రూపొందించిన విస్తృత పిడిఎ వ్యూహంలో భాగంగా ఈ డిమాండ్ ముందుకు వచ్చింది. మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాబోయే అసెంబ్లీ ఎన్నికలతో ముడిపెట్టడం ద్వారా, తమ పాలన 'మహిళా కేంద్రితమైనది' అని బిజెపి చేసుకుంటున్న వాదనలపై ఒత్తిడి పెంచాలని ఎస్‌పి భావిస్తోంది. శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు, అలాగే లోక్‌సభ స్థానాల సంఖ్యను 816కు పెంచేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఏప్రిల్ 17న వీగిపోయింది. లోక్‌సభలో ఈ బిల్లుకు మద్దతుగా 298 మంది సభ్యులు ఓటు వేయగా, 230 మంది ఎంపీలు వ్యతిరేకంగా ఓటు వేశారు. మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడానికి ఈ బిల్లుకు 352 ఓట్లు అవసరమయ్యాయి.

# ఆప్‌లో ఉండడం ఇష్టం లేకపోతే రాజీనామా చేయవలసి ఉండే..

- రాష్ట్రపతి ముర్మును కలిసిన పంజాబ్ సిఎం మాన్



**న్యూఢిల్లీ :** పంజాబ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుంచి బయటకు వెళ్లిన ఏడుగురు ఎంపిలు బిజెపిలోకి చేరడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ఏడుగురు ఎంపిల రాజ్యసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కోరారు. రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిసిన భగవంత్, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆ ఏడుగురి ఎంపిల విలీనం రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్య సూత్రాలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. 'వారికి ఆమ్ ఆద్మీ పార్టీ అంటే అంతగా ఇష్టం లేకపోతే, రాజీనామా చేయాల్సింది. అనంతరం, ఎన్నికల్లో పోటీ చేయాల్సింది. ఇలా నేరుగా విలీనమవడం చట్ట విరుద్ధం. పంజాబ్‌లో ప్రస్తుతం ప్రజాస్వామ్యాన్ని ఎలా అపహాస్యం చేస్తున్నారో నేను రాష్ట్రపతికి చెప్పాను. బిజెపికి కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు ఉండేవారు. కానీ, అకస్మాత్తుగా రాజ్యసభ ఎంపిలు వచ్చి చేరారు. వారి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి' పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. ఇదిలా ఉండగా, పంజాబ్ ప్రభుత్వం తనను తదుపరి లక్ష్యంగా చేసుకుందని బిజెపి ఎంపి రాఘవ్ చడ్డా ఆరోపించారు.

## జమ్ము కశ్మీర్‌లో 500 మందికి పైగా అరెస్ట్

# రూ. 14 కోట్ల విలువైన ఆస్తుల జప్తు




**జమ్ము :** 'నషా ముక్త్ జమ్ము అండ్ కశ్మీర్ అభియాన్' కింద 500 మందికి పైగా అరెస్టు చేయగా, రూ. 14.50 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేశారని అధికారులు మంగళవారం తెలిపారు. ముఖ్యంగా యువతలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని ఎదుర్కోవడమే లక్ష్యంగా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆలోచనతో ప్రారంభమైన ఈ ప్రచారం, ఏప్రిల్ 11న జమ్మూ నుండి ప్రారంభించబడింది. ఈ ప్రచారంలో భాగంగా 4.7 కిలోల హెరాయిన్, 27.13 కిలోల చరస్, 209 కిలోలకు పైగా గంజాయితో సహా పెద్దమొత్తంలో మాదకద్రవ్యాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. జమ్మూ కశ్మీర్ వ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యాపారులకు సంబంధించిన ఆస్తులను అధికారులు జప్తు చేశారని వారు తెలిపారు. కశ్మీర్ జోన్‌లో రూ. 12.66 లక్షల విలువైన ఆరు చరాస్తులను, రూ. 7.77 కోట్ల విలువైన 14 స్థిరాస్తులను జప్తు చేసినట్లు వారు తెలిపారు. జమ్మూ జోన్‌లో రూ. 1.36 కోట్ల విలువైన 22 చరాస్తులను, రూ. 5.54 కోట్ల విలువైన తొమ్మిది స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నారు. 537 మంది మాదకద్రవ్యాల వ్యాపారులను అరెస్టు చేయగా, 502 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజా భాగస్వామ్యం, అవగాహన, సామాజిక అనుసంధానంపై దృష్టి సారించే 100 రోజుల విస్తృత ప్రచారానికి నాంది పలుకుతూ, ఎంఎ స్టేడియం నుంచి సిన్హా నేతృత్వంలో జరిగిన పాదయాత్రతో ఈ ప్రచారం ప్రారంభమైంది. ఇప్పటివరకు, లెఫ్టినెంట్ గవర్నర్ స్వయంగా జమ్మూ ప్రాంతంలోని 10 జిల్లాల్లో, కశ్మీర్ లోయలోని రెండు జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహించగా, వాటిలో మూడు నుంచి నాలుగు లక్షల మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల సమయంలో జమ్మూ, శ్రీనగర్లలోనే అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారని వారు తెలిపారు. దోడాలో సిన్హా తీవ్ర హెచ్చరిక జారీ చేస్తూ, మాదకద్రవ్యాల స్మగ్లర్లను చట్టప్రకారం ఉగ్రవాదులతో సమానంగా పరిగణిస్తామని అన్నారు. కథువా పర్యటన సందర్భంగా, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని అగ్రశ్రేణి మాదకద్రవ్యాల వ్యాపారులను గుర్తించి, 30 రోజుల్లోగా వారి నెట్‌వర్క్‌ను ఛేదించాలని ఆయన పోలీసులను ఆదేశించారు. శ్రీనగర్‌లో 'శత్రు దేశం' మాదకద్రవ్యాలను అంటగట్టడం ద్వారా ఈ ప్రాంత యువతను లక్ష్యంగా చేసుకుంటోందని సిన్హా ఆరోపించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా అనేది నార్కోటెర్రరిజంతో ముడిపడి ఉన్న ఒక తీవ్రమైన ముప్పు అని అభివర్ణిస్తూ, ప్రభుత్వం, భద్రతా దళాలు అటువంటి ప్రయత్నాలను అడ్డుకుంటాయని ఆయన ఉద్ఘాటించారు.

# ప్రజల సంకల్పమే సర్వోన్నతం : మొయిత్రా



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో తృణమూల్ కాంగ్రెస్ పరాజయం పాలు కావడంతో ఆ పార్టీ ఎంపి మొహువా మొయిత్రా స్పందించారు. ప్రజల తీర్పును తమ పార్టీ గౌరవిస్తుందని, ప్రజల సంకల్పమే సర్వోన్నతమైనదని పేర్కొన్నారు. లౌకిక దేశం కోసం తమ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. 'ప్రజల సంకల్పమే సర్వోన్నతమైనది. బెంగాల్ ప్రజలు బిజెపిని కోరుకుంటే, వారికి బిజెపియే దక్కింది. మేము దానిని గౌరవిస్తాము' అని ఆమె ఎక్స్‌లో పోస్టు చేశారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 206 స్థానాలు గెలుచుకుని, మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మెజారిటీ సాధించడం ద్వారా బిజెపి సోమవారం చరిత్ర సృష్టించింది. దీంతో టిఎంసి 15 ఏళ్ల పాలనకు తెరపడింది. 'అసమానమైన నేలపైన, ఊహించలేని ప్రతికూల పరిస్థితులకు వ్యతిరేకంగా మేము మంచి పోరాటం చేశాము. అందుకు నా నాయకురాలి పట్ల, నా పార్టీ పట్ల నేను గర్వపడుతున్నాను' అని మొయిత్రా అన్నారు. క్రూరమైన మెజారిటేరియనిజం కాదు, రాజ్యాంగమే అంతిమ మాటే అయ్యే లౌకిక దేశం కోసం టిఎంసి నిలబడి పోరాడుతూనే ఉంటుందని ఆమె అన్నారు.



డిఎంకె అధినేత ఎం.కె. స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఐ తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి వీరపాండియన్, ఎమ్మెల్యే కె. మారిముత్తు







తాను ఓడిపోయిన కొలత్తూరు నియోజకవర్గంలో మంగళవారం పర్యటిస్తూ తనకు ఓట్లేసిన వారికి కృతజ్ఞతలు తెలుపుతున్న డిఎంకె అధినేత ఎం.కె స్టాలిన్. ఈ సందర్భంగా పలువురు ఆయనను చూసి కన్నీటి పర్యంతం అయ్యారు.

# బెంగాల్ పరిశీలకుడిగా అమిత్‌షా

**అసోంకు జెపి నడ్డా : బిజెపి అధిష్ఠానం నిర్ణయం**



**న్యూఢిల్లీ :** బంగాల్, అసోం, పుదుచ్చేరిలో విజయం సాధించటంతో శాసనసభాపక్ష నేతల ఎన్నికపై బిజెపి అధిష్ఠానం దృష్టిసారించింది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బెంగాల్‌లో ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించిన బిజెపి ఆ రాష్ట్రంలో కేంద్ర పరిశీలకులను నియమించింది. ఈ సందర్భంగా బంగాల్ పరిశీలకుడిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సహపరిశీలకుడిగా ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాంఝీని నియమించింది. బంగాల్ ముఖ్యమంత్రి అంశంపై పరిశీలకులు తొలుత ఎమ్మెల్యేలతో చర్చించనున్నారు. అనంతరం శాసనసభాపక్షనేతను ఎన్నుకోనున్నారు. అసోం పరిశీలకుడిగా కేంద్రమంత్రి జెపి నడ్డా, సహపరిశీలకుడిగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని నియమిస్తూ బిజెపి ప్రకటన విడుదలు చేసింది. అసోంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బిజెపి చరిత్ర సృష్టించింది. దీంతో మరోసారి హిమంతబిశ్వశర్మ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశం ఉంది. మరోవైపు, పుదుచ్చేరి పరిశీలకుడిగా కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయను నియమించింది.

# అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధ సన్నాహాలు?

హోర్ముజ్‌ను తెరిచేందుకు బలప్రయోగం:ఉద్రిక్తతలు

యుఎఇలో ఇరాన్ దాడి : గాయపడిన భారతీయులు

ప్రధాని మోదీ ఖండన

స్తంభించిన 22,500 మంది నావికులు, 1,550 నౌకలు

కాల్పుల విరమణ కొనసాగుతోంది : హెగ్సెత్

**వాషింగ్టన్ :** ఇరాన్ హెచ్చరికలకు వ్యతిరేకంగా నౌకా వాణిజ్యం నిమిత్తం హోర్ముజ్ జలసంధిని బలవంతంగా తెరిచేందుకు అమెరికా సైన్యం ప్రయత్నం చేస్తూ ఉండటంతో పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధ వాతావరణం, ఉద్రిక్తత కనిపిస్తోంది. మరోవైపు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫుజైరా పారిశ్రామికవాడలోని చమురు శుద్ధి కర్మాగారంపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ముగ్గురు భారతీయులు గాయపడ్డారు. 12 బాలిస్టిక్ క్షిపణులు, మూడు క్రూయిజ్ క్షిపణులు, నాలుగు డ్రోన్లతో దాడులు చేసింది. ఈ చర్యను భారత విదేశీమంత్రిత్వశాఖ అధికారులు తీవ్రంగా ఖండించగా, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా యు.ఎ.ఇ.పై దాడులను ఖండించారు. ప్రపంచ చమురు భద్రత కీలకమైనదని, అందువల్ల హోర్ముజ్ ద్వారా నౌకా వాణిజ్యం కొనసాగాలని కోరారు. పౌరులు,మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం యుద్ధనీతి కాదన్నారు. ఈ పరిణామాలపై ఇరాన్ స్పందిస్తూ, యుఎఇపై దాడి చేయడం తమ ముందస్తు వ్యూహం కాదని పేర్కొంది. ఇదిలా ఉండగా, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నాయని ఇజ్రాయెల్‌లో ఒక అధికార వర్గం సిఎన్ఎన్ వార్తాసంస్థకు సమాచారం తెలియజేసింది. పంతాలు,పట్టింపులతో హోర్ముజ్ జలసంధిలో తారాస్థాయికి చేరుతున్న తరుణంలో ఈ వార్త వెలువడింది.ఇరాన్‌పై ఒత్తిడి పెంచడం ద్వారా మరిన్ని రాయితీలు రాబట్టడమే ఈ స్వల్పకాలిక దాడుల సన్నాహం వెనుక ఉద్దేశమని ఈ వర్గం పేర్కొంది. ఇంధన మౌలిక సదుపాయాలు,ఉన్నతాధికార వర్గాలను ఈ దాడులు లక్ష్యంగా చేసుకుంటాయని తెలిపింది. గతనెలలో కాల్పుల విరమణకు ముందే ఈ ప్రణాళిక సిద్ధమైందని కూడా వర్గం పేర్కొంది. ఐతే యుద్ధం ప్రారంభించాలా? వద్దా? అనే విషయంపై డోనాల్డ్ ట్రంప్ తుది నిర్ణయం ప్రకటించాలి. ఇరాన్ తీరుతెన్నులను అంచనావేయడం ద్వారా ఆయన ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని టి.ఓ.ఐ వార్తాసంస్థ సిఎన్ఎన్‌ను ఉటంకిస్తూ తెలియజేసింది. కాగా అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ మాట్లాడుతూ, అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరేవరకూ కాల్పుల విరమణ అమలులో ఉంటుందని అన్నారు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన మొదలైన కాల్పుల విరమణ ఒప్పందం ఇంకా అమలులోనే ఉందని చెప్పారు.అమెరికా సర్వసైన్యాధిపతి జనరల్ డాన్‌కైన్ మాట్లాడుతూ, హోర్ముజ్ జలసంధిలో వివిధ దేశాలకు చెందిన 22,500 మంది నావికులు, 1,550 వాణిజ్య నౌకలు స్తంభించిపోయాయని వాటిని సురక్షితంగా జలసంధి దాటిస్తామని చెప్పారు. కాల్పుల విరమణ ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకూ ఇరాన్ పదిసార్లు దాడులు చేసిందన్నారు. తొమ్మిదిసార్లు వాణిజ్య నౌకలపై కాల్పులు జరిపిందని,రెండు కంటైనర్ షిప్పులపై కాల్పులు జరిపిందని చెప్పారు. ఇరాన్‌లో సీనియర్ నాయకులంతా అంతమైపోయిన తర్వాత ప్రస్తుతం ఉన్న నాయకత్వం చీలికలు,పీలికలుగా ఉందని, వారిమధ్య ఏకాభిప్రాయం లేదని, వారంతా ఐక్యంగా ఒక నిర్ణయానికి వచ్చేవరకూ తాను కాల్పుల విరమణ పొడిగింపును పాటిస్తానని, వీలైనంత వరకూ చర్చలకే మొగ్గు చూపిస్తున్నానని ట్రంప్ ఇప్పటివరకూ చెబుతూ వచ్చారు. శుద్ధి చేసిన యురేనియంను, దాని శిథిల పదార్థాలను తమ సైనికులు ఇరాన్ వెళ్ళి స్వాధీనం చేసుకుంటాయని ట్రంప్ అంటున్నారు. కానీ అణ్వాయుధం,అణుశుద్ధి హక్కుల గురించి ఈ దశలో మాట్లాడబోమని, ముందుగా హోర్ముజ్‌లో దిగ్బంధనాన్ని ఎత్తివేసి, జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించాలని, ఇరాన్‌పై మళ్ళీ దాడులు చేయకుండా శాశ్వత యుద్ధ నివారణ, భద్రతాహామీలు ఇవ్వాలని, విదేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, యుద్ధ వినాశనానికిగాను నష్టపరిహారం చెల్లించాలని ఇరాన్ తన శాంతి చర్చల ప్రతిపాదనల్లో కోరుతోంది.

గడచిన రెండు నెలలుగా అమెరికా తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నప్పటికీ ఇరాన్ పాలకులు తమ జాతీయ సార్వభౌమాధికారం, అంతర్గత వ్యవహారాల్లో విదేశీ పెత్తనాన్ని ప్రాణత్యాగాల ద్వారా ప్రతిఘటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. తీవ్ర నష్టాన్ని,విధ్వంసాన్ని చవిచూసినప్పటికీ వారు ఇప్పటికీ తమ వైఖరికా కట్టుబడి ఉన్నారు. హోర్ముజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకా వాణిజ్యానికి ఇబ్బంది లేకుండా, ప్రపంచ దేశాలకు చమురు సంక్షోభం తొలగించేందుకు తక్షణం జలసంధిని తెరవాలని, ఈ మేరకు యుద్ధం విరమించి తొలి దశ శాంతి చర్చల ఉమ్మడి యత్నాలను పూర్తిచేద్దామని ఇరాన్ ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు అమెరికాకు ప్రతిపాదించినప్పటికీ డోనాల్డ్ ట్రంప్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు.లొంగుబాటు ధోరణితో అమెరికాకు మేలు చేసే ఒక ఒప్పందం కావాలని ఆయన కోరుతున్నారు. అనేకవేలమైళ్ళ దూరం నుండి పశ్చిమాసియాకు వచ్చి హోర్ముజ్ జలసంధిపై పెత్తనం చేయడాన్ని ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది.

**యుద్ధం కోరుకోవడంలేదు**

**నిరపరాధ నౌకల్ని అడ్డుకుంటే సహించం**

యుద్ధంతో ఎలాంటి సంబంధం లేని, జలసంధి దాటకుండా అనేక రోజులుగా స్తంభించిపోయిన అంతర్జాతీయ నౌకలను సురక్షితంగా హోర్ముజ్ నుండి బయటకు తరలిస్తామని, ఈ విషయంలో తమ చర్యలను ఇరాన్ అడ్డుకోలేదని అమెరికా రక్షణమంత్రి హెగ్సెత్ హెచ్చరించారు. ఇరాన్‌తో అమెరికా యుద్ధాన్ని కోరుకోవడంలేదని, అదేసమయంలో నౌకలను అడ్డుకుంటే ఊరుకునేదిలేదని అన్నారు. అమెరికా సైన్యం సెంట్‌కామ్ తలపెట్టిన ''ఆపరేషన్ ఫ్రీడమ్'' (ఆపరేషన్ లిబర్టీ) కొనసాగుతుందని, ఇరాన్ దురాక్రమణ నుండి నిరపరాధ నౌకలను రక్షించడమే తమ లక్ష్యమని అన్నారు. తమ ప్రాజెక్టును అడ్డుకుంటే అపారమైన అమెరికా ఆయుధ బలాన్ని ఇరాన్ ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నిరపరాధులైన దేశాల నౌకలు హోర్ముజ్‌లో స్తంభించిపోయాయని, వాటిని ఇరాన్ అడ్డుకోవడాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని అన్నారు. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా చేపట్టిన ''ఎపిక్ ఫ్యూరీ'' సైనిక చర్యకు ''ఆపరేషన్ ఫ్రీడమ్'' చాలా భిన్నమైనదని, ఇది మానవతా దృక్పథంతో చేపట్టిన ప్రక్రియ అని చెప్పారు. గల్ఫ్ జలాలలో ఇరాన్‌కు చెందిన ఏడు చిన్న పడవలను దెబ్బతీసి పనికిరాకుండా చేసిందని అంతకుముందు ట్రంప్ చెప్పిన విషయాన్ని మీడియా ప్రస్తావిస్తూ, చిన్న పడవల వల్ల కూడా అమెరికాకు ముప్పు ఉందా? అని ప్రశ్నించగా, యుద్ధంలో అమెరికా అత్యంత కేంద్రీకృతమైన వ్యూహం అమలు చేస్తోందని హెగ్సెత్ చెప్పారు. హోర్ముజ్ నుండి అమెరికా తన దృష్టిని మరోవైపు మరల్చే అవకాశం లేదన్నారు.



## చైనా బాణసంచా కర్మాగారంలో పేలుడు

26 మంది మృతి : రోబోలతో సహాయ బృందాల మోహరింపు

మృతుల కుటుంబాలకు మేయర్ క్షమాపణ

**బీజింగ్ :** చైనా హునాన్ రాష్ట్రంలో ఉన్న లియుయాంగ్ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో అక్కడ పనిచేస్తున్న 26 మంది కార్మికులు మరణించారు. మరో 61 మంది గాయపడ్డారు. ఈ ప్రమాదం సమయంలో మంటల్లో చిక్కుకున్న ఏడుగురు కార్మికులను సహాయ బృందాలు రక్షించి సురక్షితంగా బయటకు తరలించాయి. నగరవ్యాప్తంగా ఉన్న బాణసంచా కర్మాగారాలలో ఉత్పత్తి నిలిపివేయాలని తక్షణ ఆదేశాలు జారీ అయ్యాయి.

అంతర్గత భద్రతా ప్రమాణాలను మెరుగుపరచేందుకు అన్ని రంగాలలోనూ పెద్ద ఎత్తున అంతర్గత భద్రతా తనిఖీలు చేస్తున్నారు. సవరణలు, దిద్దుబాటు చర్యలకు కూడా ఆదేశించారు. ఈ ఘటన పట్ల చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎవరూ గుర్తించని విధంగా ఇంకా ఎవరైనా కర్మాగారంలో చిక్కుకుపోయి ఉంటారని, అలాంటి కార్మికులకోసం ఉద్ధృత గాలింపు ద్వారా వారి జాడ తెలుసుకోవాలని కోరారు.

హాయ చర్యలకు రోబోలతో కూడిన బృందాలను మోహరించారు. గాయపడినవారిలో ఆరుగురు పరిస్థితి తీవ్రంగా ఉంది. వారికి ఒక్కొక్కరికీ ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నారు. ఈ ప్రమాద ఘటన పరిస్థితులను వివరించేందుకు చాంగ్షా మున్సిపాలిటీ అధికారులు మంగళవారం పత్రికాగోష్ఠి నిర్వహించారు. చాంగ్షా మున్సిపల్ పార్టీ కమిటీ డిప్యూటీ సెక్రటరీ, మేయర్ చన్ బోయాంగ్ మృతులకు నివాళులు అర్పించడం ద్వారా ఈ సమావేశం ప్రారంభించారు. మృతుల కుంటుంబాలకు క్షమాపణలు తెలియజేశారు.

ప్రమాద సంఘటన గురించి తెలిసిన వెంటనే హేనాన్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఐదు సహాయ బృందాలను 482 మంది సిబ్బందిని, ఇతర అనేక విభాగాల నుండి మరో 1500 మందిని సమీకరించి సంఘటనాస్థలానికి పంపించారు. ఘటనాస్థలంలో గాలింపు చర్యలు, సహాయ చర్యలు పూర్తయ్యాయని బోయాంగ్ చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే తమ వద్ద సిద్ధంగా ఉన్న అత్యవసర ప్రణాళికను అమలు చేసినట్లు చెప్పారు. ప్రమాద ప్రదేశం వద్ద ఇరవై సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కర్మాగార సమీపంలో ఒకటి నుండి మూడు కి.మీ దూరం వరకూ సహాయ, నియంత్రణ మండలం ఏర్పాటు చేశారు. కర్మాగారం చుట్టూ ఐసోలేషన్ బెల్టులు, ఫైర్ బ్రేక్‌లను ఏర్పాటు చేశారు.

## హోర్ముజ్ దిగ్బంధనం,క్యూబాపై ఆంక్షలు తక్షణం ఆపండి : అమెరికాకు చైనా డిమాండ్

**బీజింగ్ :** హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులలో నౌకాయానంపై దిగ్బంధనం, క్యూబాపై దారుణ ఆంక్షలను తక్షణం ఎత్తివేయాలని అమెరికాకు చైనా డిమాండ్ చేసింది. క్యూబాపై ఆంక్షలను విపరీతమైనస్థాయిలో విస్తరించడాన్ని చైనా విదేశీ వ్యవహారాలమంత్రి వాంగ్ యీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన తరపున విదేశీ వ్యవహారాల ప్రతినిధి మంగళవారం మీడియాకు ఈ విషయం చెప్పారు. క్యూబాపై అక్రమ, ఏకపక్ష ఆంక్షలను తీవ్రతరం చేయడం వల్ల క్యూబా ప్రజలు జీవనోపాధి కోల్పోతారని, వారు ఇప్పటికే ఘోరమైన కష్టాలను అనుభవిస్తున్నారని చెప్పారు. ఈ విధంగా ఆంక్షలు విధించడం అభివృద్ధి హక్కులను ఉల్లంఘించడమే కాకుండా, అంతర్జాతీయస్థాయిలో ప్రాథమిక నిబంధనలను అతిక్రమించడమే కాగలదని హెచ్చరించారు. క్యూబా తన జాతీయ సార్వభౌమాధికారాన్ని, భద్రతను కాపాడుకోవడానికి చైనా గట్టి మద్దతు ఇస్తుందని ఉద్ఘాటించారు. క్యూబా అంతర్గత వ్యవహారాల్లో ఎవరి జోక్యాన్నైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ప్రకటించారు. అమెరికా జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి క్యూబా నిరంతర ప్రమాదంగా, సమస్యగా మారిందని ట్రంప్ ఆరోపిస్తూ, మే ఒకటో తేదీన మరోసారి తీవ్ర ఆంక్షలు విధించారు. ఈ చట్టవిరుద్ధమైన చర్యలతో తమను ఎంతమాత్రం భయపెట్టలేరని క్యూబా విదేశీ వ్యవహారాలమంత్రి కూడా ఆరోజే ఒక ప్రతి హెచ్చరిక చేశారు. క్యూబాపై దిగ్బంధనాన్ని, భయపెట్టే బలవంతపు చర్యలను తక్షణం ఆపాలని చైనా విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి అమెరికాను కోరారు.

## ఆల్బర్టా వేర్పాటువాద సమస్యపై మూడు లక్షల సంతకాల సేకరణ

**ఒట్టావా :** కెనడానుండి విడిపోయి ఒక స్వతంత్ర యూనియన్‌గా ఆవిర్భవించాలని గడచిన శతాబ్దంలోనే ఊపిరిపోసుకున్న ఆ దేశంలోని ఆల్బర్టా వేర్పాటువాద ఉద్యమం దీర్ఘకాలంగా ఉండగా, దీని వ్యతిరేక ఉద్యమం ఇటీవల క్రియాశీల రూపం దాల్చింది. ఈ సమస్య పరిష్కారానికి 3,01,620 సంతకాలు సేకరించారు. దీనిపై చట్టపరమైన నిబంధనలకు లోబడి ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుంది. బహుశా ఈ ఏడాది అక్టోబరులోనే ప్రజాభిప్రాయ సేకరణ జరిగే అవకాశం ఉంది. కెనడాలో అల్బర్టా రాష్ట్రం దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురువుతోందని ఆ ప్రాంత ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకుని ఉంది. ఈ అసంతృప్తి వంద సంవత్సరాల ముందునుండీ ఉంది. కెనడా రాజధానిలో ఉండే పాలకులు ఆల్బర్టాను పట్టించుకోవడంలేదనేదే ప్రధానాంశం. పశ్చిమ కెనడాలోని ఇతర ప్రాంతాలను కూడా కలిసి ఒక స్వతంత్రదేశంగా అల్బర్టాను ఏర్పాటు చేయాలని కోరుతుండగా, మరికొన్ని సమూహాలు మాత్రం అభివృద్ధి సాధనకు వీలుగా అమెరికాలో ఒక రాష్ట్రంగా చేరిపోదామని వాదిస్తున్నారు. ఈ వాదనలమధ్య ఈ ప్రజాభిప్రాయ సేకరణకు తెరలేచింది. రాజధాని ఒట్టావా, పశ్చిమ ప్రావిన్సులతో పోల్చిచూస్తే, ఆల్బర్టాలో అస్సలు అభివృద్ధి జరగలేదు. సాంస్కృతికంగా కూడా ఆల్బర్టాకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. 2025లో ఫెడరల్ ఎన్నికల తర్వాత దేశంలో ఈ వేర్పాటువాదాన్ని వ్యతిరేకిస్తూ, ''ఆల్బర్టా ఫరెవర్ కెనడా'' అనే ఉద్యమం బాగా పుంజుకుంది.

## జాతీయ హోదా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గంలోని 11 ప్రాంతాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 33/11 కెవి సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం మొత్తం తీసుకోవాలని కోరారు. రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు.



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు.మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగు పడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డి.ఎస్.పి నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

**స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే..**

జిల్లా పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లు గంభీరావుపేట మండలకేంద్రానికి చేరుకోగా.. వారికనీ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్పగుచ్ఛం అందజేసి.. స్వాగతం పలికారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ పాల్గొన్నారు.

## టిఎంసి కార్యాలయాలు ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని హౌరా, బహరంపూర్‌లలోనూ ఉన్న టిఎంసి కార్యాలయాలను కాషాయ మూకలు ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విధ్వంసం, దాడుల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం అధికారి ఒకరు తెలిపారు. తదుపరి చర్యలు చేపట్టేందుకు స్థానిక పోలీసుల నుంచి నివేదికలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, తమ పార్టీ కార్యకర్తలు ఎవరూ ఈ విధ్వంసంలో పాల్గొనలేదన్న ఆరోపణను బిజెపి నాయకుడు రాహుల్ సిన్హా ఖండించారు. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ నాయకులపై తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్న టిఎంసిలోని అంతర్గత వర్గాల పనే ఇదై ఉండవచ్చని ఆయన వ్యాఖ్యానించారు. టోలీగంజ్‌లోని బిజోయ్‌గఢ్-నేతాజీనగర్ ప్రాంతంలో, టిఎంసి అభ్యర్థి, మాజీ మంత్రి అయిన ఆరూప్ బిస్వాస్ ఎన్నికల కార్యాలయాన్ని ఒక మూక ధ్వంసం చేయడం కనిపించింది. ఆ గుంపులోని కొందరు అక్కడి నుంచి వెళ్లిపోయే ముందు, ధ్వంసమైన హోర్డింగ్‌ను కాలితో తన్నడం కనిపించింది. రూబీ క్రాసింగ్ వద్ద, బిజెపి జెండాలు చేతబూనిన ఒక గుంపు టిఎంసి కౌన్సిలర్ సుశాంత ఘోష్ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించింది. ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ, టిఎంసి తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేస్తూ 'అధికారంలోకి వచ్చిన వెంటనే బిజెపి తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది. ముర్షిదాబాద్‌లోని మా పార్టీ కార్యాలయంపై వారి గూండాలు హింసాత్మక దాడికి పాల్పడ్డారు. విధ్వంసం, అరాచకం— ఇదే బిజెపి అసలైన రూపం. ఇది బిజెపి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం' అని ఆ పార్టీ వ్యాఖ్యానించింది. హౌరాలోని ఉదయ్‌నారాయణపూర్‌లో తమ అభ్యర్థిపై దాడి జరిగిందని ఆరోపించింది. తమ అభ్యర్థి సమీర్ పాంజాపై జరిగిన క్రూరమైన దాడి వారి హింసాత్మక మనస్తత్వానికి నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యం కాదు; ఇది కేవలం గూండాయిజం మాత్రమే అని పేర్కొంది. ఉత్తర కోల్‌కతాలోని మణికతలా టిఎంసి అభ్యర్థి శ్రేయా పాండే, రక్తంతో తడిసిపోయిన చొక్కాతో ఉన్న ఒక మధ్యవయస్కుడైన పార్టీ నాయకుడి వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత బిజెపి కార్యకర్తలు దాడి చేసి కొట్టిన తన ఎన్నికల ఏజెంట్ ఆయనేనని ఆమె ఆరోపించారు. సిలిగురిలోని తమ పార్టీ కార్యాలయానికి నిప్పు పెడుతున్నట్లుగా ఉన్న ఒక వీడియోను టిఎంసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆర్జీ కార్ ఆసుపత్రి అత్యాచారంహత్య బాధితురాలి తల్లి రత్న దేబ్‌నాథ్, టిఎంసికి చెందిన తీర్థంకర్ ఘోష్‌ను 28,836 ఓట్ల తేడాతో ఓడించిన పానిహటి అసెంబ్లీ నియోజకవర్గంలో, మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీకి చెందిన ఒక కార్యాలయం రాత్రికి రాత్రే చేతులు మారింది. కౌంటింగ్ కేంద్రాల నుండి బయటకు వస్తున్నప్పుడు టిఎంసి నోవాపారా అభ్యర్థి త్రినాంకుర్ భట్టాచార్య, బ్యారక్‌పూర్ అభ్యర్థి రాజీబ్ చక్రవర్తిపై దాడి జరిగిందని, దీంతో వారిని సిపిఎఫ్ సిబ్బంది బయటకు తీసుకువెళ్లాల్సి వచ్చిందని ఆరోపణలు ఉన్నాయి.

## నేను రాజీనామా చేయను

(మొదటి పేజీ తరువాయి)

కాదని, కాషాయ పార్టీ కోసం పనిచేసిన ఎన్నికల సంఘంతోనే జరిగిందన్నారు. 'నా రాజీనామా ప్రసక్తే లేదు, ఎందుకంటే మేము ప్రజా తీర్పు వల్ల ఓడిపోలేదు, ఒక కుట్ర వల్ల ఓడిపోయాము... నేను ఓడిపోలేదు, నేను లోక్ భవన్‌కు వెళ్లను' అని స్పష్టం చేశారు. తాను ఎందుకు రాజీనామా చేయాలి అని ప్రశ్నించారు. తాము ఓడిపోలేదని, ఓట్లు దోచుకోబడ్డాయని ఆరోపించారు. ఇక రాజీనామా అనే ప్రశ్నే ఎక్కడ వస్తుంది ని మమతా బెనర్జీ నిలదీశారు. ఓట్ల లెక్కింపులో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, దాదాపు 100 స్థానాలు దోచుకోబడ్డాయని, తన పార్టీ మనోధైర్యాన్ని దెబ్బతీయడానికే లెక్కింపు ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా నెమ్మదింపజేశారని ఆమె ఆరోపించారు. తన మొత్తం రాజకీయ జీవితంలో ఇటువంటి ఎన్నికలను ఎప్పుడూ చూడలేదన్నారు. 'చరిత్రలో ఒక చీకటి అధ్యాయం లిఖించబడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒక ప్రతినాయకుడిగా మారిపోయారు' అని బెనర్జీ వ్యాఖ్యానించారు. 294 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో బిజెపి 207 స్థానాలను కైవసం చేసుకుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలు, అధికారులు కుమ్మక్కై పనిచేశారని, దాడులు, బదిలీలు, పక్షపాతం ఎన్నికల పోటీ వాతావరణాన్ని దెబ్బతీశాయని ఆరోపిస్తూ, ఆమె సంస్థల నిష్పక్షపాత వైఖరిని ప్రశ్నించారు. అయితే, రాజ్యాంగపరమైన మార్గాలు ఇంకా అందుబాటులో ఉన్నాయని బెనర్జీ పరోక్షంగా సూచించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వారు చర్యలు తీసుకోవచ్చు అని ఆమె వివరాలు వెల్లడించకుండానే పేర్కొన్నారు. ఎన్నికల వైఫల్యం తర్వాత తన వ్యూహంలో మార్పు ఉంటుందని సంకేతాలు ఇస్తూ, ఇకపై జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమిని బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానని బెనర్జీ తెలిపారు. 'ఇండియా కూటమి నాయకులు నాకు సంఘీభావం తెలుపుతూ ఫోన్ చేశారు. సోనియాజీ, రాహుల్ గాంధీ నాతో మాట్లాడారు' అని బెనర్జీ అన్నారు. అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్ థాక్రే, అఖిలేష్ యాదవ్, హేమంత్ సోరెన్ వంటి నాయకుల నుంచి కూడా తనకు ఫోన్లు వచ్చాయని ఆమె తెలిపారు. బిజెపి వ్యతిరేక నాయకురాలిగా రాహుల్ గాంధీ విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తడం, పశ్చిమ బెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాల్లో ఇద్దరి మధ్య తరచూ ఘర్షణలు వంటి గతంలో టిఎంసి కాంగ్రెస్ పార్టీపై, దాని నాయకత్వంపై చేసిన తీవ్రమైన దాడుల నేపథ్యంలో, బెనర్జీ కాంగ్రెస్‌ను సంప్రదించడంలో ఉన్న వైరుధ్యాన్ని రాజకీయ పరిశీలకులు గుర్తించారు. అదే సమయంలో తాను ఆందోళన రాజకీయాల్లోకి తిరిగి వస్తానని ప్రకటిస్తూ, బెనర్జీ వ్యక్తిగతంగా ధిక్కార స్వరాన్ని వినిపించారు. 'నేను అధ్యక్ష పీఠంపై ఉన్నంత కాలం ఎన్నో విషయాలను సహించాను. ఇప్పుడు నేను స్వేచ్ఛా పక్షిని, ఒక సాధారణ వ్యక్తిని. నేను వీధి యోధురాలిని. నేను వీధుల్లోనే ఉండి అన్ని అఘాయిత్యాలపై పోరాడతాను' అని ఆమె అన్నారు. ఎన్నికల అనంతర హింసతో ప్రభావితమైన ప్రాంతాలను సందర్శించి, క్షేత్రస్థాయి పరిస్థితిని అంచనా వేయడానికి 10 మంది సభ్యులతో కూడిన వాస్తవ పరిశీలన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బెనర్జీ ప్రకటించారు. 2021లో ఎన్నికల అనంతర హింస జరుగుతుందన్న ఆరోపణలను ఆమె నిరాధారమైనవిగా కొట్టిపారేశారు.

## మరిన్ని పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా రఘురామ్ రాజన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రఘురామ్ రాజన్ తో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు , సిఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీల జయేష్ రంజన్, వాణీ ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వాల సులభతర వ్యాపార విధానంపై ఆధారపడి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని రఘురామ్ రాజన్ అన్నారు. అయితే స్టార్టప్‌లను ఎక్కువ ప్రోత్సహిస్తే మరింత ఉపయోగం ఉంటుందని ఆయన సూచించారు. దీంతో పాటు మిడిల్ లెవల్ ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, ఎటిసిలను అభివృద్ధి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఆయనకు వివరించారు. సరైన పద్ధతిలో ఎఐ ని వినియోగిస్తే అందరికి మేలు జరుగుతుందని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ వ్యాఖ్యానించారు. మూడు నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనకు వస్తానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతు రాష్ట్రంలో పరిశ్రమల కోసం కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కావాల్సిన భూమితో పాటు మౌలిక సదుపాయాలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, అవుటర్ రింగ్ రోడ్డుతో పాటు అనేక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డుల ఏర్పాటుతో పాటు రేడియల్ రోడ్లు, పరిశ్రమల కోసం ప్రత్యేక క్లస్టర్లు తీసుకురానున్నామని ఉప ముఖ్యమంత్రి వివరించారు. శాంతిభద్రతలను పటిష్టంగా నిర్వహిస్తున్నామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్‌లో ముందుకు వెళ్తున్నట్లు ఆయన వివరించారు. యువతలో నైపుణ్యాల పెంపు కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఐటిఐలను ఎటిసిలుగా మార్చి విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం రేవంత్ రెడ్డి 24 గంటలు కష్టపడుతున్నారన్నారు. తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి కోసం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన రఘురామరాజన్‌కు కోరారు. సులభతర వ్యాపారానికి అనుగుణంగా తెలంగాణలో పరిస్థితులు ఉన్నాయని ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఫార్మా, ఐటి, డేటా సెంటర్ల కోసం కావాల్సిన మంచి వాతావరణం, వసతులు కల్పిస్తున్నట్లు ఆయన రఘురామ్ రాజన్‌కు వివరించారు.

## మార్కెటింగ్ ఉచ్చులో రైతాంగం

(మొదటి పేజీ తరువాయి)

చెబుతున్న పాలకులు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై దృష్టి సారించక పోవడం ఈ దుస్థితికి కారణమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులు, భారత దేశంలో అనుసరిస్తున్న ఆధునీక పద్ధతులు కలగలిసి వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగింది. దశాబ్ద కాలం క్రితంతో పోల్చినప్పుడు ధాన్యం, మిర్చి, మొక్కజొన్నల సగటు ఉత్పత్తి గణనీయంగా పెరగగా రెండేళ్లుగా పత్తి ఉత్పత్తి తగ్గింది. ఈ ఏడాది ధాన్యం, మొక్కజొన్నలు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. దిగుబడి ఆశాజనకంగా ఉండగా మార్కెటింగ్ మాత్రం రైతులకు చుక్కలు చూపిస్తుంది. పండిన ధాన్యాన్ని రోడ్లపై పోసి రోజుల తరబడి కొనే నాధుడు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది యాసంగి ధాన్యంకు సంబంధించి తొలి నాళ్లలో క్వింటా రూ.1400 చొప్పున ప్రైవేటు వ్యాపారులకు రైతులు విక్రయించక తప్పలేదు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరిచి ఎప్పటికీ కొంటుందోనన్న ఆందోళనలో రైతులు ముందుగానే విక్రయించుకున్నారు. ఇప్పుడు కూడా ధర సంగతి దేవుడెరుగు ఎంతకో అంతకు అమ్ముదామన్న కొనే నాధుడు కనిపించడం లేదు. తొలుత సగం ధరకే కొనుగోలు చేసినా ప్రైవేటు వ్యాపారులు ఇప్పుడు ముఖం చాటేశారు. రైతులకు చెల్లించాల్సిన నగదు చెల్లించలేక కొందరు వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేస్తే కొనుగోలుదారులు లేరన్న కారణంతో మరి కొందరు రైతుల వద్దకు రావడం లేదు. ఇప్పుడు ఖచ్చితంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ఇక కొనుగోలు కేంద్రాలు సమస్యల వలయాలుగా మారాయి. వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు గోడౌన్ల సమస్య, తరలించేందుకు వాహనాల సమస్య, కాంటాలు వేసేందుకు గోనే సంచుల సమస్య ఇప్పుడు చాలా చోట్ల హమాలీల సమస్య కూడా వచ్చిపడింది. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా రైతే నష్టపోవాల్సి వస్తుంది. వ్యవసాయ మార్కెట్ గోడౌన్లన్నీ నిల్వలతో నిండుకున్నాయి. ప్రైవేటు గోడౌన్స్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. దీనితో కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి కాంటాల కోసం ఎదురు చూస్తున్నారు. అధికార యంత్రాంగం పూర్తిగా కొనుగోలు కేంద్రాలపై నిమగ్నం చేసినా స్థానిక పరిస్థితులు సానుకూలంగా లేవు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడం పైన పేర్కొన్న సమస్యలు తిష్ట వేయడంతో ఈ సమస్య తలెత్తింది. చివరకు రవాణాకు సంబంధించి స్థానికంగా ట్రాక్టర్లకు అవకాశం కల్పించారు.

100 కిలో మీటర్ల లోపు ట్రాక్టర్లతో మొక్కజొన్నలు, ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. మొత్తంగా రైతాంగం పరిస్థితి ఆడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పండించడం ఒక వంతు అయితే మార్కెటింగ్ అంతకు మించిన పనిగా మారింది. ఏ పంట సాగు చేయాలో ఏ పంటకు మార్కెటింగ్ సౌకర్యం ఉంటుందో తెలియని పరిస్థితి. ఇప్పటికే సహకరించని ప్రకృతి, కరువైన ప్రభుత్వ ప్రోత్సహం, పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు కానీ ధరల నేపథ్యంలో రైతాంగం అప్పుల ఊబిలోకి కూరుకుపోతుంది. ప్రతి యేటా ప్రకృతి వైపరీత్యాలకు ఎక్కడో ఒక చోట రైతు దెబ్బతింటూనే ఉన్నాడు. పాలకుల ఉదాసీనత నడుమ మరింత ఊబిలోకి కూరుకుపోతున్న ఈ వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి ఎప్పుడు గట్టెక్కుతుందో, రైతు అప్పుల ఊబిలో నుంచి ఎప్పుడు బయటపడతాడో తెలియని పరిస్థితి.

# ఢిల్లీపై చెన్నై సూపర్ కింగ్స్ విజయం

ప్లే ఆఫ్స్ రేసు ఉత్కంఠ రేపుతుండగా చెన్నై సూపర్ కింగ్స్ కీలక విజయంతో రేసులో కొచ్చింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన సీఎస్కే అలవోకగా ఢిల్లీ క్యాపిటల్స్‌ను మట్టికరిపించింది. 156 పరుగులు ఛేదనలో సంజూ శాంసన్(87 నాటౌట్) అర్ధ శతకంతో విరుచుకుపడగా.. కార్తిక్ శర్మ(41 నాటౌట్) మెరుపులతో జయభేరి మోగించింది. ఐదో విజయంతో నాకౌట్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది చెన్నై. దాంతో, సొంతగడ్డపై గెలిచి పది పాయింట్లు సాధించాలనుకున్న ఢిల్లీకి చుక్కెదురైంది. ఐపిఎల్ 19 లీగ్ దశలో ఆలస్యంగా పుంజుకున్న చెన్నై సూపర్ కింగ్స్ మరో విజయం నమోదు చేసింది.

మంగళవారం అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత బౌలర్ల కృషితో ఆతిథ్య జట్టును పరిమితం చేసిన సీఎస్కే.. ఛేదనలో త్వరగానే రెండు వికెట్లు పడినా ఒత్తిడికి లోనవ్వలేదు. శాంసన్(87 నాటౌట్) సూపర్ హాఫ్ సెంచరీకి, కార్తిక్ శర్మ(41 నాటౌట్) సహకారం తోడవ్వగా వికెట్ల తేడాతో సీఎస్కే గెలుపొందింది. ఛేదనలో ఫామ్‌లో ఉన్న రుతురాజ్ గైక్వాడ్(6)ను ఎంగిడి ఔట్ చేసి షాకిచ్చినా.. ఉర్విల్ పటేల్(17) రెండు సిక్సర్లతో ప్రమాదకరంగా కనిపించాడు. కానీ, అతడిని అక్షర్ వెనక్కి పంపగా సంజూ శాంసన్ (87), కార్తిక్ శర్మ(41 నాటౌట్)లు నింపాదిగా ఆడుతూ.. పదో ఓవర్ నుంచి గేర్ మార్చారు. కుల్దీప్ వేసిన 12వ ఓవర్లో



6, 6, 4 బాదిన సంజూ 32 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. అనంతరం స్టార్క్ ఉతికేస్తూ రెండు ఫోర్లు కొట్టడంతో చెన్నై స్కోర్ వంద దాటింది. హాఫ్ సెంచరీ తర్వాత మరింత రెచ్చిపోయిన సంజూ .. నటరాజన్ ఓవర్లో వరుసగా 6, 6, 4 తో విజయాన్ని మరింత తేలిక చేశాడు. 18వ ఓవర్లో కార్తిక్ వరసగా సిక్స్, ఫోర్ కొట్టడంతో చెన్నై 8 వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించింది.

**ఆదుకున్న రిజ్వీ, స్టబ్స్...** ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు మరోసారి తడబడ్డారు. ఆర్సీబీపై 75 పరుగులకే ఆలౌట్ నుంచి పాఠాలు నేర్వకపోవడం ఆ జట్టును ఆదిలోనే కష్టాల్లో పడేసింది. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 69 పరుగులకే ఐదు వికెట్లు పడిన వేళ ఇంప్యాక్ట్ సబ్ సమీర్ రిజ్వీ(40 నాటౌట్), స్టబ్స్(38) ఆదుకున్నారు. ఆఖర్లో అశుతోష్ శర్మ(14) రెండు సిక్సర్లతో స్కోర్ దాటించాడు. చివరి బంతికి రిజ్వీ సిక్సర్ బాదగా ఢిల్లీ ప్రత్యర్థికి 156 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ముఖేశ్‌కు రెండు స్వర్ణాలు

**న్యూఢిల్లీ:** నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సురేంద్ర సింగ్ స్మారక షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తెలుగు షూటర్, ఎపిఇకి చెందిన నేలవల్లి ముఖేశ్ రెండు స్వర్ణపతకాలతో మెరిశాడు. 25 మీటర్ల పిస్టల్ పురుషుల ఈవెంట్‌లో సీనియర్, జూనియర్ రెండు విభాగాల్లోనూ 600కు గాను 584 (21X) పాయింట్లు స్కోరు చేసిన




ముఖేశ్ అగ్రస్థానాలతో బంగారు పతకాలు అందుకున్నాడు. కాగా, మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో తెలంగాణ షూటర్ ఇషాసింగ్ 582 స్కోరుతో అగ్రస్థానం సాధించినా ఫైనల్‌కు హాజరు కాలేదు.

## వైష్ణవి వ్యాస్‌కు పసిడి




**హైదరాబాద్ :** ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ జాతీయ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్, గాడియం పాఠశాల విద్యార్థి వైష్ణవి వ్యాస్ సత్తా చాటింది. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో అద్భుత ప్రదర్శన చేసిన వైష్ణవి వ్యాస్ వాల్ట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. బ్యాలెన్సింగ్ బీమ్ విభాగంలో 5వ స్థానం, ఆల్రౌండ్ విభాగంలో 7వ స్థానంతో ఆకట్టుకుంది.

---

మహిళ

# రాజకీయ పోరాటం.. మేధోపరమైన ఉద్యమం..

మహిళా విముక్తి ఉద్యమం అనేది స్త్రీలకు సమాన హక్కులు సాధించడానికి జరిగిన రాజకీయ పోరాటం. అంతేగాక, సమాజం నిర్మించిన విలువలు, నైతిక ప్రమాణాలు, సహజంగా భావించే సామాజిక నియమాలు, అధికార సంబంధాలు అన్నింటినీ ప్రశ్నించే విస్తృత మేధోపరమైన ఉద్య మం కూడా. ఈ ఉద్యమం మనం సహజంగా అంగీకరించిన అనేక ఆలోచనల వెనుక ఉన్న శక్తి నిర్మాణాలను వెలికితీసే ప్రయత్నం చేస్తుంది. కుటుంబం, చట్టం, విద్య, మతం, రాజకీయాలు, మీడియా వంటి సంస్థలు స్త్రీల జీవితాన్ని ఎలా నిర్మిస్తాయో విశ్లేషించడం స్త్రీవాద ఆలోచన ప్రధాన లక్షణం. ప్రపంచవ్యాప్తంగా ఈ ఉద్యమం వివిధ దశల్లో అభివృద్ధి చెందుతూ కొత్త ప్రశ్నలను లేవనెత్తింది. ప్రతి దశలో స్త్రీ వాదం తనను తాను కూడా విమర్శించుకుంటూ కొత్త దిశలను అన్వేషించింది. మహిళల సమస్యలను కేవలం వ్యక్తిగత అనుభవాలుగా కాకుండా సామాజిక నిర్మాణాల ఫలితంగా చూడడం ఈ ఉద్యమం తీసుకొచ్చిన ముఖ్యమైన మార్పు. సమాజంలో ఉన్న అసమానతలు యాదృచ్ఛికం కాదని, అవి చరిత్ర, సంస్కృతి, రాజకీయాల ద్వారా రూపుదిద్దుకున్నవని స్త్రీ వాదం చూపించింది. అందువల్ల స్త్రీ విముక్తి అంటే చట్టపరమైన రక్షణ



లు కాదని, ఆలోచనా విధానాల మార్పు కూడా అవసరమని స్పష్టమవుతున్నది. స్త్రీ వాదం పుస్తకాలలో మొదలుకాలేదు.. అది జీవిత అనుభవాల్లో పుట్టింది. చిన్ననాటి నుంచే అమ్మాయిలకు విధించే నియమాలు, అవకాశాల పరిమితులు, కుటుంబంలో పాత్రల విభజన వంటి అంశాలు స్త్రీగా ఉండటం అంటే ఏమిటి? అనే ప్రశ్నను కలిగించాయి. విద్యలో, ఉద్యోగాల్లో, వివాహ వ్యవస్థలో, ప్రజా జీవితంలో ఎదురైన అసమానతలు వ్యక్తిగత బాధలుగా కనిపించినప్పటికీ, తరువాత అవి సామాజిక నిర్మాణాలకు సంబంధించిన సమస్యలని గుర్తించారు. విద్యార్థి ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, మహిళా సంఘాల కార్యకలాపాలు ఈ అనుభవాలను సిద్ధాంతాలుగా మార్చాయి. వ్యక్తిగత అనుభవం రాజకీయ అంశమని చెప్పే భావన ఇక్కడి నుంచే వచ్చింది. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి వ్యక్తిగత వైఫల్యాలుగా చూడడం సరి కాదు. ఎందుకంటే, వారి సమస్యలు సమాజ నిర్మాణాల్లోని అసమానతల ప్రతిఫలం. స్త్రీవాదం ఈ దృష్టికోణాన్ని బలంగా ప్రచారం చేసింది. ఈ మార్పు సమాజాన్ని అర్థం చేసుకునే కొత్త విశ్లేషణా పద్ధతిని అందించింది. సాధారణంగా చట్టం న్యాయం అందించే తటస్థ వ్యవస్థగా ఉండాలి. కానీ స్త్రీవాద విశ్లేషణ ప్రకారం చట్టం పూర్తిగా తటస్థం కాదు. అది సమాజంలోని అధికార సంబంధాల ప్రభావంతో రూపుదాలుస్తుంది. స్త్రీల హక్కుల కోసం చట్టపరమైన పోరాటం అవసరమే అయినప్పటికీ, అదేచట్టం మహిళల స్వేచ్ఛను పరిమితం చేసే విధంగా పనిచేస్తుంది. చట్టాలు స్త్రీల ను బాధితులుగా మాత్రమే నిర్వచించడం, నైతిక నియంత్రణ పేరుతో వ్యక్తిగత ఎంపికలపై జోక్యం చేసుకోవడం, గుర్తింపులను స్థిరంగా నిర్వచించడం వంటి అంశాలు ఈ విరుద్ధతను చూపిస్తాయి. చట్టం ఒకవైపు రక్షణను అందిస్తూనే మరోవైపు నియంత్రణను అమలు చేస్తుంది.

స్త్రీవాద ఉద్యమం ఎక్కువగా హక్కులు అనే భాషను ఉపయోగించింది. కానీ హక్కులు సహజంగా లభించేవి కావు. అవి రాజకీయ పోరాటాల ద్వారా ఏర్పడతాయి. చట్టం వాటిని నిర్వచించినప్పుడు, సంక్లిష్ట సామాజిక వాస్తవాలను సరళీకృతం చేస్తుంది. బహుళ గుర్తింపులు ఒకే నిర్వచనంలో బంధించినట్టు కనిపిస్తుంది. దీనివల్ల, హక్కుల భాష విముక్తికి సరిపోతుందా? లేక అది ఒక దశ తర్వాత పరిమితిగా మారుతుందా? అనే ఒక కీలక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. స్త్రీ వాదం ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వదు. కానీ చట్టపరమైన మార్పులు మాత్రమే సమాజాన్ని పూర్తిగా మార్చలేవని స్పష్టం చేస్తుంది. అదే సమయంలో, చట్టం గుర్తింపులను స్థిరంగా నిర్వచించడానికి ప్రయత్నిస్తుంది. స్త్రీ, పురుషుడు వంటి వర్గాలు స్పష్టమైన పరిమాణాల్లో నిర్వచించినప్పటికీ, స్త్రీవాదం, క్వీర్ ఆలోచనలు మాత్రం ఈ గుర్తింపులు స్థిరమైనవి కావని తేల్చిచెప్తాయి. అవి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక ప్రక్రియల ద్వారా మారుతూ ఉంటాయి. ఈ దృష్టిలో చట్టం స్థిరత్వాన్ని కోరుతుండగా స్త్రీ వాదం మార్పును, అస్థిరత్వాన్ని గుర్తిస్తుంది. ఈ విరోధం స్త్రీవాద చర్చల్లో కేంద్రస్థానంగా ఉంటుంది. గుర్తింపులను స్థిరంగా నిర్వచించడం కొన్నిసార్లు రక్షణనిస్తే, అదే సమయంలో కొత్త అనుభవాలను బయటకు నెట్టే ప్రమాదం కూడా ఉంటుంది. ఇక్కడ, స్త్రీ వాదం చట్టాన్ని పూర్తిగా తిరస్కరించదు. చట్టం లేకుండా హక్కుల రక్షణ సాధ్యం కాదు. కానీ




చట్టాన్ని విముక్తి యొక్క ప్రధాన సాధనంగా మాత్రమే చూడటం కూడా సరైనది కాదు. చట్టం పరిమిత మార్పులను మాత్రమే సాధించగలదు. సామాజిక అవగాహన మార్పు మాత్రం విస్తృత సాంస్కృతికప్రక్రియ. అందువల్ల స్త్రీవాదం ద్వంద్వ వ్యూహాన్ని అనుసరిస్తుంది. అవసరమైనప్పుడు చట్టాన్ని ఉపయోగించడం, అదే సమయంలో దాని పరిమితులను విమర్శించడం. ఈ విమర్శాత్మక దృష్టి ఉద్యమాన్ని నిరంతరం చైతన్యంగా ఉంచుతుంది. ఆధునిక స్త్రీ వాదం కేవలం చట్టపరమైన ఉద్యమంగా మాత్రమే ఉండటం లేదు. అది భాష, సంస్కృతి, మీడియా, రోజు వారీ జీవన విధానాల్లో ఉన్న అర్థాలను మార్చే ప్రయత్నంగా మారింది. సమాజం సాధారణంగా భావించే విషయాలను ప్రశ్నించడం రాజకీయ చర్యగా మారింది. కుటుంబ నిర్మాణం, లైంగిక నైతికత, స్త్రీ పాత్రలపై ఉన్న అంచనాలు వంటివన్నీ సామాజిక నిర్మాణాలేనని చూపించడం ద్వారా స్త్రీ వాదం కొత్త రాజకీయ దిశను సూచించింది. మార్పు చట్టాల్లో మాత్రమే కాకుండా ఆలోచనా విధానాల్లో కూడా జరగాలి అనే అవగాహన పెరిగింది. స్త్రీ వాదం తక్షణ సమస్యలకు స్పందిస్తుంది. హింస, వివక్ష, అసమాన వేతనం వంటి సమస్యలకు ప్రతిఘటిస్తుంది. అదే సమయంలో, దీర్ఘకాలలక్ష్యాలను మరింత విస్తృతంగా పరిగణిస్తుంది. సమాజం ఆలోచించే విధానాన్ని మార్చడం ఈ కార్యాచరణలో ఒకటి.

---

# కార్మికవర్గ పితామహుడు కారల్ మార్క్స్

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రపంచ కార్మిక వర్గానికి పితామహుడు కారల్ మార్క్స్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిపిఐ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కారల్ మార్క్స్ 209వ జయంతి వేడుక జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్, యూసఫ్, వాసిరెడ్డి సీతారామయ్య, పంజాల శ్రీనివాస్, ఎస్.బాల్‌రాజ్‌లతో కలిసి కారల్‌మార్క్స్ చిత్రపటానికి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం, అంతరాలు లేని సమాజం కావాలని, కమ్యూనిజం, ప్రపంచ మానవాళిని ఉపయోగపడే విధంగా అనేక రచనలు చేసిన మహనీయుడు కారల్ మార్క్స్ అన్నారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు అందె స్వామి, పొనగంటి కేదారి, నరసింహ, వెంకటేష్, ప్రవీణ్, కరుణ, మణికంఠరెడ్డి, బోయిని అశోక్, మల్ల సమ్మయ్య, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, న్యాలపట్ల రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ లక్ష్మణాచారి భవన్‌లో కారల్ మార్క్స్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్ జి, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్యాద వెంకటయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి మారేడు శివశంకర్, దళిత కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి లక్ష్మీపతి, వంకేశ్వరం శ్రీను, కొత్త రామస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యూసుఫ్, ఈర్ల హుస్సేన్ పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** ప్రపంచ మానవాళికి దిక్సూచి కారల్ మార్క్స్ అని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యాలయంలో కారల్‌మార్క్స్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం, అంతరాలు లేని సమాజం కావాలని పోరాడిన యోధుడు కారల్‌మార్క్స్ అన్నారు. ఆయన ఆశయ సాధనకు కమ్యూనిస్టు కార్యకర్తలు ముందుకు సాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజం, కొట్టేపాక రవి, మునగాల బిక్షపతి, బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.






# మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్ డిమాండ్




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మొక్కజొన్న రైతుల సమస్యలను 24 గంటల్లో పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డును సిపిఐ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం సందర్శించి మార్కెట్లో ఉన్నటువంటి రైతుల యొక్క సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. దాదాపుగా నెలరోజుల నుండి రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముకోవడానికి నానాఅవస్థలు పడుతున్నారన్నారు. గన్ని బ్యాగులు అందుబాటులో లేవని దళారుల దగ్గర రైతులే ఒక బ్యాగుకు 25 నుంచి 30 రూపాయలు పెట్టి కొంటున్నారని తూకం వేసిన బ్యాగులు దాదాపు లక్షకు పైగా మార్కెట్లో ఉండి పోయాయని లారీలు లేక సంచులను కుప్పలుగా వేసి కవర్ల ద్వారా కప్పుకుని నెల రోజులుగా వాటిని ఎండకు వానకు, రాత్రనక పగలనక కాపాడుతూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యపై మార్కెఫెడ్ డీఎంలో మాట్లాడడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లాసమితి సభ్యులు మర్యాదవెంకటయ్య, బండి లక్ష్మీపతి, మారడు శివ శంకర్, వంకేశ్వరం శ్రీనివాసులు, యూసుఫ్, రమణ, కొత్త రామస్వామి, శేఖర్, సతీష్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# టియు భూముల పరిరక్షణకు ఉద్యమిద్దాం

తెలంగాణ యూనివర్సిటీ భూములను మరో యూనివర్సిటీకి చెందిన కాలేజీకి ఇవ్వటం సరైన నిర్ణయం కాదు

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** తెలంగాణ యూనివర్సిటీ భూములను మరో యూనివర్సిటీకి చెందిన కాలేజీకి ఇవ్వటం సరైన నిర్ణయం కాదని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాలకు పైగా భూమిని వ్యవసాయ కాలేజీకి బదిలీ చేయడాన్ని నిరసిస్తూ టియు భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐఎంఎల్ మాస్‌లైన్, పిడిఎస్‌యు, టియుసిఐ, పిఒడబ్ల్యు, పివైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ఆర్అండబి గెస్ట్‌హౌస్‌లో సిపిఐ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ సమావేశం మరో యూనివర్సిటీకి చెందిన కాలేజీకి ఇవ్వటం సరైన నిర్ణయం కాదన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తెలంగాణ యూనివర్సిటీ భూములను తిరిగి బదిలీ చేయించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విశ్వ విద్యాలయానికి సంబంధించి అన్ని రకాల సౌకర్యాలతో జక్రాన్‌పల్లిలో భూములున్నాయని ఆయన తెలిపారు. జక్రాన్‌పల్లిలో కాలేజీ ఏర్పాటు చేస్తే జిల్లా రైతాంగానికి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి తెలంగాణ యూనివర్సిటీ భూములను కాపాడాలని ఆయన కోరారు. ఎన్నో పోరాటాలతో తెలంగాణ యూనివర్సిటీ సాధించుకున్నామని, యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మరోసారి ఐక్య పోరాటాలకు సిద్ధమవుదామని సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు గణేష్, అనిల్‌కుమార్, విఘ్నేష్, శ్రీశైలం, గోపాల్, శ్రీధర్, సుజాత, శివరాజ్, నసీర్, నితిన్, సృజన్, మమత తదితరులు పాల్గొన్నారు.




# సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

పాలక వర్గాలను ఎన్నుకొనే రైతుల హక్కులను కాపాడాలి

నామినేటెడ్ విధానం అమలు అనాలోచిత నిర్ణయం

పాలక వర్గాలను పొడిగించటం రాజ్యాంగ విరుద్ధం

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/పాల్వంచ :** టిపిసిఎస్ ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించాలని, నామినేటెడ్ విధానం ద్వారా పాలక వర్గాలను నియమించాలనుకోవటం సరైనది కాదని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా అన్నారు. పాల్వంచ శ్రీలక్ష్మి బాంకెట్‌హాల్‌లో మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, దీనితోనే డిసిసిబీకి, రాష్ట్ర స్థాయిలో టిజిక్యాబ్‌కు ప్రజాస్వామ్య పద్ధతిలో పాలక వర్గాల ఎంపిక జరగాలని డిమాండ్ చేశారు.టిపిసిఎస్‌లో సభ్యత్వ రుసుము చెల్లించి సభ్యులుగా చేరిన రైతులకు తమ ప్రతినిధులను ఎన్నుకొనే ప్రాథమిక హక్కును ప్రభుత్వం తీసివేయటం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు సార్లు పాలక వర్గాల పదవీ కాలాన్ని పొడిగించిన ప్రభుత్వం మూడవసారి కూడా పొడిగించాలని చూడటం, నామినేటెడ్ పద్ధతిని తీసుకురావటం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయటమే అని విమర్శించారు. టిపిసిఎస్ కు తక్షణమే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.




సిపిఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని విడనాడి పారదర్శకంగా ఎన్నికలు జరిపించి రైతులకు మేలు చేయాలని సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, కె.సారయ్య, సలిగంటి శ్రీను, మున్నా లక్ష్మీకుమారి, అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కమటం వెంకటేశ్వర్లు, ఆర్‌టిసి భాస్కర్, భూక్యా దస్రు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వర్లు, ఎస్‌కే. ఫహీం, శంకర్, బంధం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యా కమిషన్ మీడియా కన్సల్టెంట్‌గా కొండల్ గౌడ్ నియామకం



ప్రజాపక్షం/ హైదరాబాద్ : తెలంగాణ విద్యా కమిషన్ మీడియా కన్సల్టెంట్‌గా సీనియర్ జర్నలిస్టు అముల కొండల్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి ఎ.శ్రీదేవ సేనా మంగళవారం జి.ఒ.71ను జారీ చేశారు. కొండల్‌గౌడ్ అనేక ఆయన 10 టివి న్యూస్ ఛానల్‌లో అనేక సంవతసరాల పాటు రాజధాని హైదరాబాద్ కేంద్రంగా అనేక ముఖ్యమైన రాజకీయ పార్టీలను కవర్ చేశారు. పలువురు జర్నలిస్టులు ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## మోదీ సభను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. సభ సన్నాహాల్లో భాగంగా తార్నాకలో జరిగిన 'వాల్ రైటింగ్' క్యాంపెయిన్‌లో పాల్గొన్న ఆయన, గోడపై కమలం గుర్తును చిత్రించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణకు వస్తున్నారని, ఈ చారిత్రాత్మక సభకు ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యంలో ఉన్నా, మోదీ నాయకత్వంలో భారత్ ప్రగతి పథంలో దూసుకుపోతోందని, అటువంటి నేతకు ఘనస్వాగతం పలకాలని అన్నారు. బెంగాల్‌లో ఓట్ల చోరీ జరిగిందన్న మమతా బెనర్జీ వ్యాఖ్యలు, దానికి రాహుల్ గాంధీ మద్దతు తెలపడం హాస్యాస్పదమన్నారు. ఓడిపోయినప్పుడు ఈవిఎంలు, ఎన్నికల కమిషన్‌ను నిందించడం కాంగ్రెస్, తృణమూల్ అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పు సర్వోత్తమమని, దానిని గౌరవించాలే తప్ప అవమానించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తికాచంద్రా రెడ్డి, మేకల సారంగపాణితో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూరియా అమ్మకాలపై నిషేధం రైతు వ్యతిరేక చర్య : హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై నిషేధం విధించడం దుర్మార్గమని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్ రావు అన్నారు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా యూరియా అమ్మకాలపై బ్యాన్ విధించారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ యూరియా అమ్మకాలను నిలిపివేస్తూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడం రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. స్టాక్ ఉన్నప్పటికీ డీలర్లు, అగ్రో సెంటర్లు, సహకార సంఘాల్లో రైతులకు యూరియా అందించకపోవడం వెనుక కారణాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. చెరకు, పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం, ఎరువుల సమస్యలను పెంచేలా యాప్‌ను అమలు చేయడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ఎరువుల ధరలు, యూరియా అమ్మకాలపై అనధికారిక నిషేధం రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయన్నారు. రైతు బంధు, బోనస్ చెల్లింపులు, పంట బీమా, రుణమాఫీ, యూరియా సరఫరా, పంట కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని, ఈ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. రైతుల ప్రశ్నలకు భయపడి అధికారులు రైతు వేదికల నుంచి వెళ్లిపోతున్న పరిస్థితి నెలకొన్నదన్నారు. నిరంతర యూరియా అమ్మకాలను పునరుద్ధరించాలని, అనధికారిక నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని హరీశ్ రావు డిమాండ్ చేశారు. చేశారు.


## అక్రమమైనింగ్‌కు మంత్రి బాధ్యత వహించాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మానస హిల్స్ ప్రాంతంలో వందల కోట్ల రూపాయాల విలువైన ఖనిజ సంపద దోపిడి జరిగిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ మానస హిల్స్ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఇప్పటికే అసెంబ్లీలో హరీశ్ రావు ప్రస్తావించారని, వందల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద దోపిడి జరిగిందని, దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్, భూ ఆక్రమణలపై తాము ముందుగానే ఆధారాలతో బయటపెట్టినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించలేదన్నారు. హైడ్రా చర్యలు ఆలస్యంగా వచ్చాయని, గత రెండు నెలలుగా ఎందుకు మౌనం వహించిందో సమాధానం చెప్పాలన్నారు. మొదట ఒక సంస్థపై చర్యలు తీసుకున్నట్లు ప్రకటించి, తరువాత మరో సంస్థ పేరుతో ప్రెస్ నోట్ మార్చడం వెనుక ఒత్తిడులు ఉన్నాయా ? అని సందేహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరణ ఇవ్వాలని శ్రవణ్ డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భాగ్యలక్ష్మి మైన్స్ అండ్ మినరల్స్ పేరిట పెద్ద స్థాయిలో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. వెంటనే ఆ సంస్థను సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్‌లో జరిగిన నగల దుకాణం దోపిడి ఘటనకు బాధ్యత వహిస్తూ సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు కె. కిషోర్ గౌడ్, అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు

- సంఖ్య పెంచుతూ కేంద్రమంత్రివర్గ తీర్మానం
- సిజెఐతో సహా 38కి పెరగనున్న జడ్జీల సంఖ్య
- వచ్చేపార్లమెంటు సమావేశంలో బిల్లు
- రూ.23,437 కోట్లతో మూడు రైల్వే ప్రాజెక్టులు




న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచుతూ కేంద్రమంత్రివర్గం ఒక తీర్మానం చేసింది. మరో నలుగురు న్యాయమూర్తులను కొత్తగా కేటాయించడంతో ఇకమీదట సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యాబలం 34 నుండి 38కి పెరుగుతుంది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెడతారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని మినహాయిస్తే, ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానంలో 33 మంది న్యాయమూర్తులు మాత్రమే ఉన్నారు. అందరినీ కలిపితే ఈ సంఖ్యాబలం 38కి పెరుగుతుంది. 1956లో మొదటిసారి సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) చట్టాన్ని మొదట అమలులోకి తెచ్చారు. ప్రధాన న్యాయమూర్తి కాకుండా ఆనాడు పది మంది న్యాయమూర్తులుండేవారు. ఆ తర్వాత 1960లో ఇదే చట్టానికి సవరణ చేసి ఈ సంఖ్యను 13కు పెంచారు. తర్వాత మరో సవరణతో ఈ సంఖ్య 17కు పెరిగింది. 1986లో ఇదే చట్టానికి మళ్ళీ సవరణ చేసి న్యాయమూర్తుల సంఖ్యను 17 నుండి 25కు పెంచారు. 2009లో చేసిన సవరణతో సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తుల సంఖ్య 25 నుండి 30కి పెరిగింది. 2019లో మరోసారిసవరణ చేయడం ద్వారా న్యాయమూర్తుల సంఖ్య 30 నుండి 33కు పెరిగింది. ఇప్పుడు మంత్రివర్గం మరోనలుగురు న్యాయమూర్తులను నియమించింది. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందితే న్యాయమూర్తుల సంఖ్య 33 నుండి 37కు చేరుతుంది. ప్రధాన న్యాయమూర్తిని కూడా కలిపితే మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 38గా ఉంటుంది. అదేవిధంగా రూ.23,437 కోట్లతో మూడు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. వీటిల్లో నాగ్దా—మథుర, గుంతకల్—వాడి మధ్య, బుర్వాల్—సీతాపూర్ మధ్య మూడు, నాలుగు రైల్వే లైన్ల నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి నిర్మాణం వల్ల రైల్వే మొబిలిటీ గణనీయంగా పెరుగుతుంది. ప్రధాన మంత్రి గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఈ ప్రాజెక్టులు నిర్మిస్తారు. వీటివల్ల మధ్యప్రదేశ్,రాజస్థాన్,ఉత్తర ప్రదేశ్,కర్ణాటక,ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని 19 జిల్లాల్లో రైల్వే నెట్‌వర్క్ కార్యకలాపాలు ఉద్ధృతంగా పెరుగుతాయి. దీనివల్ల 4,161 గ్రామాలలో కొత్తగా 83 లక్షలమంది ప్రజలకు రైల్వే సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి.అదేవిధంగా చెరకు కనీస ధరను క్వింటాలుకు రూ.10 నుండి రూ.365 వరకూ పెంచుతూ కేంద్రమంత్రివర్గం తీర్మానం చేసింది. చెరకు పెంపకందార్లకు మిల్లులు ఈ చెల్లింపులు చేయాలి. ఈ ఏడాది అక్టోబరులో ఈ చెరకు సీజన్ ప్రారంభమవుతుంది. ఆర్థిక వ్యవహారాలపై మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) ఈ మేరకు తీర్మానం చేసింది.

### పత్తి పంట దిగుబడి వృద్ధికి రూ.5,659 కోట్లు కేటాయింపు

దేశంలో పత్తిపంట దిగుబడులను పెంచేందుకు ఐదు సంవత్సరాలు అమలు చేసేందుకు ఉద్దేశించిన పథకం నిమిత్తం రూ.5,659.22 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గ సమావేశం తీర్మానం చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. 2026—27 ఆర్థిక సంవత్సరం నుండి 2030—31 ఆర్థిక సంవత్సరం వరకూ పత్తపంట దిగుబడులను అభివృద్ధికి వీలుగా పథకం అమలు చేసేందుకు ఈ నిధులు కేటాయించారు. దిగుబడులను అభివృద్ధి చేసేందుకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగించేందుకు ఈ నిధులు ఖర్చుచేస్తారు. మన దేశంలో 2025—26 ఆర్థిక సంవత్సరంలో జులై నుండి జూన్ వరకూ పంటకాలంలో170 కేజీల వంతున 291 లక్షలబేళ్ళ పత్తి ఉత్పత్తులు జరిగాయి. పంట పొలంలో పండించిన ఉత్పత్తి దగ్గర నుండి పీచుదశకు తీసుకువచ్చే వరకూ, కర్మాగార దశ నుండి డిజైన్లుగా మార్చి విదేశాలకు ఎగుమతి చేసే దశ వరకూ మొత్తం ఐదు దశల్లో పంట అభివృద్ధి, ఫలితాల సాధనపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిదని కేంద్రమంతి అశ్వనీవైష్ణవ్ మీడియాకు చెప్పారు. దీనివల్ల దేశంలో 32 లక్షలమంది రైతులు ప్రయోజనం పొందుతారు. వారంతా స్వయంసమృద్ధి సాధించడానికి వీలు కలుగుతుంది.

### రెండు సెమీకండక్టర్ యూనిట్లకు ఆమోదం

దేశంలో కొత్తగా మరో రెండు సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలియజేసింది. దీనికోసం మొత్తం రూ.3,936 కోట్ల మూల పెట్టుబడులు సమకూర్చడానికి కూడా ఆమోదం లభించింది. ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) కింద ఈ రెండు ప్రాజెక్టులకు ఆమోద ముద్ర పడింది. దేశంలో మొదటిసారి కమర్షియల్ మినీ—మైక్రో—లెడ్ డిస్‌ప్లే ఆధారిత గల్లియం నైట్రైడ్ టెక్నాలజీతో ఒక సెమీ కండక్టర్ పాకేజింగ్ సదుపాయం అమలులోకి వస్తుందని మంత్రి వైష్ణవ్ చెప్పారు. ఈ యూనిట్లను గుజరాత్‌లో ఏర్పాటు చేస్తారు. దీనివల్ల ఏకంగా 2,230 మంది వృత్తినిపుణులు అందుబాటులోకి వస్తారు. క్రిస్టల్ మాట్రిక్స్ లిమిటెడ్ గుజరాత్‌లోని ధోలేరాలో దీనిని ఏర్పాటు చేస్తుంది. సూచీ సెమీకాన్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఎస్‌పిఎల్) కూడా సూరత్‌లో ఓఎస్ఎటి(ఔట్‌సోర్స్‌డ్ సెమీకండక్టర్ అసెంబ్లీ అండ్ టెస్ట్) సదుపాయాన్ని ఏర్పాటు చేస్తుంది.

### రూ.1,570 కోట్లతో నౌకల మరమ్మతు కేంద్రం

గుజరాత్‌లోని వదినర్‌లో రూ.1,570 కోట్ల పెట్టుబడులతో నౌకల మరమ్మతులకు సంబంధించిన ఒక కేంద్రాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. దీన్‌దయాళ్ పోర్టు అథారిటీ, కొచ్చిన్ షిప్‌యార్డ్స్ లిమిటెడ్ రెండూ సంయుక్తంగా ఈ పెట్టుబడులు సమకూర్చి ఈ మరమ్మతుల కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాయి. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశంలో ఈ తీర్మానం చేశారు. దీనివల్ల 300 నౌకలను ఈ కేంద్రంలో అనుమతించడానికి వీలు కలుగుతుంది.

## అక్రమ క్రషింగ్ యూనిట్లపై హైడ్రా ఉక్కుపాదం

### ఒకేరోజు 6 ప్రాంతాల్లో దాడులు
### పలు యూనిట్లు నేలమట్టం





ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా నడుస్తున్న స్టోన్ క్రషింగ్ యూనిట్లు, రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసి) ప్లాంట్లపై హైడ్రా భారీ స్థాయిలో చర్యలు చేపట్టింది. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి), మైనింగ్, రెవెన్యూ శాఖల ఫిర్యాదుల మేరకు ఒకేరోజు 6 ప్రాంతాల్లో ఆపరేషన్లు నిర్వహించి అక్రమ యూనిట్లను కూల్చివేసింది. రంగారెడ్డి జిల్లాలోని గండిపేట మండలం వట్టినాగులపల్లి, శేరిలింగంపల్లి మండలంలోని గౌలిదొడ్డి, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ తదితర ప్రాంతాల్లో హైడ్రా బృందాలు బుల్‌డోజర్లతో దాడులు నిర్వహించాయి. ఈ ఆపరేషన్లలో 6 స్టోన్ క్రషింగ్ యూనిట్లను తొలగించడంతో పాటు 12 ఆర్ఎంసి ప్లాంట్లను నేలమట్టం చేశారు. భవిష్యత్తులో ఆ ప్రాంతాల్లో మళ్లీ క్రషింగ్ కార్యకలాపాలు సాగకుండా యంత్ర సామగ్రిని కూడా ధ్వంసం చేశారు. అనుమతులు లేకుండా కొండలను తవ్వి, రాళ్లను పేల్చి, భారీగా స్టోన్ క్రషింగ్ నిర్వహిస్తూ వాయు కాలుష్యానికి కారణమవుతున్నట్లు సంబంధిత శాఖలు ఫిర్యాదు చేశాయి. పిసిబి నోటీసులు, మైనింగ్ అభ్యంతరాలు, రెవెన్యూ ఆదేశాలను పట్టించుకోకుండా యూనిట్లు కొనసాగుతున్న నేపథ్యంలో హైడ్రా చర్యలకు దిగింది. కొత్వాల్‌గూడలో దాదాపు 16 ఎకరాల విస్తీర్ణంలో అక్రమంగా క్రషింగ్ కార్యకలాపాలు సాగినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో కొండలను పూర్తిగా ధ్వంసం చేసిన ఆనవాళ్లు కనిపించాయి. తిరుమల మెటల్ ఇండస్ట్రీకి చెందిన యూనిట్ సహా పలువురు నిర్వహిస్తున్న క్రషింగ్ యూనిట్లు తొలగించారు. అదే ప్రాంతంలో ఉన్న రెండు ఆర్ఎంసి ప్లాంట్లను కూడా కూల్చివేశారు.
బినామీ పేర్లతో, పెద్ద సంస్థల అండతో ఈ యూనిట్లు నడుస్తున్నట్లు అ ధికారులు తెలిపారు. లీజు వివరాలు లేకపోవ డం, అనుమతులు లేకపోవడం గమనార్హం. అ క్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల ఆదాయం నష్టం వాటిల్లుతోందని అంచనా. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. సంబంధిత శాఖల సమక్షంలో కూల్చివేతలు నిర్వహించారు. కాలుష్యానికి కారణమవుతున్న యూనిట్ల తొలగింపుతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ అక్రమంగా నడుస్తున్న క్రషింగ్ యూనిట్లు, ఆర్ఎంసి ప్లాంట్లపై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## ప్రముఖ నిర్మాత ఆర్‌బి చౌదరి కన్నుమూత



హైదరాబాద్ : తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నిర్మాత, సూపర్ గుడ్ ఫిల్మ్స్ అధినేత ఆర్‌బి చౌదరి (81) కన్నుమూశారు. రోడ్డు ప్రమాదంలో ఆయన దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని స్వస్థలానికి వెళ్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు ఉదయ్‌పుర్‌లో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో చౌదరి మృతి చెందారు. ఆయన మరణ వార్తతో సినీ లోకం దిగ్భ్రాంతికి గురైంది. ఆర్‌బి చౌదరి మృతి పట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు.కాగా, సూపర్ గుడ్ ఫిల్మ్స్ అనే బ్యానర్‌ను స్థాపించిన చౌదరి 90వ దశకంలో అనేక హిట్ సినిమాలు రూపొందించారు. ఈ బ్యానర్‌పై తెలుగుతో పాటు తమిళం, మళయాళం, కన్నడ సహా పలు భాషల్లో ఆయన సినిమాలు నిర్మించారు. ఆర్‌బి చౌదరి 90కి పైగా సినిమాలు నిర్మించిన ఆయన ఎందరినో దర్శకులుగా ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఈ బ్యానర్‌పై తెలుగులో అనేక క్లాసిక్ సినిమాలు రూపొందాయి. అందులో 'సుస్వాగతం', 'సూర్యవంశం', 'రాజా' 'నువ్వొస్తావని', 'నిన్నే ప్రేమిస్తా', 'స్నేహమంటే ఇదేరా', 'ప్రియమైన నీకు', 'సింహరాశి', 'శివరామరాజు', 'సంక్రాంతి', 'భీమిలి కబడ్డీజట్టు' లాంటి ఎవర్ గ్రీన్ సినిమాలను చౌదరి నిర్మించారు.

## రానున్న మూడు రోజులు వర్షాలు, తగ్గనున్న ఉష్ణోగ్రతలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండలు తీవ్రంగా కొనసాగుతున్నాయి. అయితే క్యూములోనింబస్ మేఘాల ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఒక్క డిగ్రీ వరకు తగ్గుదల నమోదైందని, రాబోయే రెండు నుంచి మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2—3 డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. అయితే ఈ నెల 8వ తేదీ నుంచి మళ్లీ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నాయని చెప్పారు. మంగళవారం, బుధవారం, గురువారం రాష్ట్రంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల ప్రకారం, ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో (గంటకు 30—40 కి.మీ వేగం) కూడిన వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, రంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాల్లో ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుందన్నారు. ఈనెల 10 తర్వాత రాష్ట్రంలో వాతావరణం పొడిగా మారే అవకాశం ఉందని చెప్పారు. ఇక గరిష్ఠ ఉష్ణోగ్రతల విషయానికి వస్తే, ఆదిలాబాద్, నిజామాబాద్, మంచిర్యాల వంటి ఉత్తర జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, హైదరాబాద్ సహా దక్షిణ జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 9వ తేదీ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు 41—44 డిగ్రీల వరకు పెరిగే సూచనలు ఉన్నాయి.

## ఆపరేషన్ ఆక్టోపస్ 2.0లో భారీ బస్ట్

### 9 రాష్ట్రాల్లో 56 మంది అరెస్ట్... రూ.69.99 లక్షలు బాధితులకు రీఫండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ మోసాలపై కఠిన చర్యల్లో భాగంగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గత నెలలో విస్తృత స్థాయిలో అంతర్రాష్ట్ర ఆపరేషన్లు చేపట్టింది. ఎన్‌సిఆర్‌పి ఫిర్యాదుల ఆధారంగా మొత్తం 77 ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, ఆపరేషన్ ఆక్టోపస్ 2.0 పేరుతో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి బ్యాంక్ సిబ్బంది సహా నెట్‌వర్క్‌కు చెందిన పలువురిని అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ డిసిపి అరవింద్ బాబు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో బ్యాంక్ మేనేజర్లు, కెవైసి, అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు సహా 32 మంది, అలాగే మ్యూల్ అకౌంట్ హోల్డర్లు 15 మంది, అకౌంట్ ఆపరేటర్లు 9 మంది పట్టుబడ్డారు. మొత్తం 101 కేసులతో వీరికి సంబంధం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఏప్రిల్ నెలలో దేశవ్యాప్తంగా మొత్తం 56 మందిని అరెస్ట్ చేశారు. ఇందులో ట్రేడింగ్ మోసాల కేసులో 30 మంది, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులో 17 మంది. డిజిటల్ అరెస్ట్, సోషల్ మీడియా, మ్యాట్రిమోనియల్, ఫెడెక్స్ కేసుల్లో రాష్ట్రాల వారీగా తెలంగాణ నుంచి 17 మంది, మహారాష్ట్ర నుంచి 14, ఢిల్లీ నుంచి 9, కర్ణాటక నుంచి 4, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ నుంచి ముగ్గురు చొప్పున, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇద్దరు, బీహార్, తమిళనాడు, గుజరాత్ నుంచి ఒక్కొక్కరు అరెస్టయ్యారు. నిందితుల వద్ద నుంచి 34 మొబైల్ ఫోన్లు, 8 చెక్ బుక్కులు, 11 షెల్ కంపెనీ స్టాంపులు, ఒక ట్యాబ్ స్వాధీనం చేసుకున్నారు.ఏప్రిల్ నెలలో 33 కేసుల్లో రూ.9.13 కోట్ల నష్టంలో నుంచి రూ.69.99 లక్షలు బాధితులకు తిరిగి ఇప్పించారు
ప్రజలకు హెచ్చరిక : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్, వాట్సాప్ డిపి మోసాలు, హనీ ట్రాప్, డిజిటల్ అరెస్ట్ పేరుతో వచ్చే బెదిరింపులపై జాగ్రత్తగా ఉండాలని డిసిపి అరవింద్‌బాబు సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

## మొక్కజొన్న పంటతో పాటు జొన్న పంట కొనుగోలు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న పంటతో పాటు జొన్న పంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంద ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయంతో రైతుల కు పెద్ద ఊరట కలగనుందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి సబ్ కమి టీ సభ్యులకు రాష్ట్ర రైతుల తరపున మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. మొక్కజొన్న, జొన్న పంటలను పరిధిలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరినప్పటికీ, ఇప్పటివరకు కేంద్రం నుంచి కనీస స్పందన లేదన్నారు. దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలలో మొక్కజొ న్న, జొన్న పంటలను రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయడంలేదని, అక్కడి రైతులు బహిరంగ మార్కెట్లో లభించిన ధరలకే తమ పంటను అమ్ముకుంటున్నారని మంత్రి తెలిపారు. అయితే తెలంగాణలో మాత్రం రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముం దుకు వచ్చి పంటలను కొనుగోలు చేస్తోందని తెలిపారు.

# రైతు సంక్షేమమే లక్ష్యంగా...

- అన్నదాతల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం
- రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం
- 'రాష్ట్ర స్థాయి రైతు మేళా'లో మంత్రి పొంగులేటి

ప్రజాపక్షం/హనుమకొండ



రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)లతో కలసి ప్రారంభించారు. ఈ మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సాంకేతిక స్టాళ్లను మంత్రులు సందర్శించి, రైతులతో మమేకమయ్యారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ రైతు సంక్షేమ పథకాలపై అధికారులు అందిస్తున్న వివరాలను ఆసక్తిగా పరిశీలించారు.ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2022 మే 6న ఇదే మైదానంలో రాహుల్ గాంధీ లక్షలాది మంది సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తరుపున రైతు డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. రైతులను నడిరోడ్డు మీద సంకెళ్లు వేసి చంటి పిల్లలతో నడిపించుకుని పోయిన ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం.. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తూ రైతుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నదని అన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరే అని ప్రకటిస్తే ప్రజా ప్రభుత్వంలో వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడంతో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే రైతు మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కావ్య, నగర మేయర్ సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అవినాష్ రెడ్డి, కుడా చైర్మన్, ఇనుగాల వెంకట్రామ రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, హార్టికల్చర్ సెక్రటరీ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖలో భారీ స్థాయి బదిలీలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగంలో పరిపాలనా కారణాల దృష్ట్యా పలువురు అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్లు, డెప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్ ఈ మేరకు జి.ఓ విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మొత్తం 27 మంది అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించారు. బి. హరి సింగ్ : అదనపు కలెక్టర్ (రెవెన్యూ), సూర్యాపేటగా నియమితులయ్యారు. టి.ఎల్. సంగీత : రంగారెడ్డి జిల్లా డిఆర్ఓ నుండి సంగారెడ్డి అదనపు కలెక్టర్ (రెవెన్యూ). ఆర్.డి. మాధురి : సంగారెడ్డి అదనపు కలెక్టర్ నుండి నల్లగొండ ఐ అండ్ సిఏడి ప్రత్యేక కలెక్టర్. డి. రాజ్యలక్ష్మి : హెచ్ఎండిఏ నుండి పెద్దపల్లి అదనపు కలెక్టర్ (రెవెన్యూ). చౌదరి మధు మోహన్ : కామారెడ్డి డిఆర్ఓ నుండి గద్వాల అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా. వి. హనుమా నాయక్ : వరంగల్ ఐ అండ్ సిఏడి ప్రత్యేక కలెక్టర్‌గా.పలు జిల్లాలకు కొత్త డిఆర్ఓలను, ఆర్‌డిఓలను కేటాయించారు.. సిరిసిల్ల : వి. రామ దేవి (డిఆర్ఓ), ఎన్. రాజేందర్ రెడ్డి (ఆర్‌డిఓ).నిజామాబాద్ : బి. గీత (డిఆర్ఓ).మెదక్ : జి. అంబాదాస్ రాజేశ్వర్ (డిఆర్ఓ). ఖమ్మం (భద్రాద్రి కొత్తగూడెం) : ఎస్. పద్మావతి (డిఆర్ఓ). ఇతర ప్రాంతాలు: వనపర్తి, జనగామ, భూపాలపల్లి, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నారాయణపేట జిల్లాలకు కూడా కొత్త అధికారులను నియమించారు. బదిలీపై ఉన్న డెప్యూటీ కలెక్టర్ ఆర్.వి. రాధా బాయి తదుపరి పోస్టింగ్ కోసం రెవెన్యూ శాఖలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బదిలీ అయిన అధికారులందరూ తక్షణమే విధుల్లో చేరాలని, వారి రిలీవింగ్, జాయినింగ్ వివరాలను ప్రభుత్వానికి తెలపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## స్వీయ గణన ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : డిప్యూటీ కమిషనర్

**ప్రజాపక్షం/దుండిగల్ :** స్వీయ గణన ప్రతి ఒక్కరూ పాల్గొనాలని దుండిగల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మనీ కరణ్ అన్నారు అనంతరం దుండిగల్ డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, స్థానిక ప్రజల భాగస్వామ్యం, స్వీయ గణన విధానాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా జన గణన డేటాను సులభంగా, ఖచ్చితంగా, సమయానికి సేకరించవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి పౌరుడు చురుకుగా పాల్గొనడం అత్యంత అవసరమని సూచించారు. అదేవిధంగా, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించబడిందని పేర్కొంటూ, ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు తమ కుటుంబ వివరాలను అధికారిక వెబ్ సైట్ ద్వారా స్వయంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. స్వీయ గణన ప్రక్రియ ద్వారా పౌరులు తమ ఇంటి, కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే అవకాశం లభిస్తుందని, తద్వారా గణన ప్రక్రియ వేగవంతం అవడంతో పాటు ఖచ్చితత్వం కూడా పెరుగుతుందని వివరించారు. ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొని, విజయవంతం చేయాలని డిప్యూటీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## జర్నలిస్టులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని టియుడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి బాలరాజ్, ప్రధాన కార్యదర్శి డి. వెంకట్రాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని యూనియన్ గుర్తింపు కార్డులను జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డుల మంజూరులో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లింగాల భూపాల్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని తెలిపారు.యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం అందిస్తూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విలేకరులు రామకృష్ణ, గోవిందరాజ్, నర్సింహ్మ, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పోతారం వాగును సందర్శించిన రెవెన్యూ అధికారులు



ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ చిన్న పర్వతాపూర్ రెవెన్యూ పరిదిలోని పోతారం వాగు కబ్జాకు గురవుతోందని ప్రజాపక్షం దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించడంతో ఎట్టకేల కు రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవా రం మూడుచింతలపల్లి తహసీల్దార్ మహ్మద్ గులాం ఇద్రిస్ ఆదేశాల మేరకు ఆర్ఐ సరస్వతి, సర్వేయర్ కవిత రెవెన్యూ సిబ్బందితో కలిసి పోతారం చెక్‌డ్యామ్ వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రజాపక్షం దినపత్రికలో ఇటీవల "రియల్ ఎస్టేట్ మాఫియాలో పోతారం వాగు కనుమరుగు" "రియల్టర్ల కబంధ హస్తాల్లో పోతారం వాగు" "కబ్జా కోరల్లో పోతారం వాగు" అనే కథనాలను వరుసగా ప్రచురించింది. బండరాళ్లు వేసి మట్టిపోసి రాత్రికి రాత్రే వాగును కబ్జా చేస్తున్నారని రైతులు ఆరోపించారు. దీంతో ప్రజాపక్షం దినపత్రికలో వరుస కథనాలు ప్రచురించబడ్డాయి. ఈ కథనాలకు స్పందించిన రెవెన్యూ అధికారులు రెవెన్యూ సిబ్బందితో వెళ్లి పోతారం వాగు పరిసరాలను మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి పోతారం వాగుకు హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. వాగు కబ్జా కాకుండా చర్యలు చేపడుతామని ఎవరైన అతిక్రమిస్తే చర్యలు తప్పవని అధికాహెచ్చరించారు.



## బాలికా సాధికారితే లక్ష్యంగా అవగాహన

### అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బాలికా సాధికారితే లక్ష్యంగా స్నేహ సమ్మర్ క్యాంప్ ద్వారా కౌమార బాలబాలికల సమస్యల పరిష్కారం, పోషణ అవసరాలు, పిల్లల సంరక్షణ, కౌమార బాల బాలికల సంఘాల ఏర్పాటు వంటి విషయాలపై అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్నేహ సమ్మర్ క్యాంప్‌లో బడి మానేసిన పిల్లలను బడికి తిరిగి పంపేలా కార్యక్రమాలు చేపట్టాలన్నా. బాల్యవివాహాల నిర్మూలన, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్య సామాజిక ప్రభావాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య మేళా ద్వారా బాలికల ఆరోగ్య సమస్యలు, రక్త హీనత, పిల్లల వ్యక్తిగత శుభ్రత, సామూహిక అవసరాలు ఆరోగ్యంపై వివరించాలన్నారు. బాలికల కు ఆర్థిక నిర్వహణ కల్పించేందుకు బ్యాంకు ఖాతాలు, పొదుపు అలవాట్లను తెలియచేయాలన్నారు. విద్య ప్రాముఖ్యత, మొబైల్ ఫోన్ల వినియోగం లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల అప్రమత్తత వంటి విషయాలు తెలియచేయాలన్నారు, ఈ కార్యక్రమంలోడిఆర్డీ సాంబశివరావు,జిల్లా మైనార్టి అధికారి కాంతమ్మ, డిఇఒ విజయకుమారి, డిఎంహెచ్ఒ ఉమాగౌరి, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి లు పాల్గొన్నారు.

## నీటి సమస్యలు తీర్చుతున్నాం

### మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేటః** అలియాబాద్ మున్సిపల్‌లోని ప్రజలకు నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్ లోని 20వ వార్డులో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహా యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డిలు బోరు ఫ్రషింగ్ చేయించి నూతన బోర్ మోటార్‌ను బిగించి ప్రారంభించారు. మండుతున్న వేసవిలో ప్రజలకు తాగునీరు అందించుటకు నూతనంగా బోర్లను వేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మౌనిక దినేష్, విజయ్‌కుమార్, విద్యాసాగర్, శ్రీనివాస్, రమేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఐడిపిఎల్ భూములు లీజుకు ఇవ్వొద్దు

### హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పారిశ్రామిక అవసరాల కోసం ఐడీపీఎల్ (ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్ లిమిటెడ్)కు కేటాయించిన భూములను లీజుకు ఇచ్చే అధికారం ఐడీపీఎల్‌కు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఔషధ పరిశ్రమ ప్రోత్సాహం కోసం కేటాయించిన భూమిలోని భవనాలను లీజుకు ఇవ్వాలన్న నిర్ణయం చెల్లదని పేర్కొంది. భూమిని స్వాధీనం చేసుకుంటూ కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను నిలిపివేస్తూ బీఐఎఫ్ఆర్ (బోర్డు ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఫైనాన్షియల్ రీకన్‌స్ట్రక్షన్) 2008లో ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు మంగళవారం మధ్యంతరంగా నిలిపివేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఔషధ పరిశ్రమ అభివృద్ధి కోసం 1994లో 891.38 ఎకరాల భూమిని బదలాయింపు ఒప్పందంతో కేటాయించామని తెలిపారు. ఆ ఒప్పందంలో భూమిని లీజుకు ఇవ్వడం, ఇతర ప్రయోజనాలకు వినియోగించడం నిషేధమని చెప్పారు. అయితే, ఈ నిబంధనలకు విరుద్ధంగా బాలానగర్‌లోని పరిపాలనా భవనాన్ని లీజుకు ఇవ్వడానికి ఐడీపీఎల్ ప్రైవేటు కంపెనీల నుంచి ప్రతిపాదనలు కోరుతూ ప్రకటనలు జారీ చేసిందన్నారు. దీనిపై కలెక్టర్ 2008 జనవరి 27న భూమిని స్వాధీనం చేసుకుని టీజీఐఐసీకి అప్పగించాలని డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్‌కు ఆదేశాలు ఇచ్చినట్టు వివరించారు. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ పి. నరసింహశర్మ వాదిస్తూ బీఐఎఫ్ఆర్ ఉత్తర్వులు ప్రభుత్వానికి తెలిసినవేనని తెలిపారు. బీఐఎఫ్ఆర్ రద్దయిన తర్వాత దాని స్థానంలో దివాలా చట్ట వ్యవస్థ వచ్చినందున ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాల్సి ఉంటుందని, ఈ పిటిషన్ విచారణార్హం కాదని వాదించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి భూబదలాయింపు ఒప్పందం ప్రకారం ఈ భూమిని కేవలం ఔషధ పరిశ్రమ కోసం మాత్రమే వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అనుమతించిందని స్పష్టం చేశారు. ఇందులో లీజుకు ఇవ్వాలన్న నిబంధన లేదన్నారు. ఐడీపీఎల్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్న వాదనను కోర్టు తిరస్కరించింది. అలాంటి వాదనను ఆమోదిస్తే ప్రభుత్వ భూములను సంస్థలు ఇష్టానుసారం అన్యాక్రాంతం చేసే పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో 2008 ఫిబ్రవరి 6న బీఐఎఫ్ఆర్ ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ కేంద్రం, ఐడీపీఎల్ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 22కు వాయిదా వేసింది.

## వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ స్థలం మార్పును అడ్డుకోవాలి

### కలెక్టర్‌కు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ ప్రాంతంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణ స్థలాన్ని ఆకస్మాత్తుగా మార్చడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మేడ్చల్ నియోజకవర్గ కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

**వివాదం ఏమిటి..?** గతంలో ప్రభుత్వం సర్వే నంబర్ 647/పి లోని ఎ.120 గుంటల భూమిని హాస్టల్ నిర్మాణం కోసం కేటాయించింది. స్థానిక తహసీల్దార్, ఇతర ప్రభుత్వ అధికారు లు స్వయంగా వచ్చి స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి కావాల్సిన గుర్తులు (ముగ్గు) కూడా వేశారు. అయితే, ఇప్పుడు ఆ స్థలాన్ని వదిలి పక్కనే ఉన్న సర్వే నంబర్ 646కు నిర్మాణాన్ని మార్చడం వెనుక అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందని సిపిఐ ఆరోపిస్తోంది. భద్రత దృష్ట్యా మార్పు వద్దు సర్వే నంబర్ 647/పి లో హాస్టల్ నిర్మిస్తే మహిళలకు రక్షణ ఉంటుందని, స్థానికులు కూడా ఇదే స్థలాన్ని కోరుకుంటున్నారని పార్టీ స్పష్టం చేసింది. రాజకీయ కుట్రలను అడ్డుకోవాలన్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు తమ స్వలాభం కోసం భూమిని బదిలీ చేయించేందుకు కుట్రలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకూడదని డిమాండ్ చేశారు.

**అభివృద్ధిపై దృష్టి పెట్టాలి:** జవహర్ నగర్ అభివృద్ధిలో భాగంగా మొదట కేటాయించిన స్థలంలోనే పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రజా అవసరాల దృష్ట్యా ఆ విలువైన భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమం లో తోటపల్లి శంకర్‌తో పాటు కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఎఐటి యుసి కాప్రా మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ వినతిపత్రం కాపీలను హైడ్రా కమిషనర్‌కు కీసర ఆర్డీవోకు కూడా పంపినట్లు నాయకులు తెలిపా రు.

## 'మహిళా శక్తి మై వాయిస్' కు కమిషనర్ స్పందన



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** మహిళా శక్తి మై వాయిస్ సంస్థ అధ్యక్షురాలు హైమారెడ్డి ఆధ్వర్యంలో గత నెల 17 న శామీర్‌పేట డివిజన్‌లోని పలు గ్రామాల్లో మీ సమస్య మా పరిష్కారం అనే కార్యక్రమాన్ని నిర్వహిం చి గుర్తించిన సమస్యలను మల్కాజ్‌గిరి కార్పోరేషన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌కు వినతి పత్రాలు సమర్పించారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్‌లోని సింగాయిపల్లి, హకింపేట, పోతాయిపల్లి, శామీర్‌పేటలో మల్కీజ్‌గిరి జోనల్ కమిషనర్ గంగ్వార్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా శక్తి మై వాయిస్ అధ్యక్షురాలు హైమారెడ్డి మాట్లాడుతూ మీ సమస్య మా పరిష్కారం అనే కార్యక్రమాన్ని మహిళా శక్తి మై వాయిస్ ఆధ్వర్యంలో శామీర్‌పేట డివిజన్‌లోని పలు గ్రామాల్లో చేపట్టామని చెప్పారు. ప్రజల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన కమిషనర్ శామీర్‌పేటలో సుడిగాలి పర్యటన చేశారని దీంతో పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు 11న జాబ్ మేళా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** వివిధ ప్రైవేట్ రంగాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే లక్ష్యంగా ఈ నెల 11న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ, ఇండస్ట్రీస్ అ ండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్‌లు సంయుక్తంగా నిర్వహించే ఈ జాబ్ మేళా లో పాల్గొనేందుకు ఆసక్తి గల అభ్యర్థులు https:satq. telangana.gov.in/prajapalana వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమో దు చేసుకొని హాజరు కావాలని తెలిపారు. మార్కెటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, ఐటి, బిజినెస్ సర్వీసెస్, కస్టమర్ సర్వీస్, హాస్పిటాలిటీ, డిజిటల్ మీడియా, లాజిస్టిక్ తదితర రంగాల్లో నిర్వహించే ఈ జాబ్‌మేళాను జిల్లాలోని యువత వినియోగించుకోవాలని, సందేహాలు ఏవైనా ఉంటే 7660919518 నంబరుకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చని తెలిపారు.

## సొంత భూములు వదిలిపెడుతాం..రోడ్డు వేయండి

### చిట్టిగిద్ద గ్రామ రైతులు



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాలకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో వ్యవసాయ పనులు చేయడం కష్టంగా మారింది. ముఖ్యంగా వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దాదాపు 100 నుండి 150 మంది రైతులకు వ్యవసాయ పొలాలకు మట్టిదారిలో నడవాల్సి వస్తోందని తెలిపారు. పంటలు కోయడానికి యంత్రాలు, ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల వ్యక్తిగత భూముల మధ్యగా వెళ్లాల్సి రావడంతో సొంతంగా భూములు వదులుకుంటున్నాం కొందరితో వివాదాలు కూడా తలెత్తుతున్నాయి.అలాంటి వారికి అవసరం వస్తే రైతులందరం కలిసి నష్టపరిహారం అందిస్తామని చెప్పినారు. రైతు గణపురంపురం పోచయ్య మాట్లాడుతూ, రైతులు పంటలు పండించి ఇంటికి తీసుకురావడానికే చాలా కష్టంగా వుంది. ఈ దారిగుండా దాదాపు 300 ల ఎకరాల సాగుభూమి పండిస్తున్నారు. రైతుల అవసరం నిమిత్తం బాపు నితిన్ రెడ్డి తన పట్ట భూమి వదిలితే బాగుంటుంది. భూమి కావాలని అనుకుంటే తన సొంత పొలం ఇస్తామని లేదా మూడు గుంటల భూమికి ఖరీదు కట్టి ఇస్తామని గణపురం పోచయ్య అన్నారు.అంతే కాకుండా మండల కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు మండలానికి రాకపోకలు నిర్వహిస్తారని అన్నారు. ఈ రోడ్డు రైతులకు చుట్టుపక్క గ్రామ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇక్కడి నుండి రోడ్డు ఏ ఒక్కరి స్వార్థం కోసం కాకుండా 150 మంది రైతులు చందాలుగా డబ్బులు సేకరించి మట్టి రోడ్డు పోసుకున్నామని ఇదంతా రైతులు తీసుకున్న నిర్ణయంఅన్నా రు. అందరు రైతులు సొంత భూములు రోడ్డుకోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారు. బాపు నితిన్ రెడ్డి ఒక్కరే రైతులకు రోడ్డుకోసం కొంత పొలం ఇవ్వడం లేదని అన్నారు. అంతే కాకుండా ఇందులో సంబంధం లేని గ్రామ సర్పంచ్ శ్రీధర్‌ను రాజకీయంగా బద్నామ్ చేస్తున్నారు. ఇది రైతులందరం కలిసి తీసుకున్న నిర్ణయం అని అన్నారు.



ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, గణపురం పోచయ్య, పర్మయ్య, ఎస్.జానకిరామ్, శాంతకూమర్, రత్నం, యాదయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నా రు.

## వరుస అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నా తొలగించని షెడ్లు





**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రధాన రహదారిలోని ఫర్నీచర్ దుకాణాల షెడ్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. వరుసగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నా అనుమతుల్లేకుండా షెడ్లు వెలుస్తూనే ఉన్నాయి. మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ సర్కిల్, ప్రగతినగర్ కమాన్ ప్రక్కన గల ఖాళీ స్థలాల్లో సుమారు ముప్పైకి పైగా అనుమతులు లేకుండా షెడ్లను వేసుకుని ఫర్నీచర్ దుకాణాలను నడుపుతున్నాయి. గండిమైసమ్మ నుండి బాచుపల్లి, మియాపూర్ వరకు గల ప్రధాన రహదారిలో ఖాళీ స్థలాల్లో అనుమతుల్లేకుండా భారీ షెడ్లను వేసుకుని యథేచ్ఛగా వ్యాపారాలను సాగించడం పరిపాటిగా మారింది. అయితే ఈ షెడ్లలో కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా దుకాణాలను కొనసాగిస్తుండడంతో వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మార్చి నాల్గవ తేదీన రాత్రి ఈ ఫర్నీచర్ దుకాణాల్లో భారీ ఎత్తున అగ్ని ప్రమాదం సంభవించి సుమారు ఇరవైకి పైగా షెడ్లు దగ్ధమయ్యాయి. అయినా కూడా అలాగే అనుమతుల్లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా షెడ్లలో ఫర్నీచర్ దుకాణాలను నడిపిస్తున్నారు. కాగా తాజాగా సోమవారం అర్థ రాత్రి మరోసారి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దాదాపుగా ఎనిమిది షెడ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో భారీస్థాయిలో ఆస్తి నష్టం వాటిల్లింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు, అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు కేవలం అద్దెలు చెల్లిస్తే చాలు ఎలాంటి అనుమతులు, స్థల నాలా కన్వర్షన్‌లు ఉండనవసరం లేదు. కైసర్ నగర్ చౌరస్తా నుండి బాచుపల్లి వరకు రోజురోజుకి అనుమతుల్లేని షెడ్లు పెరిగిపోతున్నాయి. ఇట్టి ఖాళీ స్థలాలకు కనీసం నాలా కన్వర్షన్ కూడా ఉండకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతుల్లేకుండా వెలుస్తున్న షెడ్లపై కఠిన చర్యలు తీసుకుని మరోసారి ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**నోటీసులను జారీ చేశాం, వెంటనే తొలగిస్తాం- ఏసిపి శ్రీజ**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రగతినగర్ కమాన్ ప్రక్కన గల ఫర్నీచర్ దుకాణాల షెడ్లను నోటీసులను జారీ చేశామని వెంటనే తొలగిస్తామని నిజాంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్రీజ తెలిపారు. ప్రగతినగర్ కమాన్ కెజిఆర్ కన్వెన్షన్ హాల్ ప్రక్కన గల ఫర్నీచర్ దుకాణాల్లో ఇప్పటికే ఓ సారి ప్రమాదం జరిగిందని, దుకాణ దారులను ఖాళీ చేయాలని చెప్పి వారి నుండి వ్రాత పూర్వక లేఖను తీసుకున్నామని, తొలగించే లోపే ప్రమాదం జరిగిందని అన్నారు. షెడ్లను తక్షణమే వెంటనే తొలగిస్తామని చెప్పారు.



## డంపింగ్ యార్డ్ సమస్యకు... శాశ్వత పరిష్కారం చూపండి

### సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రజాప్రతినిధులు, డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** డంపింగ్ యార్డ్ సమస్యతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, దుర్వాస ననుంచి శాశ్వత పరిష్కారం చూపి ఈ ప్రాంతవాసులకు న్యాయం చేయాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి కి ప్రజాప్రతినిధులు, డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిరి ఎంపీ ఈటెల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రష్ యాదవ్ సమక్షంలో సీఎం రేవంత్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మహానగర చెత్తను నలువైపుల తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని, డంపింగ్ యార్డ్ ను ప్రజలకు విముక్తి కలిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. జవహర్ నగర్, దమ్మాయిగూడలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని వినతిపత్రంలో మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ ఛైర్మన్ ప్రణీతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హరివర్ధన్ రెడ్డి, డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు శంకరనారాయణ, మారం సమ్మిరెడ్డి, సంజీవరెడ్డి, స్వర్ణశ్రీనివాస్, పద్మాచారి తదితరులు పాల్గొన్నారు.



## సిఎం హామీతో ముగిసిన డంపింగ్ యార్డు పోరు విరమణ

**ప్రజాపక్షం/జవహర్‌నగర్ః** గత పది రోజులుగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ డంపింగ్ యార్డు వ్యతిరేక జెఎసి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక రీలే నిరాహార దీక్షలు ఎట్టకేలకు విరమించబడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సమస్య పరిష్కారానికి సానుకూల హామీ ఇవ్వడంతో, జెఎసి ప్రతినిధులు తమ నిరసనను విరమించుకున్నా రు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ దీక్షా శిబిరాన్ని సందర్శించి, జెఎసి ప్రతినిధులకు నిమ్మరసం తాగించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జవహర్‌నగర్ ప్రజల ఆరోగ్యం పర్యావరణంపై ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం పట్ల జెఎసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోగుల సరిత, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్, ముప్పు రామారావు, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ, జెఎసి ప్రతినిధులు శంకర్ నారాయణ, పద్మచారి, ఏనుగు సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యానవన పంటల సాగుతో అధికలాభాల దిశగా రైతులను ప్రోత్సహించాలి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఉద్యానవన పంటల సాగుతో అధిక లాభాలు సాధించే దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో 99రోజుల పాటు నిర్వహించే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలను పురస్కరించుకొని అయిల్ ఫామ్ విస్తీర్ణం, పథకాలపై ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా బలపడే విధంగా ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా అశ్వారావుపేట్ ప్రాంత పర్యటనకు రైతులను తీసుకెళ్ళేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అయిల్ ఫామ్ సాగు తో పాటు పండ్లు, పూలు, కూరగాయల పంటల సాగుకు రైతులు అధికారుల సహకారం తీసుకోని అధిక ఆదాయాన్ని ఆర్జించే విధంగా పంటల సాగు చేయాలని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలనువారం రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని అదేవిధంగా జున్ నెలలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా పంటల సాగు చేయాల ని కలెక్టర్ తెలిపారు. రైతులకు నానో యురియా డిఏపి వాడకంపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పండ్లు ,కురాగాయల స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి , జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, ఉద్యానవన పటు పరిశ్రమల జిల్లా అధికారి సత్తార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపలశ్రీనివాస్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఎం4ఎంచిత్రం 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పివిఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళాల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.'

# రీల్

## దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన దాసరి

### 'డైరెక్టర్స్ డే' సెలబ్రేషన్స్‌లో మోహన్ బాబు



దర్శకరత్న దాసరి నారాయణరావు పుట్టిన రోజును డైరెక్టర్స్ డేగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఘనంగా నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో పలు భాషలకు చెందిన ప్రముఖ దర్శకులెందరినో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ బాబు మాట్లాడుతూ తండ్రి లాంటి దాసరి లేరనే లోటు నాకు ఈ జీవితాంతం ఉంటుంది. ఓ సాధారణ వ్యక్తిని తీసుకు వచ్చి మోహన్ బాబుగా మార్చారు. హిందీ చిత్ర దర్శకుడు బాల్కికి ఈ అవార్డుని ఇవ్వడం ఆనందంగా ఉంది. దర్శకుడు అనే పదానికి అర్థం చెప్పిన ఏకైక వ్యక్తి దాసరి. తెలుగు చలన చిత్ర పరిశ్రమలోని దర్శకులంతా కలిసి ఇలాంటి ఈవెంట్ నిర్వహిస్తుండటం ఆనందంగా ఉంది. ఈ స్టేజ్ మీదున్న వారంతా గొప్ప దర్శకులే. ఇంత ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఆదిత్య బృందంకు హ్యాట్సాఫ్. ఈ కార్యక్రమాలు అవార్డ్‌లను ఎంచుకున్న, ఇచ్చిన తీరు అద్భుతంగా ఉంది. మా యూనివర్సిటీలో అక్కయ్య పేరు మీద గోల్డ్ మెడల్స్ ఇస్తుంటాను. దాసరి పేరు మీద ఆడిటోరియంను కట్టాం. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్‌కి పదిహేను లక్షలు ఆర్థిక విరాళాన్ని అందిస్తాను. చిత్ర సీమ ఉన్నంత వరకు దాసరి పేరు చిరస్థాయిగా నిలబడుతుంది అని అన్నారు. జయప్రద మాట్లాడుతూ దాసరి పుట్టిన రోజుని ఇలా సెలెబ్రేట్ చేయడం, ఇలాంటి కార్యక్రమానికి మమ్మల్ని పిలవడం ఆనందంగా ఉంది. జయసుధ మాట్లాడుతూ గురువు దాసరి వల్లే నేను ఈ రోజు ఇలా నిలబడగలిగాను.అన్ని అవార్డ్‌ల కంటే ఈ అవార్డు చాలా గొప్పది. ముున్ముందు నిర్వహించే ఈ క్రియేటర్స్ ఫీస్ట్‌లో అందరూ పాల్గొనాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్కి, ఎస్వీ కృష్ణా రెడ్డి, వల్లభనేని అనిల్, వీర శంకర్, ఎన్ శంకర్, చదలవాడ శ్రీనివాసరావు, పీజీ విందా, బాబు మోహన్ ఆర్ నారాయణ మూర్తి, తమ్మారెడ్డి భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.


## చిన్న సినిమాలను చంపేస్తున్నారు

### చిన్న నిర్మాతల ఆవేదన



తెలుగు సినిమా పరిశ్రమలో మాఫియా చిన్న సినిమాలను చంపేస్తోందని నటుడు–నిర్మాత షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, తన సినిమా రీరిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఆరోపించారు.మంచి సినిమాలను కిల్ చేస్తున్నారు. చిన్న సినిమాలను నలుగురు రాక్షసులు చంపేస్తున్నారు. నైజాం ఏరియాలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వలేదు. ఇది వ్యవస్థత్మకంగా జరుగుతోంది అని షెరాజ్ మెహదీ అన్నారు. ఈ విషయంపై లీగల్‌గా పోరాటం ప్రారంభించామని, ఇండస్ట్రీ పెద్దలకు, రాష్ట్ర ముఖ్యమంత్రికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. చిన్న సినిమాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, ప్రపంచంలో ఎక్కడా లేని పరిస్థితి మన ఇండస్ట్రీలో ఉంది. బాలీవుడ్‌లో కూడా ఇలా ఉండదు అని వ్యాఖ్యానించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయని, వంటి చార్జీలు కూడా నిర్మాతలను కుంగదీస్తున్నాయని తెలిపారు. నటి మధు మాట్లాడుత నేను ఢిల్లీ నుంచి వచ్చాను. టాలీవుడ్‌లో అవకాశాలు వస్తున్నాయి. కానీ చిన్న సినిమాలకు మీడియా సపోర్ట్ చాలా అవసరం, చిన్న సినిమాలను బతికిస్తేనే మా లాంటి నటీనటులకు అవకాశాలు వస్తాయి అని అన్నారు.

## లక్షకు పైగా రీల్స్‌తో ట్రెండింగ్‌లో 'ఏందయ్య సామీ'




విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా ఈ చిత్రం నుంచి రిలీజ్ చేసిన 'ఏందయ్య సామీ..' పాట అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ సాంగ్ లక్షకు పైగా రీల్స్ తో సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. 'రణబాలి'లో విజయ్, రశ్మిక పెళ్లి వేడుక సందర్భంగా ఈ అందమైన పాట చిత్రీకరించారు. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. 'రణబాలి' సెప్టెంబర్ 11న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్‌కు రాబోతోంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది.విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న, ఆర్నాల్డ్ వోస్లూ, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సమర్పణ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిలింమ్, ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్, స్టోరీ, డైరెక్షన్ రాహుల్ సంకృత్యన్ కో–ప్రొడ్యూసర్స్ అనురాగ్ పర్వతనేని, శివ్ చనన, మ్యూజిక్ అజయ్ అతుల్, డీవోపీ నీరవ్ షా రైటర్ ప్రమోద్ తమ్మినేని, ప్రొడక్షన్ డిజైనర్ శివం రావు నాగసాని ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆర్ చంద్రశేఖర్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చెంబోలు సాయి ఆదిత్య, కొరియోగ్రఫీ కృతి మహేశ్, కాస్ట్యూమ్ డిజైనర్ అర్చన రావు, ఆర్ట్ డైరెక్టర్ విఠల్ కోసనం.

## 'ఎం4ఎం' ప్రీ రిలీజ్ వేడుక

అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఎం4ఎం (మోటివ్ ఫర్ మర్డర్ ) చిత్రం మే 8న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. పివిఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా విడుదలవుతున్న ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా ప్రీ రిలీజ్ వేడుక ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, సీనియర్ డైరెక్టర్ వి. సముద్ర హాజరైయ్యారు. దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా దర్శకుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో ఈ వేడుక జరగడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ మోహన్ వడ్లపట్ల తన టీమ్‌తో కలిసి గొప్ప టాలెంట్‌ను తెరపై ప్రదర్శించారని ప్రశంసించారు. జో శర్మకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు.దర్శకుడు మాట్లాడుతూ వి సముద్ర మాట్లాడుతూ మే 8న విడుదల కానున్న ఈ సినిమా పెద్ద హిట్ కావాలని ఆకాంక్షించారు. మోహన్ వడ్లపట్ల గొప్ప దర్శకుడిగా ఎదగాలని కోరుకున్నారు. హీరోయిన్ జో శర్మ మాట్లాడుతూ: ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు దర్శకుడు మోహన్ వడ్లపట్లకు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా నుంచి వచ్చి ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డానని చెప్పారు. ఇప్పటికే ఈ చిత్రానికి 25 దేశాల్లో 50కి పైగా అంతర్జాతీయ అవార్డులు వచ్చాయని వెల్లడించారు. ప్రేక్షకులు సినిమాను చూసి హిట్ చేయాలని కోరారు. దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ సినిమాలోని సీరియల్ కిల్లర్ ఎవరో చెప్పిన వారికి లక్ష రూపాయల క్యాష్ ప్రైజ్ ప్రకటించినట్లు తెలిపారు. ఎం4ఎం యూనివర్సల్ సబ్జెక్ట్ అని, క్లైమాక్స్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేస్తుందని చెప్పారు. ఈ సినిమా ద్వారా ఒక కొత్త సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతున్నామని పేర్కొన్నారు.



## 'టార్టాయిస్' షూటింగ్ పూర్తి



ఎస్ కె ఎగోల్డెన్ ఆర్ట్స్ ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్ వి ఎల్ క్రియేషన్స్ మరియు మధుపాల మహా మూవీస్ పతాకం పై రాజ్ తరుణ్, అమృత చౌదరి హీరో హీరోయిన్ గా శ్రీనివాస్ అవసరాల మరియు ధన్య బాలకృష్ణ ముఖ్య పాత్రలో రిత్విక్ కుమార్ దర్శకత్వంలో విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు మధుపాల సురేష్ గార్లు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'టార్టాయిస్'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీ గా ఉంది. ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా నిర్మాత 'మా 'టార్టాయిస్' చిత్రం చాలా కొత్తగా ఉంటుంది. చాలా డిఫరెంట్ కథ. రాజ్ తరుణ్ 25వ చిత్రం గా కెరీర్ లో బెస్ట్ సినిమా అవుతుంది. శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ మరియు హీరోయిన్ అమృత చౌదరి క్యారెక్టర్స్ చాలా బలంగా ఉంటాయి. కొత్త స్క్రీన్ ప్లే తో డిఫరెంట్ కథతో మంచి థ్రిల్లర్ చిత్రం ఇది అన్నారు. హీరోకి నిద్రలో నడిచే అలవాటు ఉంది, ఈ క్రమంలో తను ఒక అమ్మాయిని చంపేస్తాడు. తర్వాత ఏమి జరుగుతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ చిత్రానికి చిత్రీకరించాం. షూటింగ్ అంత పూర్తి అయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే విడుదల చేస్తాం అని తెలిపారు రాజ్ తరుణ్, అమృత చౌదరి, శ్రీనివాస్ అవసరాల, ధన్య బాలకృష్ణ, రవి కాలే, షిజు మరియు తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్ , సినిమాటోగ్రఫీ : శబరి ఎడిటర్ : గుళ్ళపల్లి మాధవ్ కుమార్, ఆర్ట్ : దేవర మధుకర్, కథ , దర్శకత్వం : రిత్విక్ కుమార్ నిర్మాతలు: విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు మధుపాల సురేష్.

## మావోయిస్టు కమాండర్ అరెస్ట్

**రాంచీ:** జార్ఖండ్‌లోని లాతేహార్ జిల్లాలో నిషేధిత టిఎస్‌పిసి (తృతీయ సమ్మేళన్ ప్రస్తుతి కమిటీ)కి చెందిన సబ్ జోనల్ కమాండర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గత 15 ఏళ్లుగా ఈ సంస్థలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న 42 ఏళ్ల నిందితుడిపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయని రాంచీ రూరల్ ఎస్‌పి గౌరవ్ గోస్వామి తెలిపారు. చంద్వా పోలీస్ స్టేషన్ పరిధిలోని నిందితుడి నివాసంలోనే అతను ఉన్నాడనే పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో అతని వద్ద నుంచి ఒక పిస్టల్, ఏడు తూటాలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.



## దిగుమతుల్లో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)


లేకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు, మిల్లులలో దిగుమతి, నిల్వ, ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించిన విషయాలను కలెక్టర్ చంద్రశేఖర్ స్టీఫెన్ రవీంద్రకు వివరించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాక డైరక్టర్ రోహిత్ సింగ్, ఎస్‌పి శరత్ చంద్ర పవార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటి కమిషనర్ వాణి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిఎం రాంపతి నాయక్, డిసిఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, స్థానిక తహసీల్దార్ విజయ్ తదితరులున్నారు.

## సిఎంగా రేపే ప్రమాణం?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నుకుంటూ ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోనప్పటికీ, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ తమిళనాడు గవర్నర్‌కు విజయ్ లేఖ రాసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. తమిళనాడు ఎన్నికల్లో టివికె అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో అసెంబ్లీలో తమ బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని గవర్నర్‌ను విజయ్ కోరినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు తమ విజయ ధ్రువీకరణ పత్రాలను పార్టీ అధినేతకు సమర్పిస్తారని, అలాగే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన వ్యూహాలపై చర్చిస్తారని టివికె నాయకుడు నంజిల్ సంపత్ తెలిపారు. 'సానుకూల ఫలితం వస్తుందన్న పూర్తి నమ్మకం నాకు ఉంది, త్వరలోనే ఒక శుభవార్తను ఆశించవచ్చు' అని అన్నారు. పెరంబూర్ నియోజకవర్గం వైపే విజయ్ మొగ్గు! ఇదిలా ఉండగా పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసి రెండు స్థానాల్లోనూ విజయ్ గెలవడంతో నిబంధనల ప్రకారం ఒక సీటును వదులుకోవాల్సి ఉంటుంది. అయితే పెరంబూర్ నియోజకవర్గాన్నే విజయ్ అట్టిపెట్టుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అటు విజయ్ ఇంటి వద్ద, టివికె కార్యాలయం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. విజయ్ కోసం పోలీసులు విఐపి కాన్వాయ్‌ను సిద్ధం చేశారు. పోలీసు భద్రత మధ్యే విజయ్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. విజయ్ అక్కడికి చేరుకోగానే ఆయనకు స్వాగతం పలకడానికి భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు గుమిగూడారు. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున్‌తో సహా పలువురు సీనియర్ టివికె నాయకులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు పార్టీ సిద్ధాంత కర్తలకు టివికె అధినేత విజయ్ నివాళులు అర్పించారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో పెరియార్ ఈ.వి. రామస్వామి, బి.ఆర్. అంబేద్కర్, కె. కామరాజ్, వేలు నాచియార్, అంజలై అమ్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## పంట మార్పిడిపై సిఎంకు రైతు కమిషన్ నివేదిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంట మార్పిడిపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ అంశంపై సమగ్ర చర్చ చేపట్టనున్నట్లు సిఎం వెల్లడించారు. రాష్ట్రంలో చేపట్టనున్న పంట మార్పిడికి సంబంధించి తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ ప్రత్యేక నివేదికను రూపొందించింది. మంగళవారం రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి నేతృత్వంలో కమిషన్ సభ్యులు ఈ నివేదికను సిఎం రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యవసరంగా పంట మార్పిడి చేపట్టాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఇందుకు సంబంధించి అసెంబ్లీలో ప్రత్యేక చర్చ చేపట్టనున్నామని తెలిపారు. ఇందుకు సంబంధించి మరింత అధ్యయనం చేసి నిర్మాణాత్మక సూచనలను అందజేయాలని సిఎం రేవంత్‌రెడ్డి రైతు కమిషన్‌కు సూచించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రైతు కమిషన్ సభ్యులు ఎస్.రాములు నాయక్, భూమి సునీల్, ఎం.భవానీ రెడ్డి, ఎవిఎస్ .రెడ్డి, ఆర్.గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగాల కోత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రధానికి, రైల్వే మంత్రికి వేల సంఖ్యలో పోస్టుల కార్డులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మానవ వనరుల హేతుబద్దీకరణ పేరుతో రైల్వే ఉద్యోగాల కోతను ఉపసంహరించుకోవడంతోపాటు రైల్వేలో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభమైంది ఇందులో భాగంగా హైదరాబాద్ లోని పలు కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న ఆర్‌ఆర్‌బి అభ్యర్థులు, నిరుద్యోగ యువత తమ నిరసనను వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు వేలాది సంఖ్యలో పోస్టు కార్డులను పంపించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ రైల్వే శాఖలో మొత్తం 14,80,455 పోస్టులు ఉంటే, ఇందులో సుమారు 10 లక్షల ఉద్యోగులు మాత్రమే పనిచేస్తుండగా 4 లక్షలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, దీనికి తోడు, రైల్వే బోర్డ్ తీసుకున్న ప్రస్తుత నిర్ణయంతో 2 శాతం ఉద్యోగాల కోత విధించడంతో 29,608 పోస్టులు తగ్గనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నిర్ణయ ం వెనకి తీసుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 7వ వరకు పోస్టు కార్డుల ఉద్యమం, అనంతరం 8వ తేదీన రైల్ నిలయం ముట్టడించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.బాలకృష్ణ, షేక్ మహమూద్, కరీం, కిరణ్, ప్రదీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వేట: ఆరుగురు అరెస్ట్

### ఎయిర్ గన్లు, రైఫిల్, స్కార్పియో కారు స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** షాద్‌నగర్, మక్తల్ అటవీ ప్రాంతాల్లో ఎయిర్ గన్లతో వన్యప్రాణులను అక్రమంగా వేటాడుతున్న ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. కమిషనర్ టాస్క్ ఫోర్స్ (గోల్కొండ జోన్) బృందం చేపట్టిన ఈ ఆపరేషన్‌లో నిందితుల వద్ద నుంచి భారీగా ఆయుధాలు, వాహనం, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ ముఠా గత ఏడాది కాలంగా షాద్‌నగర్, మక్తల్ అడవుల్లో జింకలు, నెమళ్లు, కుందేళ్లు, పక్షులను లక్ష్యంగా చేసుకుని వేట సాగిస్తోంది. మక్తల్ ప్రాంతానికి చెందిన వ్యక్తి అడవిలో వన్యప్రాణుల ఆచూకీ అందించగా, హైదరాబాద్‌కు చెందిన సభ్యులు ఎయిర్ గన్లు, రైఫిల్‌లతో వెళ్లి వేటాడేవారు. నిందితుల వద్ద నుంచి నాలుగు ఎయిర్ గన్లు, ఒక లైసెన్స్ స్పోర్టింగ్ రైఫిల్, 20 తూటాలు, ఒక స్కార్పియో కారు, ఎనిమిది మొబైల్ ఫోన్లు (వేట వీడియోలతో), బటన్ నైఫ్ స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసిన ఆస్తుల విలువ సుమారు రూ.8 లక్షలుగా అంచనా వేస్తున్నారు. దర్యాప్తులో నిందితులు పలు సార్లు జింకలు, నెమళ్లు వేటాడి మాంసాన్ని వినియోగించినట్లు బయటపడింది. వేట అనంతరం జంతువుల అవశేషాలను జూరాల బ్యాక్‌వాటర్స్ ప్రాంతంలో పడేసినట్లు గుర్తించారు. నిందితుల్లో ఒకరు షూటర్‌గా గుర్తింపు పొందినప్పటికీ, తన వద్ద ఉన్న లైసెన్స్ ఆయుధాన్ని అక్రమ వేటకు వినియోగించినట్లు అధికారులు తెలిపారు. ఈ ముఠాపై వన్యప్రాణ సంరక్షణ చట్టం1972 కింద కేసు నమోదు చేసి, తదుపరి విచారణ కోసం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌ను అడిషనల్ డిసిపి అందె శ్రీనివాసరావు పర్యవేక్షణలో, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఎస్‌ఐ వెంకటరమణ తదితర సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు.

## వామపక్షాలతోనే కలిసి నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

234 మంది సభ్యులు కలిగిన అసెంబ్లీలో మెజారిటీ లేని టివికెకు మద్దతు ఇవ్వడంపై వామపక్షాలు, విసికె వైఖరి ఏమిటని విలేకరులు ప్రశ్నించినప్పుడు, తన పార్టీ, వామపక్షాలు ఎప్పటి నుంచో లౌకిక రాజకీయాల విషయంలో కలిసి నడుస్తున్నాయని తిరుమావలవన్ వారికి వివరించారు. టివికెకు మద్దతు ఇచ్చే అంశంపై ఆయన స్పష్టతనిస్తూ, ఆ విషయాన్ని తాము పరిశీలనకు తీసుకోలేదని గానీ, దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని గానీ తెలిపారు.

### కేవలం కాంగ్రెస్ మద్దతుతో టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు

నటుడిగా ఉండి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్ నేతృత్వంలోని టివికె, కేవలం కాంగ్రెస్ మద్దతుతో మాత్రమే తమిళనాడులో అధికారంలోకి రాలేదని డిఎంకె నాయకుడు టికెఎస్ ఇలంగోవన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కేవలం ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, కాబట్టి ఆ పార్టీ మద్దతుతో టివికె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదని ఆయన పిటిఐకి తెలిపారు. టివికెకు ఎఐఎడిఎంకె మద్దతు కూడా అవసరమవుతుందని పేర్కొంటూ, ఎఐఎడిఎంకెకు బిజెపి నుండి ఎటువంటి ఆదేశాలు వచ్చాయో నాకు తెలియదని ఇలంగోవన్ అన్నారు. 'ఒకవేళ ఎఐఎడిఎంకె విజయ్‌కి మద్దతు ఇవ్వకపోతే, అసెంబ్లీలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించక పోతుంది, తద్వారా మళ్ళీ కొత్త ఎన్నికలు నిర్వహించాల్సి రావచ్చు' అని ఆయన అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకె ఓటమికి సంబంధించి మాట్లాడుతూ 'ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది, మేము ప్రస్తుతం ఆ విషయాన్ని పరిశీలిస్తున్నాము' అని ఆయన తెలిపారు. అధికారంలోకి రావడం మాత్రమే డిఎంకె ఏకైక లక్ష్యం కాదని, ఆ పార్టీ గత అనేక దశాబ్దాలుగా అధికారంలో కొనసాగుతూనే ఉందని ఆయన గుర్తుచేశారు. డిఎంకె అధికారంలోకి రావడం బిజెపికి ఇష్టం లేదని కూడా ఇలంగోవన్ ఆరోపించారు. తాము అధికారంలోకి రాలేము కాబట్టి, తమిళనాడులో అల్లకల్లోలం సృష్టించడానికి బిజెపి ప్రయత్నించిందని పేర్కొన్నారు.

## ఓట్ల చోరీ

(మొదటి పేజీ తరువాయి)

పక్కన పెట్టి, దేశం కోసం బిజెపికి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. 'కాంగ్రెస్‌లోని కొందరు, ఇతరులు కొందరు బెంగాల్‌లో టిఎంసి ఓటమిని చూసి సంబరపడిపోతున్నారు. వారు ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అసోం, బెంగాల్ ప్రజల తీర్పును దొంగిలించడం అనేది భారత ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో బిజెపి వేసిన ఒక పెద్ద ముందడుగు. స్వల్ప రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టండి. ఇది ఒక పార్టీకి లేదా మరొక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది భారతదేశానికి సంబంధించిన విషయం' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. బెంగాల్‌లో 100 కంటే ఎక్కువ సీట్లను లూటీ చేసిందని ఆ రాష్ట్ర మాజీ సిఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషన్ బిజెపి కమిషన్‌గా మారిపోయిందని ఆరోపించారు. బెంగాల్‌లో బిజెపి సాధించిన విజయాన్ని అనైతికతం, చట్టవిరుద్ధం అని పేర్కొన్నారు. మమతా బెనర్జీ చేసిన ఈ వ్యాఖ్యలతో రాహుల్ గాంధీ పూర్తిగా ఏకీభవించారు. 'ఎన్నికల కమిషన్ మద్దతులో బిజెపి అసోం, బంగాల్ ఎన్నికలను చోరీ చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. మేము మమతా బెనర్జీతో ఏకీభవిస్తున్నాం. బంగాల్‌లో 100 కంటే ఎక్కువ సీట్లు చోరీ అయ్యాయి' అని రాహుల్ తన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com